# ఎర్రని గుర్తు

నవల

- కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ మునివేళ్ళలో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 99

కౌముది మాసపత్రికలో

జనవరి 2014 సంచిక నుంచి మార్చ్ 2015 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

**"ఇదే ఇల్లు" అన్నాడు డిటెక్టివ్ యుగంధర్ క్రిజ్లర్** కారు డ్రయివ్ చేస్తున్న రాజుతో. రాజు కారు గేటులోకి తిప్పాడు. గేటుకి తగిలించి ఉన్న బోర్డు పరీక్షగా చూస్తూ "ఎస్. భుజంగరావు. రిటయర్డు జడ్జి" అని ఉంది బోర్డుమీద.

"రిటయిర్డు జడ్జికి మనతో ఏం పనో?" నవ్వుతూ అంటూ రాజు కారు పోర్టికోలో ఆపాడు. ముందు యుగంధరూ, తర్వాత రాజు కారు దిగారు. మెట్లెక్కగానే పెద్ద వసారా. వసారాకి రెండు తలుపులున్నాయి. రెండూ హాల్లోకి ఉన్నాయి. చాలా పెద్ద హాలు. అంగుళమైనా నేల కనిపించకుండా తివాసీ, రెండు సోఫాసెట్లు, నాలుగు కుషన్డ్ కుర్చీలు, చిన్న చిన్న బల్లలు, వాటి మీద పూలతొట్టెలు, పెద్ద గోడ గడియారం. హాల్లో ఎవరూ లేరు. రాజు కాలింగ్ బెల్ కోసం వెతుక్కున్నాడు. అంతలో పద్దెనిమిదేళ్ళ యువతి హాల్లోకి వచ్చి, దబదబా తలుపు దగ్గరికి వెళ్ళి "ఎవరు కావాలి?" అడిగింది.

"భుజంగరావుగారు" అన్నాడు యుగంధర్.

"మీ పేరు?" అడిగింది.

"యుగంధర్. భుజంగరావుగారు నన్ను ఓసారి రమ్మని టెలిఫోన్ చేశారు" అన్నాడు యుగంధర్.

"అవును, తాతయ్య చెప్పాడు మీరు వస్తారని. మీ ఆనవాలు తెలిపే –" అని చిన్నగా నవ్వి

"వచ్చిన మనిషి యుగంధరేనని నిర్ధారణ చేసుకోమని తాతయ్య చెప్పాడు" అన్నది.

యుగంధర్ జేబులోంచి విజిటింగ్ కార్డు తీసి ఇస్తూ "అంత జాగ్రత్తపడేవాళ్ళు హాల్లో ఎవరూ లేకుండా ఎందుకు చేశారు?" అడిగాడు.

"ఎవరూ ఉండవలసిన అవసరం లేదు" అని తలుపు పక్క చూసింది. యుగంధరూ, రాజూ కూడా చూశారు. నల్లని కుక్క, చాలా పెద్దది, పెద్ద కొబ్బరి కాయంత తల – తివాసీ మీద పడుకునున్నది.

"మమ్మల్ని చూసి అరవలేదేం?" అడిగాడు రాజు.

"అరవదు. హాల్లోకి వచ్చినా ఏం చెయ్యదు. మేము మెట్లు ఎక్కినా, లోపలికి వెళ్ళబోయినా మీద పడుతుంది" అన్నది నవ్వుతూ.

ఆ అమ్మాయి ముందు, వెనక యుగంధరూ, తర్వాత రాజు హాల్లోంచి మెట్లవైపు వెళుతున్నారు. సోఫా మధ్యనున్న బల్లమీది పూల సజ్జెలో ఎర్రని గులాబీ పువ్వులు గుత్తిగా ఉన్నాయి. రాజు ఒక పువ్వు తీసుకోపోయాడు. గుర్రుమంటూ ఆ కుక్క ఒక్క ఉరుకు ఉరికింది. రాజు చేతులమీద రెండు కాళ్ళూ వేసి పళ్ళు చూపించింది.

"టైగర్! వెళ్ళు" అన్నదా యువతి. వెంటనే ఆ కుక్క వెనక్కి వెళ్ళి తన స్థానంలో పడుకున్నది. "ఎవరూ ఏదీ ముట్టుకోకూడదు. మేము లేనిదే దాసీదాన్ని కూడా ఈ హాలు ఊడవనివ్వదు" అన్నదా యువతి.

"ఎవరయిన ఏదయినా పెడితే తింటుందా?" అడిగాడు రాజు.

"ఊఁహూ! ముట్టుకోదు."

మెట్లు ఎక్కారు. పెద్దహాలు. హాలుకి చెరోవైపున ఓ గది. కుడివైపునున్న గదిలోకి తీసుకువెళ్ళి "తాతయ్యా! డిటెక్టివ్ యుగంధర్ వచ్చారు" చెప్పింది ఆమె.

"రండి రండి. అలా కూర్చోండి" అన్నాడు భుజంగరావు. పడక కుర్చీలో పడుకుని పత్రిక చదువుతున్నాడు.

యుగంధర్ గది చుట్టూ చూశాడు. విశాలమైన గది. తలుపుకి ఎదురుగా రెండు కిటికీలు. కిటీకలకి ఊచలు. గదిలో తలుపుకి ఎడం వైపు ఇంకో తలుపున్నది. గది మధ్య మంచం, పక్కన బల్ల, బల్లమీద ఎల్క్ట్రిక్ దీపం, టెలిఫోన్, పుస్తకాలు, కాగితాలు.

"ఆయన మీ అసిస్టెంటు రాజు కదూ! చాలా కాలం అయింది చూసి. పద్మా! కాఫీ పంపించు" అన్నాడు భుజంగరావు. ఆ యువతి తల ఊపి వెళ్ళిపోయింది.

"నా మనుమరాలు. పద్మప్రియ. ఈ సంవత్సరమే బి.ఏ పాసయింది. లా చదువుతానంటోంది" అని చిన్నగా దగ్గి, చుట్ట వెలిగించి "మీరు బిజీగా ఉన్నారా?" అడిగాడు భుజంగరావు.

"అంత తొందర పనులేమీ లేవు."

"నాకు మీ సహాయం కావాలి. ఒక విషయం దర్యాప్తు చెయ్యాలి."

"చెప్పండి" ప్రోత్సహించాడు యుగంధర్.

భుజంగరావు పడక కుర్చీలోంచి లేచి, బల్ల దగ్గరికి వెళ్ళాడు. అయిదడుగుల ఆరు అంగుళాల పొడుగు, సన్నగా ఉన్నాడు. పూర్తిగా తెల్లబడిన వెంట్రుకలు పీచులా ఉన్నాయి తలమీద. దళసరి కళ్ళద్దాలు, తెల్లని పంచ, లాల్చీ వేసుకున్నాడు. బల్ల సొరుగు తెరిచి అందులోంచి ఒక పెద్ద కవరు తీసుకువచ్చి యుగంధర్‌కి ఎదురుగా కూర్చున్నాడు. ఆ కవరులోంచి ఒక చిన్న కవరు తీశాడు.

"మూడు నెలల క్రితం నాకు ఈ కవరు పోస్టులో వచ్చింది" అన్నాడు భుజంగరావు ఆ కవరు యుగంధర్‌కి అందించి. కవరు ఒక వైపున చింపి ఉంది. యుగంధర్ కవరులోంచి ఒక కాగితం బయటికి తీశాడు. రెండు అంగుళాల వెడల్పు, ఒకటిన్నర అంగుళం పొడుగు ఉన్న కాగితం అది కాగితం మధ్య ఎర్రని సిరాతో ఎక్స్ మార్క్ గుర్తున్నది. చాలా చిన్న గుర్తు. ఇంకేమీ లేదు. యుగంధర్ ఆ కాగితం వెనక్కి తిప్పి చూశాడు. తెల్లగా ఉంది ఆ ఎక్స్ గుర్తు తప్ప ఇంకేమీ లేదు.

"మొదట ఈ కవరు వచ్చింది" అన్నాడు భుజంగరావు. యుగంధర్ కవరు పరీక్ష చేశాడు. మౌంట్ రోడ్ పోస్టాఫీసులో పోస్టు చేసినట్లు ముద్ర ఉన్నది "తర్వాత"? అడిగాడు.

"ఇంకో ఉత్తరం వచ్చింది. సరిగా వారం రోజుల తర్వాత" అన్నాడు భుజంగరావు ఇంకో కవరు అందిస్తూ. అదే సైజు కవరు, అందులో అదే సైజు కాగితం కానీ ఆ కాగితం మీద ఎర్రని ఎక్స్ గుర్తు ఇంకొంచెం పెద్దదిగా ఉంది. అంతే తేడా.

"దీన్ని కూడా మౌంట్ రోడ్ పోస్టాఫీసులో పోస్ట్ చేశారు" అన్నాడు భుజంగరావు. యుగంధర్ ఆ కవర్లు, వాటిలో కాగితాలు అతని అసిస్టెంటు రాజుకి అందించాడు.

"ఆ తర్వాత వరసగా వారానికి ఒకటి చొప్పున ఈ మూడూ వచ్చాయి" అని భుజంగరావు మరో మూడు కవర్లు ఇచ్చాడు యుగంధర్‌కి. వాటిలో కాగితాలనీ జాగ్రత్తగా పరీక్ష చేశాడు. అన్నీ ఒకే రకమైన తెల్లకాగితాలు. రెండు అంగుళాల పొడుగు, ఒకటిన్నర అంగుళం వెడల్పు. ఒకదానిమీద కన్నా ఇంకొక దాని మీద వరస క్రమంగా ఎర్రని గుర్తు పెద్దదిగా ఉంది. అంతే తేడా. ఆఖరు దానిలో దాదాపు కాగితం అంతా నిండిపోయింది గుర్తు. "మీకేమయినా అర్థమవుతోందా?" అడిగాడు భుజంగరావు.

"ఎర్రని గుర్తుకి అపాయం ఉందని అర్థం. వారం వారం ఆ గుర్తు పెద్దదవుతోంది కనుక అపాయం ఎక్కువ అవుతోంది అని అనుకోవాలి" అన్నాడు యుగంధర్.

భుజంగరావు తల ఊపి "నేనూ అలాగే అనుకున్నాను. ఎటొచ్చీ నాకు అర్థం కానిదల్లా నా శ్రేయస్సు కోరే మనిషి ఈ హెచ్చరిక పంపుతున్నాడా? లేక నన్ను బెదిరించదలచుకున్న మనిషా! మూడో కవరు వచ్చిన తర్వాత పోలీసులకి తెలియచేశాను" అన్నాడు.

అంతలో రెండు కప్పుల కాఫీ తీసుకుని పద్మప్రియ వచ్చింది.

కాఫీ తీసుకోమని యుగంధర్‌కీ, రాజుకీ చెప్పి "నువ్వు అలా కూర్చో" అన్నాడు భుజంగరావు మనుమరాలితో.

"పోలీసులేమన్నారు?" అడిగాడు యుగంధర్.

భుజంగరావు నవ్వాడు. "చాలా హడావిడి చేశారు. ఎంతయినా నేను రిటయిర్డు జడ్జిని కదా! నాకెవరయినా శత్రువులున్నారా అని అడిగారు. ఒంటిగా నన్ను ఎక్కడికీ వెళ్ళవద్దని హెచ్చరించారు. నాలుగు రోజులపాటు ఇంటివద్ద ఒక మఫ్టీ కానిస్టేబుల్‌ని కాపలా ఉంచారు. ఎవరూ మా ఇంటి ప్రాంతాలకి రాలేదు. నాకు హాని చేయడానికి ప్రయత్నించలేదు. ఎవడో పిచ్చివాడు ఆ కాగితాలు పంపుతున్నాడని నిశ్చయించారు" అన్నాడు.

"నిజంగా మీకు ఆపద ఉందని మీరు ఎందుకు అనుకున్నారు?" అడిగాడు యుగంధర్.

భుజంగరావు ఆశ్చర్యంతో యుగంధర్‌ని చూసి "అది మీకెలా తెలుసు?" అడిగాడు.

"మీకు అటువంటి భయం లేకపోతే నన్ను ఎందుకు పిలుస్తారు?" అడిగాడు యుగంధర్.

భుజంగరావు నవ్వి "అంత సింపుల్‌గా తెలుసుకున్నారా! అవును. చెపుతాను వినండి. రెండు రోజుల క్రితం ఆ ఆఖరు ఉత్తరం వచ్చింది. అందులో ఎర్రని ఎక్స్ గుర్తు పెద్దదిగా ఉంది. అంటే అపాయం ఎక్కువైంది అని అర్థంగా! ఆ విషయం గురించే ఆలోచిస్తూ పడుకున్నాను. ఒంటి గంటకి టెలిఫోన్ మోగింది. మాట్లాడుతున్నది నేనని తెలుసుకున్న తర్వాత 'నీ అవసాన దశ సమీపించింది. ఇక కొద్దిరోజులే' అన్నాడు ఎవడో. నేను ఏమీ అనకముందే టెలిఫోన్ డిస్‌కనెక్టు చేసేశాడు. టెలిఫోన్ ఎక్స్‌ఛేంజ్‌కి ఫోన్ చెయ్యడం అనవసరం అని నాకు తెల్సు. ఆటోమేటిక్ ఎక్స్‌ఛేంజ్ అవడం వల్ల ఎక్కడినుంచి ఫోను చేసిందీ తెలీదు.." అన్నాడు.

"టెలిఫోన్ లో ఆ మాటలు అన్న మనిషి మొగవాడా? ఆడదా?"

"ఏమో.. గొంతుమార్చి కీచు చేసి మాట్లాడారు.."

"పోలీసులకి తెలియచేశారా?"

"చేశాను. వెంటనే పాపం అసిస్టెంటు కమిషనర్ ఆఫ్ క్రైంస్ వచ్చాడు. ఇంట్లోకి ఎవరూ రాకుండా ఎలా కట్టుదిట్టాలు చెయ్యాలో చెప్పాడు. నా యింటికి వచ్చే టెలిఫోన్ కాల్స్ ఎక్కణ్ణుంచి వచ్చేదీ రాసి వుంచమని టెలిఫోన్ ఎక్స్‌ఛేంజ్‌కి చెపుతానన్నాడు"

"అంతేనా?" అడిగాడు యుగంధర్.

"అసిస్టెంటు కమీషనర్ అంతకన్నా ఏం చెయ్యగలడు?

"నిన్న మళ్ళీ టెలిఫోన్‌లో అదే మనిషి మాట్లాడాడు."

"ఏమని?" అడిగాడు యుగంధర్.

"ఎంతమంది పోలీసులు కాపలా కాచినా ప్రయోజనం లేదని, ఇంకో వారం రోజులలో నాకు చావు తప్పదనీ అన్నాడు."

"మీరు టెలిఫోన్ ఎక్సేంజ్ కి ఫోన్ చెయ్యలేదా?"

"చేశాను. మౌంటు రోడ్ పబ్లిక్ ఫోన్ బూత్ నుంచి వచ్చిందట ఆ టెలిఫోన్ కాల్. పోలీసులు వెళ్ళేటప్పటికి అక్కడ ఎవరూ లేరుట."

"తర్వాత?" అడిగాడు యుగంధర్.

"తర్వాత ఏం జరగలేదు. ఏం చేద్దామా అని ఆలోచించాను. పోలీసులు చాలా సమర్థులు. అందులో సందేహంలేదు. కానీ నా విషయంలో వాళ్ళు ఏం చెయ్యగలరు? నిజంగా నన్ను ఎవరో హత్య చేస్తే అప్పుడు తప్పకుండా హంతకుణ్ణి పట్టుకుంటారు. నేరాలు జరగకుండా ఆపడం కష్టం" అని చెక్కపెట్టెలోంచి కొరనా చుట్ట తీసి వెలిగించి, పొగ వదిలి, "నాకు అరవై రెండేళ్ళు. భార్యపోయి

చాలాకాలం అయింది. ఒక్కడే కొడుకుండేవాడు. వాడి కూతురే ఈ పద్మ. దాని దురదృష్టం, నా దురదృష్టం. వాడూ, నా కోడలూ కూడా కలకత్తా మెయిల్ ఆక్సిడెంటులో మరణించారు. ఎలాగో పద్మకి చిన్న గాయం కూడా తగలలేదు. తండ్రీ తల్లితో అదీ ఆ పెట్టెలోనే ప్రయాణం చేసింది. ఈ దుర్ఘటన జరిగి పన్నెండేళ్ళయింది. అప్పట్నించీ పద్మ నా దగ్గిరే పెరుగుతోంది" భుజంగరావు నిట్టూర్చి "ఇక బతికి సాధించేది సాధించవలసినదీ ఏమీ లేదు. రేపే నేను మరణించవలసి వచ్చినా చింతించను అది భగవంతుడి నిర్ణయం అయితే. కనీ ఎవరో నన్ను చంపుతానంటే సహించలేకుండా ఉన్నాను. భయంవల్ల కాదు, కోపం వల్ల. ఈ జీవితంలో నేను ఎవరికీ అపకారం చెయ్యలేదు. జడ్జిగా కూడా నా ధర్మం నేను నిర్వహించాను కానీ ఒకళ్ళ ఒత్తిడి వల్లో, డబ్బుకి ఆశపడో వృత్తి ధర్మం తోసి పుచ్చి అక్రమంగా ప్రవర్తించలేదు. అందుకే కోపంగా ప్రవర్తించలేదు. అందుకే కోపంగా ఉంది. నేను ఎవరికయినా అపకారం చేసి ఉంటే ఆ మనిషి నా ముందుకి వచ్చి నువ్వు నాకు ఈ అపకారం చేశావు అని చెపితే బావుండేది. అందుకే మిమ్మల్ని పిలిచాను.

యుగంధర్ గారూ ఈ బెదిరింపు గుర్తులు ఎవడో పిచ్చివాడో, ఎవరో హాస్యానికో నాకు పంపుతున్నాడని నేను అనుకోవడంలేదు. నావల్ల, నాకు తెలియకుండానే ఎవరికో తీరని అపకారం జరిగి ఉండాలి. నేను బుద్ధి పూర్వకంగా అపకారం చేశానని ఆ మనిషి అనుకుంటూ ఉండాలి. అందుకే అంత ద్వేషంతో నన్ను హతమార్చడానికి పూనుకున్నాడు. మీరు నా ప్రాణాన్ని రక్షించడం కన్నా ముఖ్యంగా చెయ్యవలసిన పనులు ఆ మనిషి ఎవరు, నా వల్ల అతనికి ఏం అపకారం జరిగింది అని తెలుసుకోవడం. నాకు తెలియకుండానే నేను ఎవరికో అపకారం చేసి ఉంటే క్షమాపణ చెప్పుకుని వీలైనంతవరకూ నష్టపరిహారం ఇస్తాను. దౌర్జన్యం ప్రదర్శించి ఆ మనిషి తన జీవితం నాశనం చేసుకోకుండా చూడాలి. అదే నేను మీ నుంచి కోరేది," అన్నాడు భుజంగరావు.

యుగంధరు, రాజు భుజంగరావుని ఆశ్చర్యంతో చూశారు. ఎంత ఉదారస్వభావం! ఎంత లోతయిన మనిషి!

"ఆ విషయం అలా ఉంచి, మీకు ఆపద కలగకుండా కొన్ని కట్టుదిట్టాలు చెయ్యనా ముందు?" అన్నాడు యుగంధర్.

"అవును, ఆ విషయమే నేను తాతయ్యకి చెప్పాను. వింటేగా!" అన్నది పద్మప్రియ.

"చెయ్యండి. ఈ విషయంలో మీరు ప్రజ్ఞావంతులు. అనుభవం ఉన్నవారు. నేను కోరేదేమిటో చెప్పాను. ఎలా చెయ్యవలసినదీ మీకు నేను చెప్పే అర్హత లేదు" అన్నాడు భుజంగరావు.

"గుడ్! ఆ పని రాజుకి అప్పచెపుతాను. మీరు మీ గత జీవితంలోకి తొంగి చూడాలి - ముఖ్యంగా మీ వృత్తి గత జీవితంలోకి. సెషన్సు కోర్టులో చాలాకాలం పనిచేశారు. మీరు విచారించి, తీర్పు చెప్పిన కేసులన్నీ జ్ఞాపకం చేసుకుని వెనక్కి తవ్వుకు వెళ్ళాలి" అన్నాడు యుగంధర్.

"అది సులభమే. నా దగ్గిర డైరీ ఉన్నది" అన్నాడు భుజంగరావు.

●●●

**"వంటవాడు నారాయణ ఒక్కడే ఇంట్లో ఉంటాడు.** దాసీది పొద్దున్నొచ్చి సాయంకాలం వెళ్ళిపోతుంది. తోటమాలీ, డ్రయివరూ కూడా అంతే!" అన్నది పద్మప్రియ.

"ఈ వంటవాడు నారాయణ ఎంతకాలంనుంచీ మీ ఇంట్లో పనిచేస్తున్నాడు?" అడిగాడు రాజు.

"నేను పుట్టకముందు నుంచీ" అన్నది పద్మప్రియ నవ్వుతూ. నవ్వగానే రెండు బుగ్గలమీద సొట్టలు పడ్డాయి.

"మీ గది కూడా మేడమీదేనా?"

"అవును. తాతయ్య గది పక్కన ఉన్నది. ఈ కింది తలుపులు, కిటికీలు మూసేసి గడియలు పెడితే దొంగలు రావడం దుర్లభం."

"రాత్రిళ్ళు తలుపులు గడియలు పెట్టేది ఎవరు?"

"నారాయణ."

"ఈ కుక్క ఎక్కడ ఉంటుంది?"

"హాల్లోనే"

"పగలు ఈ వాకిలి తలుపు ముయ్యరా?"

"ఉహూ! ముయ్యము కుక్క ఉందిగా! ఎవరూ గుమ్మం దాటి లోపలికి రారు. వచ్చినా భయపడి వెనక్కి వెళ్ళిపోతారు."

"పదండి. మేడ చూడాలి" అన్నాడు రాజు.

భుజంగరావు గది మినహా మేడమీద గదులు అన్నీ చూశాడు. "హాల్లోంచి ఉన్న మెట్లు తప్ప మేడమీదకి రావడానికి వేరే మార్గం లేదు." అన్నాడు చివరికి.

"అవును. ఈ గది బయట నీటి గొట్టం ఉండేది. దాన్ని పట్టుకుని ఎవరైనా పైకి ఎక్కి వస్తారేమోనని ఈ మధ్య నేనే తీయించేశాను."

"మీ తాతగారికి వచ్చిన ఆ ఎర్రని గుర్తు ఉత్తరాల గురించి మీకేమైనా తెలుసా?"

"తెలియదు."

"మీరూ, మీ తాతగారూ తరచూ బయటికి వెళ్ళుతుంటారా?"

"తాతయ్య సామాన్యంగా బయటికి వెళ్ళడు. వారానికోసారి బీచికి వెళతాడు. ఎప్పుడయినా ఏదైనా మీటింగుకి అధ్యక్షుడిగా పిలిస్తే వెళతాడు. నేను రోజూ సాయంకాలం అయిదుగంటలకల్లా బయటికి వెళతాను కాలేజీ లేనపుడు. కాలేజీ ఉన్నపుడు పొద్దున్న తొమ్మిదిన్నర కెళ్ళి సాయంత్రం అయిదుగంటలకి వచ్చేదాన్ని."

"కాలేజీ లేనపుడు సాయంకాలాలెక్కడికి వెళతారు?"

"స్నేహితుల ఇంటికో, సినిమాకో, పార్కుకో, బజారుకో"

రాజు తల ఊపాడు. "ఈ ఎర్రని గుర్తు హెచ్చరికలు పంపుతున్న మనిషిని పట్టుకునేంతవరకూ మీకు కొన్ని కట్టుదిట్టాలు చెయ్యాలి."

"ఏమిటి?"

"పగలు కూడా వాకిలి తలుపు మూసి, లోపల గడియ పెట్టాలి. వెనక తలుపు కూడా అంతే. అవసరమైనపుడు తలుపు తెరిచి వెంటనే మూసెయ్యాలి. ఎవరయినా తలుపు తట్టినా, కాలింగ్ బెల్ నొక్కినా వెంటనే తలుపు తెరవకూడదు. కిటికీలోంచి ఎవరయినదీ చూసి తెలిసిన మనిషి అయితేనే తలుపు తియ్యాలి. డ్రయివర్‌కి, దాసీ మనిషికీ, తోటమాలికీ కొత్తవాళ్ళని లోపలికి రానివ్వద్దని చెప్పాలి."

"ఇంకా?"

"మీ తాతగారు బయటకి వెళ్ళకూడదు. మీటింగులకి కూడా వెళ్ళకూడదు. మీరు కూడా అలా తిరగకూడదు. కాలేజీలో చేరాక, కాలేజీకి వెళ్ళి తిన్నగా ఇంటికి రావాలి."

"నేనెందుకు జాగ్రత్తపడడం?" అడిగింది పద్మ ఆశ్చర్యంతో.

"మీ తాతగారి మీద కసి తీర్చుకోవడానికి మీకు హాని చెయ్యవచ్చు. అందుకని అనుమానాస్పదంగా ఉండే ఏ మనిషి వచ్చినా సరే. వెంటనే మాకు టెలిఫోన్ చెయ్యాలి" చెప్పాడు రాజు.

పద్మప్రియ తల ఊపి "మీరు చెప్పినట్లు చేస్తే తాతయ్యకి ఏ ఆపదా రాకుండా ఉంటుందని హామీ ఇవ్వగలరా?" అడిగింది.

"అటువంటి హామీ ఇవ్వలేము. మీ తాతగారికి ఎటువంటి ఆపద రాకుండా మా ప్రయత్నం మేము చేస్తాము."

"ఇంతేనా, ఇంకా ఏమైనా సూచనలున్నాయా?"

"మీ ఇంటికి తరచూ ఎవరెవరు వస్తుంటారు?"

"పొద్దున్న పాలవాడు, కూరలు అమ్మే మనిషి, వారానికోసారి చాకలాడు, నెలకోసారి ఎలక్ట్రిసిటీ ఆఫీసు నుంచి మీటర్ చూడడానికి ఓ ఉద్యోగి, వెచ్చాల కొట్టుమనిషి, అప్పుడప్పుడు బాంకు జవాను, రోజూ పోస్ట్‌మాన్" అన్నది పద్మ గుక్క తిప్పుకోకుండా.

రాజు నవ్వి "గుడ్! వీళ్ళు కాక మీ స్నేహితులు, మీ తాతగారి స్నేహితులు?" అడిగాడు.

పద్మప్రియ చెక్కిళ్ళమీది లేత గులాబీ రంగు కాస్త ముదురయింది. "నా క్లాస్‌మేట్స్ పంకజం, సునీత తరుచూ వస్తూ ఉంటారు. సునీత అన్న ద్వారక నాథ్ అప్పుడప్పుడు వస్తాడు. తాతయ్య కోసం ఎవరూ రారు."

"బంధువులు?"

"మాకు ఈ ఊళ్ళో బంధువులెవరూ లేరు."

"అంతే! నేను చెప్పిన విషయాలు జ్ఞాపకం ఉంచుకోండి" అని రాజు భుజంగరావు గదిలోకి వెళ్ళాడు.

"నీ పని అయిందా రాజు. ఇక మనం వెళదాం" అన్నాడు యుగంధర్.

## 3

"చాలా కష్టమైన పని" అన్నాడు యుగంధర్.

రాజు భుజంగరావు ఇంటి గేటులోంచి కారు రోడ్ మీదికి జాగ్రత్తగా తిప్పి "ఏమిటి?" అడిగాడు.

"భుజంగరావుని ఎవరు అలా బెదిరిస్తున్నదీ తెలుసుకోవడం. క్రిమినల్ లాయర్‌గా చాలా కాలం హైకోర్టులో ప్రాక్టీసు చేశాడు. తర్వాత జడ్జి అయ్యాడు.

ఎంతమందినో విచారించి శిక్ష విచారించి శిక్ష విధించాడు. వాళ్ళలో ఎవరైనా కసిపెట్టుకునుంటే తెలుసుకోవడం చాలా కష్టం."

"ఆ కేసులన్నీ తవ్వి వెతికితే?" అడిగాడు రాజు.

"అలా చేసినా ఏం తెలుస్తుంది. ఏం ఊహించగలం. కోర్టులో శిక్ష విధించగానే ఎవరయినా బెదిరించారా అని అడిగితే లేదన్నాడు."

"పద్మప్రియకి చెప్పవలసినవన్నీ జాగ్రత్తగా చెప్పాడు. తెలివైనది" అన్నాడు రాజు.

"భుజంగరావు జడ్జిగా ఉన్నప్పుడు అతను చెప్పిన తీర్పు వచ్చాక ఎవరయినా కసిపెట్టుకుని ఉంటే ఒక్క భుజంగరావు మీద మాత్రం కసిపెట్టుకోరు. ఆ కేసుకి సంబంధించిన అందరిమీద మాత్రం కసిపెట్టుకుంటారు. కనుక అటువంటి ఎర్రని గుర్తు ఉత్తరాలు ఇంకెవరికైనా కూడా వచ్చేంతవరకూ ఓపికగా కాచుకునుండాలి. అంతవరకూ భుజంగరావుని కాపాడాలి. నువ్వు కానీ, నేను కానీ ఆ ఇంట్లో అతన్ని కాపలా కాస్తూ ఉండడానికి తీరిక ఉండదు కనుక ఎవర్నయినా ఏర్పాటు చెయ్యి" అన్నాడు యుగంధర్.

"చంద్రుని పంపిస్తాను."

"గుడ్. కారు పోలీస్ కమీషనర్ ఆఫీసువైపు తిప్పి నన్ను అక్కడ దింపి నువ్వు చంద్రుని కలుసుకో!" అని యుగంధర్ చెప్పగానే రాజు క్రిజ్లర్ కారు కెనమరా పక్కనుంచి పోనిచ్చాడు.

యుగంధర్‌ని చూడగానే అసిస్టెంటు కమీషనర్ కుర్చీలోంచి లేచి చెయ్యి అందించి

"కూర్చోండి యుగంధర్. చాలాకాలం అయింది మీరు మా ఆఫీసుకి వచ్చి" అన్నాడు.

యుగంధర్ షేక్ హేండ్ ఇచ్చి "అవును ఏదో పని ఉంటే తప్ప రాబుద్ధి పుట్టదు. మిమ్మల్ని డిస్టర్బు చెయ్యడం దేనికని రాను. ఇవేళ రిటయిర్డు జడ్జి భుజంగరావుగారిని కలుసుకున్నాను" అన్నాడు.

"ఆయన మిమ్మల్ని పిలిపించారా?" అడిగాడు అసిస్టెంటు కమిషనర్.

"అవును. ఆ ఎర్ర గుర్తు ఉత్తరాల గురించి మీరు కొంత దర్యాప్తు చేశారుటగా. ఆ వివరాలు తెలుసుకుందామని వచ్చాను."

"వివరాలు ఏమీలేవు. సామాన్యమైన పోస్టల్ కవర్ - ఏ పోస్టాఫీసులోనైనా కొనవచ్చు. కాయితమూ ఏ కొట్లోనయినా దొరుకుతుంది. సిరాలోకానీ, కలంలో కానీ ప్రత్యేకత ఏమీలేదు. ఎక్కడా వేలిముద్రలు లేవు."

"కవరు మీద దస్తూరి?"

"ఎవరిదో తెలీదు."

యుగంధర్ తల ఊపాడు. "ఇలాటి ఎర్రని గుర్తు బెదిరింపు ఉత్తరాలు మరెవరికైనా వచ్చాయా?" అడిగాడు.

"మాకు కంప్లెయింట్ రాలేదు."

"మద్రాసు నగరంలో ఉండే మనిషేకాక, ఇంకో ఊరిలో ఉన్న ఏ మనిషికో వచ్చి వుండవచ్చు. స్థానిక పోలీసులకి రిపోర్టు ఇచ్చి ఉండవచ్చు ఆ మనిషి. భుజంగరావుగారు జడ్జిగా ఉన్నప్పుడు ఆయన చెప్పిన తీర్పు కారణంగా ఎవరికో ఆయనమీద కసి కలిగివుంటే ఆయన ఒక్కరిమీదేకాక ఆ కేసులో పాల్గొన్న మిగతావాళ్ళ మీద కసి ఉంటుంది. కనక దయచేసి ఒక సర్క్యులర్ పంపండి."

"ఔను. మీరు చెప్పినదానిలో అర్థం లేకపోలేదు. ఈ వేళే సర్క్యులర్ పంపిస్తాను ఈ కేసుని మీరు తీసుకున్నారనగానే, నా మనసు కుదుటపడింది. భుజంగరావుగారికి హాని జరగకుండా మీరు చూస్తారని నాకు తెలుసు."

యుగంధర్ నవ్వి, "వస్తాను. ఈ కేసు స్వయంగా మీరే చూస్తున్నారా?" అడిగాడు.

"ఔను. నా పర్యవేక్షణ క్రిందే ఉంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు ఇన్చార్జి. మీ మిత్రుడేగా!" అన్నాడు కమిషనర్.

## 4

టెలిఫోను గణగణ మోగింది. రివాల్వింగ్ కుర్చీలో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్న యుగంధర్ రిసీవరు తీసుకుని, "హల్లో!" అన్నాడు.

"యుగంధరుగారా?"

"ఔను!"

"నేను భుజంగరావుని, మళ్ళీ ఓ కవరు వచ్చింది."

"ఏమున్నది దాంట్లో?"

"అలాటి కాయితమే. ఈసారి కాయితం నిండుగా నాలుగు మూలలూ కలుపుతూ ఎర్రని X గుర్తున్నది. అంటే ఆఖరిది అయివుండాలి" అన్నాడు భుజంగరావు.

"అయ్యుండవచ్చు. మీరు కంగారు పడకండి. చంద్రూ అనే అతను వచ్చాడా?"

"వచ్చాడు. నా గదిలోనే ఉన్నాడు."

"గుడ్! మీ గదిలోనే ఉండనివ్వండి."

"ఏమైనా తెలిసిందా?"

"లేదు"

"రేపట్నుంచి పద్మ కాలేజీకి వెళుతుంది."

"లా కాలేజీకా? వెళ్ళనీయండి."

"నా మీద వీలుకాకపోతే పద్మమీద కసితీర్చుకోవచ్చునని మీ అసిస్టెంటు రాజు చెప్పాడుట."

"ఆ!"

"కారులో వెళ్ళి కారులో వస్తుందిగా! జాగ్రత్తగా ఉండమనీ, ఇంటినుంచి బయలుదేరిన తర్వాత కాలేజీకి చేరుకునేటంతవరకూ ఎక్కడా ఆపవద్దనీ డ్రయివర్‌కి చెప్పండి. పద్మని కూడా జాగ్రత్తగా ఉండమని చెప్పండి."

"దానికి ఏదయినా ఆపద కలిగితే నేను భరించలేను" అన్నాడు భుజంగరావు.

యుగంధర్‌కి ఏం చెప్పాలో తోచలేదు. "అయితే పద్మ ఇంట్లోంచి కదలకూడదు. మిమ్మల్ని బెదిరిస్తున్న మనిషి ఎవరో, ఎందుకు బెదిరిస్తున్నాడో తెలిసేతంత వరకూ మీరూ, పద్మా ఇంట్లోంచి కదలడం మంచిదికాదు."

"పద్మకి నచ్చచెపుతాను. వినకపోతే ఏం చేస్తాను?" అని భుజంగరావు టెలిఫోన్ పెట్టేశాడు.

యుగంధర్ రాజుని పిలిచాడు. పక్కగదిలో కూర్చున్న రాజు రాగానే భుజంగరావుకి వచ్చిన మరో ఎర్రని గుర్తు ఉత్తరం గూర్చి చెప్పి "రాత్రిపూట భుజంగరావుకి కాపలా ఉండేందుకు ఇంకో మనిషిని పంపించాలి. ఆ ఏర్పాటు చెయ్యి" అన్నాడు.

"భుజంగరావుకి కాపలా మనుష్యులు ఏర్పాటు చెయ్యడం తప్ప మనం ఇంకేమీ చేస్తున్నట్టులేదే!" అన్నాడు రాజు.

యుగంధర్ నవ్వి "సులభంగా తేలే కేసు కాదు ఇది. ఆ ఎర్రని గుర్తు ఉత్తరాలు పంపుతున్న మనిషి ఏదో ఒక ప్రయత్నం చెయ్యాలిగా.. కాచుకుందాం" అన్నాడు.

భుజంగరావుకి రాత్రిళ్ళు కాపలాకి మనిషిని ఏర్పాటు చెయ్యడానికి రాజు వెళ్ళిపోయాడు. యుగంధర్ మళ్ళీ చదువుకోవడం ప్రారంభించాడు. చీకటిపడింది. బల్లమీద దీపం వెలిగించాడు. కొద్దిసేపటికి రాజు వచ్చి యుగంధర్ దీక్షగా చదువుతుండడం గమనించి తన గదిలోకి వెళ్ళిపోయాడు. తొమ్మిది గంటలవుతోంది. యుగంధర్ని భోజనానికి పిలుద్దామని యుగంధర్ ఉన్న గదిలోకి వెళ్ళాడు రాజు. సరిగ్గా ఆ సమయానికి టెలిఫోన్ చెవులు చిల్లులు పడేటట్లు గణగణ మోగింది. రాజు రిసీవర్ అందుకున్నాడు. క్షణం తర్వాత యుగంధర్‌కి రిసీవర్ ఇస్తూ "అసిస్టెంటు కమిషనర్ చాలా హడావిడిగా ఉన్నాడు. ఏదో జరిగింది" అన్నాడు.

అయిదు నిమిషాలు యుగంధర్ టెలిఫోన్‌లో అసిస్టెంటు కమిషనర్ చెప్పినది విని "యస్. వెంటనే బయలుదేరి వెళుతున్నాను" అన్నాడు రిసీవర్ పెట్టేస్తూ.

"ఏమిటిసార్?" అన్నాడు రాజు.

"రిటయిర్డు సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ హత్య చెయ్యబడ్డాడు" అన్నాడు యుగంధర్ కోటు వేసుకుంటూ.

"అయితే?" అడిగాడు రాజు.

"అతని చేతిలో ఎర్రని గుర్తున్న కాగితం ఉన్నదిట."

"మనం అనుకున్న మనిషినికాక -" అంటున్నాడు రాజు.

అతని మాటకి అడ్డం వచ్చి "పద" అన్నాడు యుగంధర్.

## 5

సి.ఐ.టి నగర్లో విడిగా ఉన్న ఒక చిన్న ఇల్లు. ఆ ఇంటిముందు ఒక పోలీస్ వాన్, ఒక జీపు, ఒక మోటార్ సైకిలూ ఉన్నాయి. అయిదుగురు పోలీస్ కానిస్టేబుల్స్ గేటు దగ్గిర నిలుచున్నారు. చుట్టుపక్కల ఇళ్ళల్లో ఉన్న వాళ్ళందరూ ఆ ఇంటివైపు చూస్తున్నారు. కొందరు ధైర్యం చేసి ఆ ఇంటి గేటు దగ్గరికి వెళ్ళి గుంపుగా నిలబడ్డారు. పోలీసులు వాళ్ళని వెళ్ళిపొమ్మని గదమాయిస్తున్నారు. రాజు క్రిజ్లర్ కారు పోలీస్ వాన్ వెనక ఆపాడు. యుగంధర్ని చూడగానే గేటు దగ్గర ఉన్న హెడ్ కానిస్టేబుల్ గుర్తుపట్టి సెల్యూట్ చేశాడు.

హాల్లో అసిస్టెంటు కమీషనర్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, సార్జంటు శివం నిలుచున్నారు. లోపల్నించి ఆడవాళ్ళ ఏడుపులు వినపడుతున్నాయి.

"పోలీస్ సర్జన్ శవాన్ని పరీక్ష చేస్తున్నాడు. నేను ఇప్పుడే వచ్చాను" అన్నాడు అసిస్టెంటు కమిషనర్.

"ఎర్రని గుర్తు అన్నారు టెలిఫోనులో?"

అసిస్టెంటు కమిషనర్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావుని చూసి చెప్పమన్నాడు.

"రిటయిర్డు పోలీసు సూపరిండెంటు మాధవన్ ఆ పక్క గదిలో పడక కుర్చీలో పడుకుని సాయంకాలం వచ్చిన దినపత్రిక చదువుకుంటున్నారట. ఎనిమిదన్నరకి ఆయన కుమార్తె భోజనానికి రమ్మని పిలవడానికి గదిలోకి వెళ్ళిందిట. పిలిస్తే పలకలేదట. దగ్గిరకి వెళ్ళింది. కుర్చీ వీపు తలుపువైపు ఉండడం వల్ల చూడలేదు. దగ్గిరకి వెళ్ళి ముందుకు ఒంగి చూసిందట. తల ఛాతీమీదనుంచి ఒళ్ళోకి రక్తం కారి రక్తంతో తడిసిపోయాయిట బట్టలు. కెవ్వున కేక పెట్టింది. మాధవన్ కొడుకు, కోడలు భార్య పరిగెత్తుకు వచ్చారు. అప్పటికే మాధవన్ మరణించాడు. వెంటనే కంట్రోల్ రూంకి ఫోన్ చేశారు. నేను వచ్చాను. మాధవన్ చెయ్యి మూసుకుని ఉంది. వేళ్ళమధ్య ఓ కాగితం కనిపించింది. జాగ్రత్తగా ఆ కాగితం తీశాను. అదే ఇది" అని ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు రెండు అంగుళాల పొడుగు, ఒకటిన్నర అంగుళం వెడల్పు ఉన్న తెల్ల కాగితం యుగంధర్కి ఇచ్చాడు. దానిమీద ఎర్రని గుర్తు నిండుగా ఉంది. "ఈ కాగితం చూడగానే అసిస్టెంటు కమీషనర్కి టెలిఫోన్ చేశాను." అన్నాడు.

"హత్య గురించి ఇంకేమీ వివరాలు తెలియలేదా?" అడిగాడు యుగంధర్.

"టయిం ఏదీ? వాళ్ళంతా దుఃఖంలో ఉన్నారు. జవాబులు చెప్పే స్థితిలో లేరు."

"యుగంధర్ మీ అనుమానం నిజమైంది. ఎవడో కసిపెట్టుకుని చేశాడు ఈ పని. రిటయిర్డు పోలీసు సూపరింటెండెంటుని హత్య చెయ్యి ప్రయత్నించేవాడు, ఏదో నేరం చేసి జైలుకు వెళ్ళి ఇప్పుడే బయిటికి వచ్చిన వాడయి ఉండాలి" అన్నాడు కమీషనర్.

"పాత కేసులు తిప్పితే భుజంగరావు గారు జడ్జీగా ఉన్నపుడు మాధవన్ దర్యాప్తు చేసి సెషన్సుకి పంపిన కేసు ఏదో, నేరస్థుడు ఎవడో సులభంగా తెలుస్తుంది" అన్నాడు స్వరాజ్యరావు.

"ఏమో! మాధవన్ సర్వీసులో ఎన్ని కేసులో దర్యాప్తు చేసి ఎంతమంది మీదో నేరారోపణ చేశాడు. భుజంగరావు ఎంతమందికో శిక్ష వేశాడు. సులభంగా తెలుస్తుందా?" అన్నాడు కమీషనర్. అంతలో పోలీస్ సర్జన్ గదిలోంచి బయటికి వచ్చాడు.

"నేను చెప్పగలిగింది ఆట్టే లేదు. ప్రాణం పోయి గంటయినా కాలేదు" అని చేతి గడియారం చూసుకుని "ఇప్పుడు తొమ్మిదిన్నరయింది. అంటే ఎనిమిది గంటల ముప్ఫయి నిమిషాల తర్వాత ప్రాణం పోయి ఉండాలి. కత్తి మొన సరిగ్గా గుండెలో గుచ్చుకుంది. కత్తి పొడుచుకున్న ఒకటి రెండు క్షణాలలో ప్రాణం పోయి ఉండాలి. బాగా దగ్గర్నించి బలంగా పొడిచి ఉండాలి. వెంటనే కత్తి తీసేసి ఉండటం వల్ల అంత రక్తం కారింది" అన్నాడు సర్జన్.

"పొడిచిన ఒకటి రెండు క్షణాలలో ప్రాణం పోయి ఉండాలన్నారు. ఆ లోపల అరిచి ఉండడా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"అరవడానికి ప్రయత్నం చేసి ఉండవచ్చు కాని గొంతులోంచి సన్నని మూలుగు మాత్రం వచ్చి ఉంటుంది. కత్తి కనీసం ఆరు అంగుళాల పొడుగు ఉండి వుండాలి" అన్నాడు సర్జన్.

"డాక్టర్! హతుడు కిటికీకి ఎదురుగా పడకకుర్చీలో పడుకున్నాడు. కిటికీ అవతల నిలబడి, ఊచల మధ్యనించి చెయ్యిజాపి పొడిచి ఉండవచ్చా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

డాక్టర్ తల విదిలించాడు. "హతుడు బలహీనుడు కాదు. అంత దూరాన్నుంచి కత్తితో చెయ్యి లోపలపెడితే ఎదురుగా కూర్చున్న మాధవన్ చూసి చెయ్యి పట్టుకునేవాడు. పక్కకి జరిగేవాడు. అంతే కాదు – కిటికీ అవతలనించి అంత బలంగా కత్తితో పొడవడం సాధ్యం కాదు. కత్తి పైనించి బాగా కిందికి గుండెలోకి దిగింది. అంటే హతుడు పడకకుర్చీలో పడుకునుండగా హంతకుడు దగ్గరగా నిలబడి పొడిచి ఉండాలి" అన్నాడు.

"థాంక్సు! మా పని పూర్తి అయిన తర్వాత మార్చురీకి పంపిస్తాము శవాన్ని" అన్నాడు ఇన్స్పెక్టర్.

డాక్టర్ తల వూపి వెళ్ళిపోయాడు.

"యుగంధర్! రండి!" అన్నాడు ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు. యుగంధరూ, రాజా స్వరాజ్యరావుతో కుడివైపునున్న గదిలోకి వెళ్ళారు.

గోడకి ఆనించి మంచం. మంచం పక్కన ఒక చిన్న బల్ల. బల్ల మీద పత్రికలు, కూజా, గ్లాసు. మంచానికి కొంచెం దూరంలో కిటికీకి ఎదురుగా పడక కుర్చీ, కుర్చీ వెనక గోడకి మేకుకి తగిలించి ఎలక్ట్రిక్ దీపం. కిటికీ తలుపులు తెరచి ఉన్నాయి. అడ్డంగా ఉన్నాయి వూచలు. పడక కుర్చీ ముందుకి వెళ్ళి నిలబడ్డాడు యుగంధర్. ఎన్నో హత్యలు, ఎంతో రక్తం, ఎన్నో భీకర దృశ్యాలు చూసిన యుగంధర్ కళ్ళే చెదిరిపోయాయి.

షర్టు, పంచ రక్తంతో ఎర్రగా తడిశాయి. మొహమంతా ఎర్రగా వుంది.

"తల ఛాతీ మీదకి వాలిపోవడం వల్ల ఛాతీమీది రక్తం మొహానికి అంటింది. అంతే" అన్నాడు ఇన్స్పెక్టర్.

యుగంధర్ తల ఊపాడు. "ఇన్స్పెక్టర్! సర్జన్ చెప్పింది కరెక్టు. కిటికీ ఊచల్లోంచి పొడిచి ఉండడానికి వీలు లేదు. అడ్డంగా ఉన్న ఊచలు అవి. ఎవరో యీ గదిలోకి వచ్చి వుండాలి. కనుక యింట్లో వాళ్ళని అడిగి తెలుసుకోవడం మంచిది" అన్నాడు.

సార్జంటుని చూసి స్వరాజ్యరావు సంజ్ఞ చేశాడు.

సార్జంటు వెళ్ళిపోయాడు. అసిస్టెంటు కమీషనర్ కూడా హత్య జరిగిన గదిలోకి వచ్చాడు.

"భుజంగరావుకి వచ్చినట్లు మాధవన్ కి కూడా యింతకుముందు ఎఱ్ఱనిగుర్తు కాగితాలు వచ్చాయేమో!" అన్నాడు యుగంధర్.

"వచ్చివుంటే రిపోర్ట్ చేసి ఉండేవాడు" అన్నాడు ఎ. సి.

"ఏమో! పోలీసు సూపరింటెండు కదూ! ఇలాటి బెదిరింపులు ఎన్ని చూశాడో! ఖాతరు చేసి ఉండకపోవచ్చు" అని యుగంధర్ అంటుండగా ఓ ముప్ఫయి అయిదేళ్ళతను, సార్జంటు, శివం గదిలోకి వచ్చారు.

"ఈయన మహదేవన్. మాధవన్ గారి కుమారుడు" చెప్పాడు సార్జంటు. మహదేవన్ పడక కుర్చీ వైపే చూస్తున్నాడు. కళ్ళు ఎఱ్ఱగా ఉన్నాయి. మొహం పీక్కుపోయింది.

"రండి, హాల్లోకి వెళదాం" అన్నాడు యుగంధర్.

యుగంధర్ మాటలు అతను వినలేదు. కళ్ళు అప్పగించి తండ్రి శవాన్ని చూస్తున్నాడు.

"ప్లీజ్! కమాన్!" అని యుగంధర్ అతని చెయ్యి పట్టుకుని హాల్లోకి లాక్కెళ్ళాడు. సార్జంటు తప్ప తతిమ్మా అందరూ వాళ్ళ వెనకే హాల్లోకి వెళ్ళారు.

"ఈ ఘోరం ఎలా జరిగింది?" అడిగాడు యుగంధర్.

"మాకేమీ తెలియదు" అన్నాడతను.

"ఏమీ తెలియదంటే ఎలా చెప్పండి! మీ నాన్నగారిని హత్య చేసిన మనిషిని పట్టుకోవద్దూ! మీరు యింటికి ఎన్ని గంటలకి వచ్చారు?"

"సాయంకాలం అయిదు గంటలకి వచ్చాను ఆఫీసునించి."

"మీ నాన్నగార్ని చూసి మాట్లాడారా?"

"ఆ! తన గదిలోనే వున్నాడు. నీళ్ళ పంపు చెడిపోయిందనీ, రిపేరు చేయించడానికి మనిషిని పిలిపించాలనీ చెప్పాడు."

"తర్వాత?"

"నేను నా గదిలోకి వెళ్లాను. స్నానం చేసి ఆఫీసు కాగితాలు చూసుకుంటున్నాను."

"ఇంట్లో ఎవరెవరున్నారు?"

"నా భార్య, నా చెల్లెలు, మా అమ్మ, నా పిల్లలు యిద్దరు."

"వాళ్ళంతా ఎక్కడున్నారో కనుక్కున్నారా?"

"కనుక్కున్నాను. అమ్మకి వొంట్లో బాగాలేదు. వంట ఇంటి పక్కన వసారాలో పడుకునున్నది. నా భార్య వంట చేస్తోంది. నా చెల్లెలు చదువుకుంటోంది తన గదిలో."

"పిల్లలు?"

"ఆడుకుంటున్నారు."

"ఎక్కడ?"

"తెలియదు."

"మీ నాన్నగార్ని మీ చెల్లెలు చూసిందా?"

"చూసింది. నా భార్య కంచాలు పెట్టి నాన్నగార్ని పిలవమంటే నా చెల్లెలు వెళ్ళింది పిలవడానికి. అప్పుడు చూసింది."

"మిష్టర్ మహదేవన్! ఇంట్లోకి ఎవరో వచ్చి మీ నాన్నగారి గదిలోకి వెళ్ళి ఆయన్ని కత్తితో పొడిచారు. కనుక ఆ వచ్చిన మనిషిని ఎవరైనా చూశారేమో మీ వాళ్ళని అడగాలి."

"అడగండి. వెళ్ళండి, ఆ గదిలో కూర్చుని ఏడుస్తున్నారు" అన్నాడతను.

యుగంధర్ ఆ గదిలోకి వెళ్ళాడు. ముగ్గురు స్త్రీలు వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. పెద్దవాళ్ళు ఏడుస్తుంటే ఇద్దరు చిన్నపిల్లలూ గుక్కపెట్టి ఏడుస్తున్నారు.

రెండేళ్ళ పిల్లవాడు, నాలుగేళ్ల పిల్ల.

యుగంధర్ ని చూడగానే పమిటలు సర్దుకుని లేచి నిలబడ్డారు ఆ ముగ్గురు స్త్రీలు.

"క్షమించండమ్మా!" అని యుగంధర్ తను అడగవలసిన ప్రశ్నలు అడిగాడు.

"మేము హాల్లోకి వెళ్ళలేదు. ఎవర్నీ చూడలేదు" అన్నారు ముగ్గురూ.

"పిల్లలు ఎక్కడ ఆడుకుంటున్నారు?" అడిగాడు యుగంధర్.

"వీడు నాతో వంట ఇంట్లోనే ఉన్నాడు. అదీ రాధ ఎక్కడో ఆడుకుంటోంది" అని మహదేవన్ భార్య ఆ నాలుగేళ్ల పిల్ల వైపు చూసి "తాత గదిలోకి ఎవరైనా వెళ్ళడం నువ్వు చూశావా?" అడిగింది.

ఏడ్చి ఏడ్చి ఎర్రగా ఉన్న కళ్ళల్లో నీళ్ళు నిండాయి ఆ పసిపిల్లకి. లేదన్నట్టు తల విదిలించింది.

"నేనడుగుతానుండండి" అని యుగంధర్ ఆ పిల్లని ఎత్తుకున్నాడు.

బిక్కమోహంతో యుగంధర్ ని చూసింది రాధ.

"నీ పేరేమిటి? రాధా! నువ్వు ఎక్కడ ఆడుకున్నావు?" అడిగాడు.

యుగంధర్ గొంతులో ఉండే గాంభీర్యం లేదు. లాలన, పసిపిల్లల్ని యిట్టే చనువు చేసుకునే మాధుర్యం ధ్వనించాయి.

"అక్కడ?" అన్నది రాధ హాలు వైపు చూపించి.

"ఎక్కడో చూపించు" అని హాల్లోకి ఎత్తుకు వెళ్ళాడు యుగంధర్.

హాల్లో తలుపు పక్కన రెండు లక్కపిడతలు, చీపురుపుల్లలు, రెండు చిన్న రాళ్ళు వున్నాయి.

"వంట వండుతున్నావా ఏమిటి?"

"లేదు. ఐస్క్రీం" అన్నది రాధ.

"నాకు కొంచెం పెడతావా?"

“లేదు. తమ్ముడికి పెట్టేశాను” అన్నది అమాయకంగా.

“పోనీలే, నువ్వు ఆడుకుంటూంటే తాతగారు పిలిచారా నిన్ను?”

“లేదే!”

“ఎవరో వచ్చారుగా – వచ్చి ఏం చేశాడు? నిన్ను అన్నం పెట్టమని అడిగాడా?”

“లేదే!”

“ఏం చేశాడు?”

“ఆ గదిలోకి వెళ్ళాడు?” అన్నది హత్య జరిగిన గది చిన్న వేళ్ళతో చూపిస్తూ.

“మీ తాత నిన్ను పిలిచారా?”

“లేదే!”

“అతను మళ్ళా వెళ్ళిపోయాడా?”

“నేను లేనుగా! అమ్మ దగ్గరికి వెళ్లాను.”

“అతనెలా ఉన్నాడు?”

“నల్లగా ఉన్నాడు.”

“పొడుగ్గా ఉన్నాడా?”

“ఆ!”

“లావుగా ఉన్నాడా?”

“ఆ!”

“నా అంత పొడుగున్నాడా?” అని యుగంధర్ రాధని కిందకి దింపాడు. తల పైకెత్తి చూసి తల వూపింది రాధ. రాజుని పిలిచి ఆ అమ్మాయి ముందు నిలుచోమని “అంత పొడుగున్నాడా?” అని మళ్ళీ అడిగాడు.

“ఆ!” అన్నది.

“బంగారుకొండవి. మొహం బాగా జ్ఞాపకం ఉంచుకో. నీకు ఓ ఫోటో చూపిస్తాను” అన్నాడు యుగంధర్.

తల ఊపింది రాధ. ఎత్తుకుని లోపలకి తీసికెళ్ళి దింపి హాల్లోకి తిరిగి వచ్చాడు యుగంధర్. “హంతకుడి ఫోటో చూపిస్తే రాధ గుర్తుపట్టే అవకాశం ఉంది” అన్నాడు.

“అయితే మన రోగ్సు గాలరీకి తీసుకు వెళ్ళితే?” అన్నాడు ఇన్స్పెక్టర్.

“తర్వాత” అని యుగంధర్ మహదేవన్ వైపు తిరిగి “మీ నాన్నగారికి ఎర్రనిగుర్తు ఉన్న కాగితాలు ఇంతకుముందు ఏమైనా వచ్చాయా? ఆయన్ని ఎవరైనా బెదిరించారా?” అడిగాడు.

"గదిలో బల్ల కింద చిన్న తోలుపెట్టె ఉంది. దానినిండా కాగితాలు ఉన్నాయి. నాన్నగారిని బెదిరిస్తూ చాలా ఉత్తరాలు వచ్చేవి ఆయన ఉద్యోగం చేస్తున్నపుడు. ఆ తర్వాత కూడా అప్పుడప్పుడూ బెదిరింపు ఉత్తరాలు వచ్చేవి. ఆయన వాటిని లెక్క చేసేవారు కారు" అన్నాడతను.

"మీరు ఈ ఇంట్లోకి వచ్చి ఎంతకాలం అయింది?"

"రెండేళ్ళు."

"మీ నాన్నగారు రిటయిర్ అయి ఎంతకాలం అయింది?"

"రెండేళ్ళు."

"మీ అమ్మాయి రాధని కాస్త జాగ్రత్తగా చూస్తూ ఉండండి" చెప్పాడు యుగంధర్.

6

"మీరే టెలిఫోన్ చెయ్యండి" అన్నాడు ఎ.సి. యుగంధర్ తో.

యుగంధర్ తలవూపి టెలిఫోన్ రిసీవర్ తీసి భుజంగరావుకి టెలిఫోన్ చేశాడు.

"యుగంధర్ ని. ఇంత రాత్రివేళ ఫోను చెయ్యవలసి వచ్చినందుకు చింతిస్తున్నాను. రిటైర్డు పోలీసు సూపరింటెండు మాధవన్ని ఎవరో హత్య చేశారు. ఆయనకీ, మీకు వచ్చినటువంటి ఎఱ్రని గుర్తు ఉన్న ఉత్తరాలు వచ్చాయి. ఆయన దర్యాప్తు చేసిన కేసు ఏదైనా మీ వద్దకు విచారణకు వచ్చిందా? జ్ఞాపకం చేసుకోండి" అన్నాడు యుగంధర్.

"పోలీసు సూపరింటెండు మాధవన్! అయ్యో పాపం! ఆయన కూతురు, మా పద్మ క్లాసుమేట్సు. ఆయన దర్యాప్తు చేసిన కేసులు చాలా నా వద్దకు విచారణకు వచ్చాయి. ఒక కేసు మాత్రం బాగా జ్ఞాపకమున్నది" అన్నాడు భుజంగరావు.

"ఏమిటా కేసు?" అడిగాడు యుగంధర్.

"హత్య కేసు."

"ఎవరి హత్య? ముద్దాయికి శిక్ష పడిందా? వివరాలు జ్ఞాపకం ఉన్నాయా?"

"ఆ! వివరాలన్నీ బాగా జ్ఞాపకం ఉన్నాయి. భర్తను హత్య చేసినందుకు ఒకతని భార్యనీ, ఆమె ప్రియుణ్నీ విచారణకి తీసుకువచ్చారు. హత్య చేయబడ్డ మనిషి పేరు సుందరం. అతని భార్య పేరు రేవతి. ఆమె ప్రియుడి పేరు శివరాం. అతనికి పధ్నాలుగేళ్ళు శిక్ష వేసాను. రేవతిని విడుదల చేశాను. భర్త హత్యతో ఆమెకి సంబంధమున్నదని కానీ ఆమెకు ముందుగా తెలుసునని కానీ ప్రాసిక్యూషన్ ఋజువు చెయ్యలేకపోయింది" అన్నాడు భుజంగరావు.

"ఆ కేసు విచారణకి ఎప్పుడు వచ్చింది?" అడిగాడు యుగంధర్.

"నేను రిటయిర్ అవడానికి మూడేళ్ళ ముందు అంటే అయిదేళ్ళయింది."

"కనుక శివరాం ఇంకా విడుదలయి ఉండదు కదూ!"

"జైలులోంచి తప్పించుకుని ఉంటే తప్ప!" అన్నాడు భుజంగరావు.

"థాంక్స్! మిగతా కేసుల గురించి ఏమీ జ్ఞాపకం లేదన్నమాట?"

"లేదు."

"ఫర్వాలేదు లెండి. రికార్డులు చూస్తాము. మా మనిషి గదిలోనే ఉన్నాడా?"

"ఆ! పడక కుర్చీలో కూర్చునున్నాడు" చెప్పాడు భుజంగరావు.

యుగంధర్ టెలిఫోన్ పెట్టేసి ఏ.సి. కి ఆ సంభాషణ వివరాలన్నీ చెప్పాడు.

"ఆ కేసుకీ, ఈ హత్యకీ ఏమీ సంబంధం ఉంది ఉండదు. శివరాం ఇంకా శిక్ష అనుభవిస్తూనే ఉన్నాడుగా! ఈ హత్య ఆదది చేసిన పని కాదు" అన్నాడు ఏ.సి.

"శివరాం స్నేహితుడో, అన్నో, తమ్ముడో చేసివుండవచ్చుగా?" అన్నాడు ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు.

తల తిప్పి "వ్యక్తిగతంగా ఎంతో ద్వేషమూ, కసీ ఉంటేనే కానీ ఇటువంటి హత్యలు చెయ్యరు. హంతకుడికి ప్రయోజనం ఏమీ లేదు హత్య చెయ్యడం వల్ల. శివరాం తరపున మరెవరో చేసి ఉంటారని అనిపించడం లేదు" అన్నాడు యుగంధర్.

రాజు చిన్నగా దగ్గాడు. అందరూ అతని వైపు చూశారు. "శివరాంకి పధ్నాలుగేళ్ళ శిక్ష పడి ఉండవచ్చు. అతనింకా జైలులోనే ఉన్నాడని ఏమిటి నిశ్చయం?" అన్నాడు.

ఏ.సి. నవ్వి "జైలు నుంచి పారిపోయి వచ్చి ఈ హత్య చేశాడంటావా!" అడిగాడు.

"అసంభవం కాదుగా!"

"ఆల్ రైట్!" అని టెలిఫోన్ తీసి రాత్రి డ్యూటీ మీద ఉన్న గుమాస్తాతో మాట్లాడాడు ఏ.సి. తర్వాత రాజు వైపు తిరిగి "కోయంబత్తూరు సెంట్రల్ జైలులో ఉన్నాడుట. జైలు సూపరింటెండుకి ట్రంక్ కాల్ బుక్ చేశాను" అన్నాడు.

"మాధవన్ తో నాకు అంత బాగా పరిచయం లేదు. ఆయన్ని గురించి చెప్పండి!" అడిగాడు యుగంధర్.

"ఏం చెప్పమంటారు?" అడిగాడు ఏ.సి.

"ఎటువంటి ఆఫీసర్? న్యాయంగా, దీక్షగా పని చేసేవాడా?"

"యస్! చాలా మంచి రికార్డు ఉంది. చిల్లి కానీ లంచం పుచ్చుకోలేదు. వ్యక్తిగతమైన కారణాలతో ఎవరి మీదా కేసులు బనాయించలేదు. రాజకీయవేత్తల ఒత్తిడికి లొంగి ఎవరిమీదా కేసులు మాఫు చెయ్యలేదు. ఒక పోలీసు ఉద్యోగిని గురించి అంతకన్నా మంచి ఏం చెప్పగలం?" అన్నాడు ఏ.సి.

అంతలో బల్ల మీద టెలిఫోన్ మోగింది.

రిసీవరు తీసుకుని, తన పేరు చెప్పి "శివరాం అనే అతన్ని హత్యానేరానికి పధ్నాలుగేళ్ళ శిక్ష అనుభవించడానికి మీ జైలుకి పంపారు. అతను జైలులో ఉన్నాడా?" అడిగాడు.

అవతలినించి జవాబు వినగానే ఏ.సి. చేతిలోంచి రిసీవర్ జారి బల్లమీద పడింది.

"వాట్! నిజమా!" అంటూ మళ్ళీ రిసీవర్ తీసుకుని "నిజమా!" అడిగాడు.

అవతలనించి జవాబు విని "సారీ! సర్క్యులర్ నేను చూడలేదు. వెరీ సారీ!" అని రిసీవర్ పెట్టేసి, రాజు వైపు తిరిగి "మైడియర్ ఫెలో! నీకు తెలుసా ఏమిటి?" అన్నాడు.

రాజు తెలియదని తల తిప్పాడు.

"శివరాం నాలుగు రోజుల క్రితం జైలు నుంచి తప్పించుకుని వెళ్ళాడుట. జనరల్ సర్క్యులర్ పంపించారుట. నేను చూడలేదు. ఇన్స్పెక్టర్ మీకు తెలియదా?" అన్నాడు ఏ.సి. స్వరాజ్యరావుని చూసి.

"లేదు సార్! వారం రోజులుగా నేను ఆ బ్యాంకు దొంగతనం కేసులో బిజీగా ఉన్నానుగా!" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ఆల్ రైట్! ఇన్స్పెక్టర్! ఈ క్షణం నుంచి మీరు ఇన్ ఛార్జి. శివరాంని వెంటనే పట్టుకోవాలి. రేవతి ఎక్కడున్నదో కనుక్కోండి. బహుశా శివరాం అక్కడికి వెళ్లి ఉంటాడు" అన్నాడు ఏ.సి.

ఇన్స్పెక్టర్ తలవూపి లేచి నిలబడ్డాడు.

"నాదొక చిన్న సలహా" అన్నాడు యుగంధర్.

"చెప్పండి."

"శివరాం ఫోటో మీవద్ద ఉంటే మహదేవన్ కూతురు రాధకి చూపిద్దాం."

"వెరీ గుడ్ అయిడియా! కమాన్! మనమే వెళ్లి వెతుకుదాం" అన్నాడు ఏ.సి.

**పాత ఫైల్స్ తిరగేశారు. చాలా సులభంగానే దొరికింది ఫోటో.**

"సుందరం హత్యకేసు, మాధవన్ ఇన్‌ఛార్జి" అని అట్టపైన రాసి ఉంది. అట్టవెనక వరసగా కొన్ని ఫోటోలు అతికించి ఉన్నాయి. హత్య చెయ్యబడ్డ సుందరం మొహం మాత్రం ఒక ఫోటో, నిలుచున్నది ఒకటి, అతని భార్య రేవతిది. నేరస్థుడు శివరాంది రెండు ఫోటోలు ఉన్నాయి. యుగంధర్ ఫోటోలు పరీక్షగా చూశాడు. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. ఉంగరాల జుట్టు, పల్చని మొహం, చురుకయిన కళ్ళు, ఫుల్ సూటులో ఉన్నాడు. అతని ఆకారం గురించిన వివరాలు పక్కనే టైప్ చేసి ఉన్నాయి. అయిదడుగుల పది అంగుళాల పొడుగు. నూట ఇరవై రెండు పౌనుల బరువు. గోధుమ రంగు ఒళ్ళు. కేసు గురించిన వివరాలు, హత్యకి సంబంధించిన ఫోటోలు ఉన్నాయి తర్వాత.

సుందరం మెడికల్ రిప్రజెంటేటివ్, శివరాం ఇన్సూరెన్సు ఏజంటు. ఇద్దరూ స్నేహితులు. సుందరం తరచు టూర్ వెళ్ళేవాడు. అది అవకాశంగా తీసుకుని శివరాం సుందరం భార్యతో ప్రణయం ప్రారంభించాడు. ఆ విషయం సుందరానికి తెలిసిపోయింది. పోట్లాట అయింది. శివరామ్‌ని ఇంటికి రావద్దని చెప్పాడు సుందరం. రేవతి కొన్నాళ్ళ తర్వాత పుట్టింటికి వెళ్ళిపోయింది. తనకి విడాకులు ఇవ్వమని భర్తకి ఉత్తరాలు రాసింది. సుందరం అందుకు అంగీకరించలేదు. ఒకరోజు రాత్రి శివరాం సుందరం ఇంటికి వెళ్ళి సుందరాన్ని కత్తితో

పొడిచి చంపాడు. రేవతి అప్పుడు ఇంకా పుట్టింట్లోనే ఉంది. శివరాం సుందరం ఇంట్లోకి వెళ్ళడం చూసినవాళ్ళు, అతనింట్లో రక్తం ఉన్న కత్తీ, ఎన్నో సాక్ష్యాలు లభించాయి. శివరామ్‌ని అరెస్టు చేశారు. రేవతి కూడా ఈ హత్య చెయ్యడానికి కుట్ర చేసిందని ప్రాసిక్యూషన్ రేవతి మీదా అభియోగం తెచ్చింది. తన భర్త తనకి విడాకులు ఇవ్వనంటున్నాడని శివరామ్‌కి రేవతి రాసిన ఉత్తరం సాక్ష్యంగా ప్రవేశపెట్టింది. రేవతిమీద కేసు కొట్టేశారు. శివరాం తను హత్యచెయ్యలేదని అన్నాడు. చివరివరకూ అంతా చదివి యుగంధర్ ఫైలులోంచి శివరాం ఫోటోలు తీశాడు. "నేను వీటిని తీసుకెళ్ళి, మాధవన్ మనుమరాలు రాధకి చూపిస్తాను, తర్వాత మీకు ఇచ్చేస్తాను" అన్నాడు.

"దటీజ్ ఆల్ రైట్" అన్నాడు ఏ.సి.

"ఇంకొక సంగతి. రేపు పత్రికా ప్రతినిధుల్ని పిలిపించి ఈ ఎర్రని గుర్తు ఉన్న బెదిరింపు ఉత్తరాల గురించి చెప్పండి. ఇటువంటి ఉత్తరాలు ఇంకా ఎవరికయినా వచ్చి ఉంటే వాళ్ళు వెంటనే మిమ్మల్ని కలుసుకోవలసిందిగా ప్రకటించండి. నిర్లక్ష్యం చెయ్యవద్దని హెచ్చరించండి" చెప్పాడు యుగంధర్.

"ఓ యస్. రేపు పొద్దున్నే రిపోర్టర్స్‌ని పిలుస్తాను" అన్నాడు ఏ.సి.

"రేపు ఇక్కడికి వస్తాను" అని యుగంధర్ ఏ.సి ఆఫీసునుంచి బయలుదేరాడు.

## 7

పొద్దున్న ఏడుగంటలకల్లా డిటెక్టివ్ యుగంధర్, అతని అసిస్టెంటు రాజు హత్య చేయబడ్డ మాధవన్ ఇంటికి వెళ్ళారు. పోలీసులూ, జనమూ, కాల్చిపారేసిన సిగిరెట్టు పీకలు, ఖాళీ సిగరెట్ పాకెట్లు గేటు ముందు పడున్నాయి. ఇంట్లో చడీ చప్పుడూ లేదు. ఏడుపులు కూడా వినిపించడంలేదు.

రాజు నెమ్మదిగా మునివేళ్ళతో తలుపుతట్టాడు.

"ఎవరు" లోపల్నుంచి ప్రశ్న.

"మహదేవన్‌గారున్నారా?"

"లేరు."

"అమ్మా! ఒకసారి తలుపు తియ్యండి. నేను డిటెక్టివ్ యుగంధర్ని" అన్నాడు యుగంధర్. గడియ తీస్తున్న చప్పుడయింది. పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తలుపు తీసి యుగంధర్ని తేరిపార చూసింది. చెదిరిన జుట్టు, నలిగిన బట్టలు, ఏడ్చి ఏడ్చి ఎర్రగా జేవురించుకుపోయిన కళ్ళు, పీక్కుపోయిన మొహము - ఆ అమ్మాయి మాధవన్ కుమార్తె అని యుగంధర్‌కి తెలుసు.

"మీ అన్నయ్య ఇంత తెల్లారే బైటికి వెళ్ళారా! నే వచ్చినది పాపాయి రాధకోసం" అన్నాడు యుగంధర్.

తలుపు దగ్గిర నిలబడ్డ యువతి కనుబొమలు చిట్లించి "మీరెవరు? డిటెక్టివ్ యుగంధర్ అయితే అన్నయ్య కోసం, రాధ కోసం మీరు ఇక్కడికి రావడం ఆశ్చర్యంగా ఉంది" అన్నది.

"ఏం? పాపాయి కూడా ఇంట్లో లేదా?"

"లేదు. అర్ధరాత్రి పోలీస్ కమీషనర్ ఆఫీసు నుంచి ఎవరో ఇన్‌స్పెక్టర్ వచ్చి అన్నయ్యనీ, పాపాయినీ ఏ.సి పిలుచుకురమ్మన్నారని చెప్పి కారులో ఎక్కించుకుని తీసుకెళ్ళాడు. ఇంకా తిరిగి రాలేదు. బహుశా ఏ.సి. ఆఫీసులోనే ఇంకా ఉన్నారేమో" అన్నది.

రాత్రి ఒంటిగంట వరకూ యుగంధర్ ఏ.సి. ఆఫీసులోనే ఉన్నాడు. తను అక్కడ ఉండగా మహదేవన్ కోసం ఎవర్నో పంపారేమో అనుకుని రాజుని వెళ్ళిఫోను చేసి కనుక్కోమన్నాడు. "ఆ వచ్చిన పోలీస్ ఉద్యోగిని నువ్వు చూశావా అమ్మా!" అడిగాడు ఆ అమ్మాయిని.

"లేదు. అన్నయ్యే వచ్చి తలుపుతీశాడు. రాధ నిద్రపోతోంది. నిద్రపోతున్న దాన్ని భుజాన వేసుకుని తీసుకెళ్ళాడు. ఏం?" అడిగింది సునీత.

యుగంధర్ తలుపు దగ్గరే నిలుచున్నాడు. పదినిమిషాల్లో రాజు తిరిగి వచ్చాడు.

"లేదు సార్. ఏ.సి.కే ఫోన్ చేశాను. ఎవర్నీ పంపలేదుట. ఆయన స్వరాజ్యరావుతో ఇక్కడికి వస్తున్నారు" చెప్పాడు రాజు.

"అయితే అన్నయ్య, పాపాయి?" అన్నది సునీత.

"కంగారుపడకండి" అన్నాడు యుగంధర్.

యుగంధర్ మాట వినిపించుకోకుండా లోపలికి పరిగెత్తింది సునీత. రెండు నిమిషాలలో ఇంటి ముందు ఓ వాన్ ఆగింది. ఏ.సి ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు హడావిడిగా దిగారు.

"ఏమిటి యుగంధర్ మహదేవన్‌నీ, ఆ పసిపిల్లనీ నేను పిలిపించడమేమిటి?" అడిగాడు ఏ.సి.

తనకి సునీత చెప్పిన విషయం చెప్పాడు యుగంధర్. ఇన్‌స్పెక్టరూ, ఏ.సి లోపలికి వెళ్ళి మహదేవన్ భార్యనీ, సునీతనీ ప్రశ్నించారు. కానీ ఎక్కువ ఏమీ తెలియలేదు.

ఏ.సి మొహం కందిపోయింది. నుదుటిమీది చెమట తుడుచుకుంటూ స్వరాజ్యరావు మీద కస్సుమన్నాడు. "కనీసం ఓ కానిస్టేబుల్ నయినా ఇక్కడ కాపలా ఉంచవద్దూ. హత్య జరిగిన ఇల్లు - నాలుగేళ్ళ పిల్ల హంతకుణ్ణి చూసింది. వాళ్ళకి ప్రమాదం ఉన్నదని మీకే తెలియాలి. నేను చెప్పాలా?" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు కిక్కురుమనలేదు.

"వానో, కారో ఏదయినాసరే ఎటు వెళ్ళిదీ ఎవరయినా చూశారేమో ఈ ప్రాంతాల వాళ్ళని అడిగి తెలుసు కోవడం మంచిది" అన్నాడు యుగంధర్.

"యస్ యస్ కానివ్వండి" అన్నాడు ఏ.సి స్వరాజ్యరావుతో.

రాజు, యుగంధర్, ఏ.సి వాన్ దగ్గిర నిలబడ్డారు.

అంతలో ఏ.సిని చూసి "మెసేజ్ సార్!" అన్నాడు వాన్‌లో కూర్చున్న వైర్‌లెస్ ఆపరేటర్.

"ఊ! వింటున్నాను" ఏ.సి విసుగ్గా చెప్పాడు.

"కంట్రోల్ రూమ్ రిపోర్టింగ్"

"వాన్ ఫోర్ రిసీవింగ్. వాన్ ఫోర్ రిసీవింగ్" అన్నాడు వాన్ ఆపరేటర్.

"సైదాపేటకి ముందున్న చిన్న వంతెన పక్కన నీళ్ళు లేని కాలవలో మహదేవన్ అనే అతను పడి ఉన్నాడు."

"గుడ్ గాడ్" అని ఏ.సి వాన్‌లోకి ఒక్క గంతు వేసి "ఏ.సి స్పీకింగ్. వివరాలు చెప్పు" అని అరిచాడు.

"పొద్దున్న అయిదుగంటలకి అక్కడ ఒక మనిషి పడి ఉండటం పాలుపోసే మనిషి ఒకడు చూశాడు. స్పృహలేదుట. తలకి దెబ్బ తగిలిందట. పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి చెప్పాడు. వెంటనే సైదాపేట డివిజన్ పోలీసులు ఆయన్ని జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్ళారు. ఆయనకి పదిహేను నిమిషాల క్రితమే స్పృహ వచ్చింది. మిమ్మల్ని కలుసుకోవాలంటున్నాడు."

"ఆల్‌రైట్! నేను జనరల్ ఆస్పత్రికి వెళుతున్నాను" అని డ్రయివర్ని వాన్ స్టార్టు చెయ్యమని "రండి యుగంధర్" అని తలుపు తెరిచాడు ఏ.సి.

"నేను నా కారులో వస్తాను" అన్నాడు యుగంధర్.

**8**

యుగంధర్ తన కన్సల్టింగ్ రూంలో రివాల్వింగ్ కుర్చీలో కూర్చున్నాడు. ఏ.సి ఇన్ స్పెక్టర్ స్వరాజ్యరావు అతనికి ఎదురుగా కూర్చున్నారు. మహదేవన్‌ని చూసి అంతకు ముందే జనరల్ ఆస్పత్రి నుంచి వచ్చారు.

రాత్రి ఒంటిగంటకు ఎవరో తలుపు తట్టారట. మహదేవన్ ఇంకా నిద్రపోలేదు. తలుపు తియ్యగానే కాకీ నిక్కర్ లోపలకి షర్టు దోపుకుని తోలు బెల్టు పెట్టుకున్న ఓ భారీ మనిషి 'మహదేవన్ గారూ.. పాపాయి రాధని తీసుకుని ఏ.సి మిమ్మల్ని వెంటనే ఆఫీసుకి రమ్మన్నారు' అన్నాడుట. మహదేవన్ రాధని ఎత్తుకుని, తలుపు వేసుకోమని భార్యకి చెప్పి అతనితో వెళ్ళి కారు ఎక్కాడుట. కారు స్టార్టు చేసి కొంతదూరం వెళ్ళాక ఆపాడట. ఏమయిందని మహదేవన్ అడిగితే జవాబు చెప్పలేదుట అతను. ఏదో బరువయిన వస్తువు తీసుకుని మహదేవన్‌ని తలమీద బలంగా కొట్టాడుట. వెంటనే మహదేవన్‌కి స్పృహ పోయిందిట. అంతే! ఆ తర్వాత ఏం జరిగిందీ ఆస్పత్రిలో స్పృహ వచ్చేంతవరకూ అతనికి తెలియదుట. రాధ ఏమయిందో తెలియలేదు. మహదేవన్ ఎక్కిన ఆ కారు నెంబరు కానీ, మేక్ గానీ ఆయనకు తెలియదు. మహదేవన్ చెప్పిన విషయాలు ఇవి.

"మహదేవన్‌ని కొట్టి ఆ తూము దగ్గర పడేసిందీ, రాధని ఎత్తుకుపోయిందీ హంతకుడేనా?" అడిగాడు ఏ.సి.

"అందులో సందేహం లేదు. రాధ అతన్ని చూసింది. తనని చూసిందని తెలుసు అతనికి. అందుకే ఎత్తుకు పోయాడు."

"అయితే రాధని?" అడిగాడు రాజు.

"ఏమో! రాధ అంత చిన్నపిల్లని చంపేస్తాడా? చంపేవాడయితే మాధవన్‌ని కొట్టి వెళుతున్నప్పుడు ఆ పిల్లని సులభంగా చంపి ఉండవచ్చుగా?" అని రెండు నిమిషాలు ఆలోచించి "మనం మాధవన్ ఇంట్లో ఉన్నప్పుడు నేను రాధని ఎత్తుకుని మాట్లాడుతుండగా బయట చేరిన జనంలో హంతకుడు నిలబడి చూసి ఉండాలి. రాధ నుంచి తన ఆనవాలు తెలుసుకుంటామేమోనని నిన్నరాత్రే రాధని ఎత్తుకుపోయాడు" అన్నాడు యుగంధర్.

"ఎవరయినదీ తెలియడానికేం? తెలుస్తూనే ఉందిగా. శివరాం ఫోటోలు తీసుకుని రాధకి చూపించడానికి మీరు వెళ్ళేటప్పటికి రాధ లేదుగా" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ తలవిదిలించాడు. "ఎర్రని గుర్తు ఉన్న ఉత్తరాలు పంపిన మనిషే హంతకుడు ఐనట్లయితే శివరాం హంతకుడు కాదు" అన్నాడు.

అందరూ యుగంధర్‌ని ఆశ్చర్యంతో చూశారు. "అదేమిటి?" అడిగాడు ఏ.సి.

"శివరాం జైలు నుంచి తప్పించుకుని నాలుగురోజుల క్రితమే బయటికి వచ్చాడు. భుజంగరావుకీ, మాధవన్‌కీ దాదాపు నెలరోజులనుంచీ ఆ ఉత్తరాలు వస్తున్నాయి."

"శివరామే ఇంకెవరి చేతనైనా రాయించాడేమో" అన్నాడు రాజు.

"జైలులో ఉండగానా? అసంభవం కాదు కానీ శివరామే హంతకుడు అయినట్లయితే రాధని ఎత్తుకు పోవలసిన అవసరం ఏముంది?" అడిగాడు యుగంధర్.

"అతని ఫోటో చూసి ఆ చిన్న పిల్ల గుర్తుపట్టకుండా" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"గుర్తుపడితేనేం - శివరామే హంతకుడు అయితే మాధవన్‌కీ, అతనికీ, భుజంగరావుకీ ఉన్న సంబంధాన్ని బట్టి అతన్ని మనం ఎలాగూ అనుమానిస్తామని తెలిసుండాలి. అంతేకాక జైలునుంచి పారిపోయి వచ్చిన మనిషి కనుక తనకోసం పోలీసులు వెతుకుతుంటారనీ తెలుసు అతనికి. మాధవన్ ని హత్యచేసింది తనని తెలియకుండా దాచడంలో అర్థం ఏముంది?" అన్నాడు యుగంధర్.

"అయితే మీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు ఏ.సి.

"ఇంకా ఏ అభిప్రాయానికీ రాలేదు. అన్నీ అనుమానాలే" అని యుగంధర్ అంటూ ఉండగా టెలిఫోన్ మోగింది. "హాల్లో యుగంధర్ స్పీకింగ్" అన్నాడు.

"గుడ్ యుగంధర్ మీరు అనవసరంగా ఖంగారు పడకండి రాధ క్షేమంగా ఉంది."

"ఎవరు నువ్వు?" అడిగాడు యుగంధర్.

"నా పేరు చెప్పమంటారా" అని నవ్వి రిటయిర్డు పోలీసు సూపరింటెండెంట్‌ని హత్యచేసిన మనిషిని. మీరు రాధని ఎత్తుకుని మాట్లాడడం బయట ఉన్న జనంలో నిలబడి చూశాను. అందుకే రాధని తీసుకెళ్ళాను."

"ఎక్కడికి?" అడిగాడు యుగంధర్.

అవతలనుంచి మళ్ళీ నవ్వు వినపడింది. "సారీ! చిరునామా చెప్పలేను. రాధకి ఎటువంటి హానీ కలగదు అని మీకు ధైర్యం చెప్పడానికి ఫోన్ చేశాను. పాపం ఆ పిల్ల తల్లి గుండె బద్దలయ్యేటట్లు ఏడుస్తూ ఉంటుంది. ఆమెకి ఈ విషయం చెప్పండి."

"ఆ చిన్న పిల్ల నిన్ను ఎలా గుర్తుపడుతుంది? ఎందుకు భయపడ్డావు?" అడిగాడు యుగంధర్.

"ఆ ప్రమాదం ఉన్నది కనుకే తీసుకెళ్ళాను. ఈ కేసులోకి మీరు ప్రవేశించకపోయినట్లయితే రాధని ఎత్తుకెళ్ళేవాణ్ణికాను. మరొకసారి చెపుతున్నాను. భయపడవద్దు. రాధ ఆడుకుంటోంది. బలే అల్లరిపిల్ల. తియ్యగా మాట్లాడుతుంది. నీళ్ళు పొయ్యడం, బట్టలు వేయడం మొదలయిన పనులు నాకు కష్టంగా ఉన్నాయి. ఇంట్లో ఆడవాళ్ళు లేరు. ఎవర్నయినా తీసుకురావాలి రాధని చూసుకునేందుకు" అని టెలిఫోను కట్ చేశాడు అతను.

యుగంధర్ కూడా రిసీవర్ పెట్టేశాడు.

"ఎవరు?" అడిగాడు ఏ.సి.

"హంతకుడు" అన్నాడు యుగంధర్.

"ఏమంటున్నాడు?"

యుగంధర్ చెప్పాడు. "వాడికి ఎంత ధైర్యం. మీరు వాణ్ణి సంభాషణలో ఉంచి మాకు సంజ్ఞ చేస్తే" అని ఏ.సి అంటూండగా "అంత తెలివిమాలినవాడు కాడు. మీరు ఆ టెలిఫోన్ బూత్‌కి వెళ్ళేటప్పటికి అక్కడ ఉండడు" అన్నాడు యుగంధర్.

"ఇంతకీ వాడు మీకు ఎందుకు టెలిఫోన్ చేశాడు? బెదిరించాడా?" అడిగాడు ఏ.సి.

"లేదు. రాధ క్షేమంగా ఉందని తెలియపరచడానికి"

"నమ్ముతున్నారా!"

"నమ్మకపోవడానికి కారణం కనిపించడంలేదు" అన్నాడు యుగంధర్.

## 9

"దయచేసి సుందరం హత్యకేసు బాగా జ్ఞాపకం చేసుకోండి. ఈ ఎర్రని గుర్తు ఉన్న ఉత్తరాలకీ, అతనికీ ఏమైనా సంబంధం ఉందా" అడిగాడు యుగంధర్ భుజంగరావుని కనుబొమలు ముడిచి.

"రాత్రి డైరీ తీసి చదివాను. నాకు తెలిసినంతవరకూ ఆ కేసులో ప్రత్యేకత ఏమీ లేదు. శివరాం మీద సాక్ష్యం చాలా ఉంది. తికమకలు పెట్టిన కేసు కాదు. తీర్పు చెప్పడానికి అట్టే కష్టపడవలసిన అవసరం లేకపోయింది" అన్నాడు భుజంగరావు.

"కేసు విచారణ జరుగుతూండగానో, విచారణ అయిన తర్వాత మిమ్మిల్ని కోర్టులో - బెదరించాడా?" అడిగాడు యుగంధర్.

"లేదు" అన్నాడు భుజంగరావు. అయిదునిమిషాల తర్వాత "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగాడు యుగంధర్ని.

"శివరాం సరిగా ఈ సమయంలో జైలునుంచి పారిపోవడం, మాధవన్ హత్య కేవలం కాకతాళీయాలే రెండింటికీ సంబంధం ఉన్నదా అని ఆలోచిస్తున్నాను. "

"ఏదో సంబంధం ఉండివుంటుంది. హత్య చెయ్యబడిన ఆ పోలీసు సూపరింటెండెంటుకీ నాకూ సంబంధం శివరాం కేసులో మాత్రమేగా! మా ఇద్దరికీ ఎర్రని గుర్తువున్న ఉత్తరాలు వచ్చాయి" అన్నాడు భుజంగరావు.

"మీకు వచ్చినట్లు అలాటి ఎర్రని గుర్తు ఉత్తరాలు ఇంకా ఎంతమందికి వచ్చాయో పత్రికల్లో ప్రకటన అందరూ చదివిన తర్వాత కానీ తెలిసే అవకాశంలేదా ఎంత ఆలోచించినా నాకు ఒక విషయం అర్థం కావడంలేదు. మాధవన్ని హత్యచేసిన మనిషి ఎర్రని గుర్తును కాగితం మాధవన్ చేతిలో ఎందుకు ఉంచాడు? తన హత్యచేశానని అందరికీ తెలిసేట్టు విజిటింగ్ కార్డులా కాగితం ఎందుకు పెట్టాడు?" అన్నాడు యుగంధర్.

"సార్! హత్యచెయ్యబడ్డ సమయంలో మాధవన్ చేతిలో ఆ కాగితం ఉన్నదేమో!" అన్నాడు రాజు.

"అంటే, ఆ కాగితం ఆవేళ పోష్టులో వచ్చి ఉండాలి. దాన్ని చేతిలో పట్టుకుని చూస్తుండగా సరిగా సమయంలో హంతకుడు వచ్చి హత్యచేశాడని అనుకోవాలి. అది మరీ కాకతాళీయంగా ఉన్నది కదూ రాజూ. ఎర్రనిగుర్తు కాగితాలు పంపుతున్న మనిషే హత్య చేశాడని అందరికీ తెలిసేందుకు హంతకుడు కావలిస్తే ఆ కాగితం మాధవన్ చేతిలో పెట్టాడు."

"ఎందుకు? ఆ ప్రచారం దేనికి?" అడిగాడు భుజంగరావు.

"ఆ ఎర్రని గుర్తు కాగితాలు వచ్చినవాళ్ళు భయపడటానికి, నిర్లక్ష్యం చెయ్యకుండా ఉండటానికి."

భుజంగరావు నవ్వి "విచిత్రంగా ఉంది. హత్య చెయ్యదలుచుకున్నప్పుడు హత్యచెయ్యకుండా ముందు ఈ బెదిరింపు ఉత్తరాలు దేనికి పంపుతాడు? పైగా ఆ బెదరింపు ఉత్తరాలు ఎవరూ నిర్లక్ష్యం చెయ్యకుండా మాధవ్ని హత్యచేసి ఓ ఎర్రని గుర్తు కాగితం అతని చేతిలో పెట్టాడు. మిగతా వాళ్ళంతా జాగ్రత్తపడరూ?" అడిగాడు.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. అర్థం కాకుండా ఉంది. ఎర్రనిగుర్తు ఉత్తరాలు పంపడంలో అర్థం తెలుస్తోంది. తను హత్య చెయ్యదలచుకున్నవాళ్ళు భయపడి క్షోభపడి, బాధపడాలని హంతకుడి ఉద్దేశం అయివుండవచ్చు. కానీ హత్యచేసిన తర్వాత శవం చేతిలో ఎందుకు ఎర్రని గుర్తు కాగితం పెట్టాడో తెలియడం లేదు" యుగంధర్ అంటుండగా వంటమనిషి నారాయణ వచ్చి డ్రయివర్ వచ్చాడని చెప్పాడు.

"డ్రయివరా! ఏమిటి పద్మ రాలేదూ?" అడిగాడు భుజంగరావు.

"లేదండీ డ్రయివర్ని పిలవనా?"

"ఊఁ! పిలు" అన్నాడు భుజంగరావు.

జంకుతూ డ్రయివర్ గదిలోకి వచ్చి "కాలేజీకి వెళ్ళానండీ. అమ్మాయిగారు కాలేజీలో లేరు" అన్నాడు.

"కాలేజీలో లేదా? ఎక్కడికి వెళ్ళింది?" అడిగాడు భుజంగరావు.

"తెలియదండీ? ఎవర్నడిగినా చెప్పలేదండీ"

"కాలేజీలోనే ఉన్నదేమో సరిగా చూశావా?"

"చూశానండీ అరగంట కాచుకున్నాను. మీకు చెప్పడానికి వచ్చాను."

భుజంగరావు ఆలోచనలో పడ్డాడు. "నాతో చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళదే ఎక్కడికి వెళ్ళివుంటుంది!?" పైకి అన్నాడేకానీ ఆదుర్దా అతని మొహంలో స్పష్టంగా కనపడుతోంది.

"జాగ్రత్తగా ఉండమని చెప్పాను" అన్నాడు యుగంధర్.

భుజంగరావు లేచి పచార్లు ప్రారంభించాడు. "ఏం చెయ్యను? మొండితనం. ఈ ఏడు చదువు వద్దు అంటే వింటేగా. లా కాలేజీలో చేరింది. బహుశా ఏ స్నేహితురాలింటికో వెళ్ళి ఉండవచ్చు?" అన్నాడు.

ఆ మాటలు అంటుండగానే టెలిఫోన్ మోగింది. రిసీవర్ తీసుకుని "హల్లో యస్. పిలుస్తానుండండి." అని యుగంధర్ని చూసి "మీ కోసం" అన్నాడు.

యుగంధర్ రిసీవర తీసుకుని "హల్లో యుగంధర్ స్పీకింగ్" అన్నాడు. వెంటనే యుగంధర్ మొహం మారిపోయింది. పెదిమలు బిగించాడు. కళ్ళు చిట్లించాడు "ఆ! చెప్పండి" అన్నాడు.

అవతల నుంచి నవ్వు వినిపించింది. "రాధకి నీళ్ళు పోసేందుకు, బట్టలు వేసేందుకు, ఆడించేందుకు ఇంట్లో ఆడమనిషి ఉందన్నానుగా ఇవాళ తీసుకువచ్చాను" అన్నాడు.

"ఆ విషయం నాకు చెప్పడం దేనికి?" అడిగాడు యుగంధర్.

"రాధ గురించి మీరూ, ఆ పిల్ల తల్లితండ్రులు బెంగపడకుండా - పద్మప్రియ ఏమైందని, భుజంగరావుగారు కంగారుపడకుండా! పద్మప్రియ రాధకి నీళ్ళు పోసింది. అప్పుడే కొత్తగౌను తొడిగింది" అన్నాడు అవతలనుంచి.

"అంతేనా, ఇంకేమైనా చెపుతావా?" అడిగాడు యుగంధర్.

"రాధకి కానీ, పద్మప్రియకి కానీ ఎటువంటి హానీ జరగదు. వాళ్ళమీద నాకెటువంటి ద్వేషమూ లేదు. లేకపోతే నేను హత్య చెయ్యదలచుకున్న వాళ్ళని మీరు కాదుకదా ఆ భగవంతుడు కూడా రక్షించలేడు. మీరు అనవసరంగా శ్రమపడుతున్నారు."

"అంత అహంకారం పనికిరాదు. తగిన కట్టుదిట్టాలు చేస్తే మీరు ఎలా హాని చెయ్యగలుగుతారు?"

"నేనెవరో తెలిస్తే కట్టుదిట్టాలు చెయ్యవచ్చు. తెలియదుగా ఇప్పుడప్పుడే" అని టెలిఫోన్ పెట్టేశాడు.

యుగంధర్ చేతి గడియారం చూసుకున్నాడు. సరిగా మూడు నిమిషాలు మాత్రం మాట్లాడాడు. రాజుద్వారా టెలిఫోన్ కాల్ ఎక్కణ్ణించి వస్తున్నదీ కనుక్కుని పట్టుకునేందుకు అవకాశం ఇవ్వదలచుకోలేదు హంతకుడు. భుజంగరావుకి టెలిఫోన్ సంభాషణ వివరాలు చెప్పాడు యుగంధర్.

"గుడ్ గాడ్ ఇంకేం చేస్తాము!?" అని భుజంగరావు మంచం మీద చతికిలబడ్డాడు.

"భుజంగరావుగారు అంత నీరసించకండి. పద్మకి కానీ, రాధకి కానీ ఏమీ హాని కలగదనే నా నమ్మకం. ఒక విషయం జ్ఞాపకముంచుకోండి. ఎటువంటి పరిస్థితుల్లోనూ మీరు ఈ ఇంట్లోంచి బయటికి వెళ్ళకూడదు. చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇంకొక విషయం. హంతకుడు మీకు టెలిఫోన్ చెయ్యవచ్చు, తను చెప్పిన చోటికి మిమ్మల్ని ఒంటిగా రమ్మనవచ్చు.

అతను చెప్పినట్లు చెయ్యకపోతే పద్మప్రియకి ఆపద కలుగుతుందని బెదిరించవచ్చు. మీరు బెదిరిపోకండి. మీరు అతనికి చిక్కనంత కాలమూ పద్మ ప్రియ సురక్షితంగా ఉంటుంది. హంతకుడి దగ్గర్నించి మీకేదైనా కబురువస్తే వెంటనే నాకు తెలియచెయ్యండి" అన్నాడు యుగంధర్.

భుజంగరావు తల ఆడించాడు.

"నా హెచ్చరిక మీరు నిర్లక్ష్యం చేస్తే తర్వాత నేను కాని మరెవరు కానీ మీకు ఏమీ సహాయం చెయ్యలేరు" అన్నాడు యుగంధర్.

"జ్ఞాపకముంచుకుంటాను."

మళ్ళీ టెలిఫోన్ గణగణ మోగింది. భుజంగరావు ఉలిక్కిపడ్డాడు. భయంగా చూశాడు టెలిఫోన్ వేపు. యుగంధర్ రిసీవర్ అందుకుని "యస్! ఆ.. నేనే వస్తున్నాను" అని రిసీవర్ పెట్టేసి "ఏ.సి ఆఫీసుకి వెళ్ళాలి. మరెవరికో ఎర్రని గుర్తు ఉత్తరాలు వచ్చాయట" అన్నాడు.

ఏ.సి. ఆఫీసు గదిలో ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోవిందస్వామి కూర్చునున్నారు.

"రండి యుగంధర్! గోవిందస్వామి గారు మీకు పరిచయం ఉన్నారుగా!" అన్నాడు ఏ.సి.

"లేకేం! ఈయనకీ ఎర్రనిగుర్తు ఉత్తరాలు వచ్చాయా!"

"అవును. నాకు మొదటి ఉత్తరం నెలరోజుల క్రితం వచ్చింది. ఈ బెదిరింపు ఉత్తరాలు నాకు అలవాటయిపోయాయి. ఖాతరు చెయ్యను. వారం వారం ఓ ఉత్తరం వస్తూ వచ్చింది. నిన్న కూడా ఒకటి వచ్చింది. ఇవిగో!" అని బల్లమీద ఉన్న కవర్లని చూపించాడు గోవిందస్వామి. కవర్లని తీసుకుని వాటిలో వున్న కాగితాలు ఒక్కొక్కటి బయటికి లాగి యుగంధర్ చూశాడు. భుజంగరావుకీ, చనిపోయిన మాధవన్ కీ, వచ్చినటువంటి కాగితాలే. ముందు వచ్చిన ఉత్తరాల్లో చిన్నగా ఉన్న ఎర్రని ఎక్స్ గుర్తులు పోనుపోను పెద్దవి అయాయి.

"ఈ ఉత్తరాలు ఎవరు పంపిస్తున్నారో మీకెవరిమీదనైనా అనుమానం ఉందా?" అడిగాడు యుగంధర్.

గోవిందస్వామి నవ్వి "లేదు" అన్నాడు.

"రిటయిర్డ్ జడ్జి భుజంగరావు గారు, పోలీస్ సూపరింటెంట్ మాధవన్, మీరూ కలిసి పనిచేసిన కేసు యేదయినా జ్ఞాపకం ఉన్నదా?"

"భుజంగరావు గారి కోర్టులో చాలా కేసులు ప్రాసిక్యూట్ చేశాను. మాధవన్, నేనూ కలిసి పని చేసిన కేసులు రెండే. ఒకటి దొంగనోట్ల కేసు. ఇంకొకటి సుందరం హత్య కేసు. శివరాం అనే అతన్ని విచారించి శిక్ష వేశారు" అన్నాడు ప్రాసిక్యూటర్.

"మళ్ళీ శివరాం!" అన్నాడు యుగంధర్.

"అవును. శివరాం! ఆ జైలు అధికారులు అంత అజాగ్రత్తగా ఉండటం ఏమిటి! అందులోనూ జీవిత శిక్ష అనుభవించవలసినవాడి విషయంలో" అన్నాడు ఏ.సి.

"శివరాం ఎట్లా తప్పించుకున్నదీ వివరాలు ఏమయినా తెలిశాయా?" అడిగాడు యుగంధర్.

"జైలులో తన గదిలోంచి బయిటికి వచ్చి కాపలా ఉన్న వార్డర్ ని తలమీద కొట్టి ఒక మూల పడేసి, అతని బట్టలు తను వేసుకుని జైలులోంచి బయిటికి వెళ్ళాడు. అంతే! ఆ తర్వాత అతను యేమయిందీ, ఎటు వెళ్లిందీ ఎవరికీ తెలియలేదు. రైలు స్టేషనులో, బస్సు స్టాండులో టాక్సీల వాళ్ళనీ అడిగి చూశారు. శివరాం ఎటు వెళ్లిందీ పత్తా లేదు."

పద్మప్రియ గురించి యుగంధర్ ఏ.సి.కి చెప్పాడు.

"వాటీజ్ దిస్! వీడెవడో మాంత్రికుడిలా ఉన్నాడు. నాకెందుకు వెంటనే రిపోర్టు చెయ్యలేదు? లా కాలేజీలో విచారిస్తే యేమయినా తెలిసేదేమో! ఇన్స్పెక్టర్ మీరు వెంటనే వెళ్ళండి" అన్నాడు ఏ.సి.

"యస్ సార్!" అని ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు వెళ్ళిపోయాడు.

"అతని గురించి లా కాలేజీలో యేమీ తెలుస్తుందనుకోను. చాలా జాగ్రత్తగా చేసున్నాడు యీ పనులు. ఇన్స్పెక్టర్ కి వృథాశ్రమ" అన్నాడు యుగంధర్.

"అయితే మనం ఏం చేద్దాం? గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునుండాలా! ఈ నగరంలో లా అండ్ ఆర్డర్ అనేది లేకుండా వాడెవడో తనకి ఇష్టంలేని వాళ్ళని హతమార్చి, యిష్టమయిన వాళ్ళని ఎత్తుకుపోతూ ఉంటే మనం నక్షత్రాలు లెఖ్ఖ పెడుతూ కూర్చోవాలా?" అడిగాడు ఏ.సి.

యుగంధర్ జవాబు చెప్పలేదు. ప్రాసిక్యూటర్ గోవిందస్వామి చిన్నగా దగ్గి "నన్నేం చెయ్యమంటారు?" అడిగాడు. యుగంధర్ ఏమీ చెప్పకముందే ఏ.సి. చెప్పాడు:

" నేను యిక ఏ మాత్రం తాత్సారం చెయ్యదలుచుకోలేదు. రాత్రింబగళ్ళు మీ యింటికి మఫ్టీలో ఉన్న సాయుధ కానిస్టేబుల్స్ ని కాపలా ఉంచుతాను. భుజంగరావు గారింటికీ అంతే. మీరెక్కడికి వెళ్ళినా మీ కూడా ఇద్దరు ఉంటారు."

గోవిందస్వామి చిన్నగా నవ్వి "నేను యెక్కడికి యెప్పుడెళ్ళేదీ ఆఫీసుకి రిపోర్టు చెయ్యాలా?" అడిగాడు.

ఏ.సి. తల ఊపాడు.

"మీ ఒక్కరి విషయమే కాదు. మీ ఇంట్లో వాళ్ళ విషయంలో కూడా తగిన జాగ్రత్త తీసుకోవాలి. పద్మప్రియ విషయం జ్ఞాపకం ఉంచుకోండి!" అన్నాడు యుగంధర్.

యుగంధర్ ఆ మాట చెప్పిన తర్వాత గోవిందస్వామి మొహం పాలిపోయింది.

"కాలేజీలకి వెళుతున్న పిల్లలు!" అన్నాడు.

"తగిన కట్టుదిట్టాలు చెయ్యాలి" చెప్పాడు యుగంధర్.

"ఆల్ రైట్!" అని "ఆ శివరాంని పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారా?" అడిగాడు ప్రాసిక్యూటర్.

"ప్రయత్నాలా! డిపార్టుమెంటు అంతా అదే విషయం చూస్తున్నారు. రాష్ట్రంలో పోలీసు సిబ్బంది అంతా వెయ్యి కళ్ళతో కనిపెడుతున్నారు. హోటళ్ళు, రైలు స్టేషన్లు, సినిమా హాల్సు, నలుగురు కలుసుకునే ప్రతిచోటా శివరాం ఫోటోలు అతికించాము. ప్రతి పోలీస్ కానిస్టేబుల్ జేబులో శివరాం ఫోటోలున్నాయి. రెండు వేల రూపాయల బహుమానం ప్రకటించాము. పోలీసు ఉద్యోగి అయినాసరే బహుమానం ఇస్తామన్నాము."

"అయితే ఆ శివరాం ఎక్కువకాలం తప్పించుకు తిరగలేడు"అన్నాడు గోవిందస్వామి.

## 11

డిటెక్టివ్ యుగంధర్ తన కన్సల్టింగ్ రూంలో సిగిరెట్ తర్వాత సిగిరెట్ తాగుతూ పచార్లు చేస్తున్నాడు. చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నాడని రాజుకి తెలుసు. అందుకే పలకరించకుండా మౌనంగా కూర్చున్నాడు.

ఎర్రని గుర్తు ఉన్న బెదిరింపు ఉత్తరాలు తమకు వచ్చాయి అంటూ పోలీస్ కమీషనర్ ఆఫీసుకి మరొక నలుగురు వచ్చారు ఆ వేళ సాయంత్రానికి. ఒకరు రిటైర్డ్ పోలీస్ డాక్టర్ మహితా. రెండో మనిషి పోలీస్ డిపార్ట్మెంటులో ఇంకా సర్వీసులో ఉండి రెండు నెలల నించీ శెలవు మీద ఉన్న వేలిముద్రల నిపుణుడు సుభాన్ సింగ్. మూడో అతను బీటు కానిస్టేబుల్ వరదయ్య. ఓ హత్య కేసులో ప్రత్యక్ష సాక్షిగా సాక్ష్యం ఇచ్చిన

వై.ఎస్.మణి అనే యువకుడు నాలుగో మనిషి. ఆ నలుగురికీ సుందరం హత్య కేసుతో ఎటువంటి సంబంధమూ లేదు. ఆ ప్రత్యక్ష సాక్షి మణి ఇంకేదో హత్య కేసులో సాక్ష్యం ఇచ్చాడు.

"రాజూ! ఈ కేసులో నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"నాకేమీ అర్థం కాకుండా ఉంది సార్! శివరాం కేసుతో ఎటువంటి సంబంధమూ లేనివాళ్ళకి కూడా ఎర్రనిగుర్తు ఉత్తరాలు వచ్చాయి. కనుక ఈ ఉత్తరాలు శివరామో, అతని తరపున మరెవరో పంపించారని అనుకోవడానికి అవకాశం లేకుండా ఉన్నది" అన్నాడు రాజు.

"ఆ విషయమే నేనూ ఆలోచిస్తున్నాను. శివరాంకీ, ఈ ఎర్రనిగుర్తు ఉత్తరాలకీ సంబంధమే లేదా? అయితే మాధవన్ హత్యకి నాలుగు రోజుల క్రితం శివరాం జైలులోంచి ఎందుకు తప్పించుకున్నాడు? భుజంగరావుకీ, మాధవన్ కీ, గోవిందస్వామికీ శివరాం కేసుతో సంబంధం ఉండడం విషయం యేమిటి? అది కాకతాళీయమా? వీళ్ళందర్నీ హత్య చేస్తానని ఎవరో బెదిరించడానికీ, హత్య చెయ్యడానికి ప్రయత్నించడానికీ మనకి తెలియని కారణం యేదో ఉన్నదా? అంటే యేదో విధంగా వీళ్ళందరికీ సంబంధం ఉండాలి కదా?" అన్నాడు యుగంధర్.

"అవును. క్రిమినల్ కేసులతో వీళ్ళకి సంబంధం ఉండి ఉండాలి అని వాళ్ళ వృత్తిని బట్టి తెలుస్తూనే ఉందిగా! ఆ ప్రత్యక్ష సాక్షి మణి ఒక్కడికీ తప్ప."

యుగంధర్ తల ఊపాడు. "అవును. అతని విషయం ఆరా తియ్యాలి. ఏ.సి. ఆ కేసు తాలూకు వివరాలు పంపుతానన్నాడు. ఇంకా రాలేదు. ఒకసారి జ్ఞాపకం చెయ్యి!"

రాజు ఏ.సి. ఆఫీసుకి ఫోన్ చేసి "ఇప్పుడే పంపించారుట సార్!" అన్నాడు.

అంతలో ఏ.సి. ఆఫీసు నుంచి ఒకతను వచ్చి యుగంధర్ కి ఒక పొడుగాటి కవరు ఇచ్చాడు. యుగంధర్ చదివి ఒక్కొక్క కాగితమే రాజుకిచ్చాడు. అది ఒక దొమ్మీ కేసు. సెవెన్ వెల్స్ దగ్గిర రెండు రౌడీ ముఠాల మధ్య తగాదా వచ్చింది. కొట్టుకున్నారు. సోడాబుడ్లు విసిరేసుకున్నారు. ఒకతను కత్తితో ఇంకొకతన్ని పొడిచాడు. అతను వెంటనే ప్రాణాలు విడిచాడు. మధ్యాహ్నం భోజనానికి అప్పుడే యిటు వచ్చిన వై.ఎస్.మణిఆ పోట్లాట కళ్ళారా చూశాడు. పోలీసులు రాగానే జరిగింది వివరంగా చెప్పాడు. తర్వాత కత్తితో పొడిచిన అతన్ని పోలీసులు అడిగినప్పుడు గుర్తుపట్టాడు. ప్రాసిక్యూషన్ ముఖ్యసాక్షిగా మణి బోను ఎక్కాడు. హంతకుడికి పదేళ్ళ శిక్ష, మరో పన్నెండు మందికి ఏడాది శిక్ష విధించారు. ఆ కేసు విచారణ రెండేళ్ళ క్రితం పూర్తి అయింది. అవీ వివరాలు. ఆ కేసులో భుజంగరావు కానీ,

ప్రాసిక్యూటర్ గోవిందస్వామి కానీ, ఎర్రని గుర్తు ఉత్తరాలు వచ్చిన మరెవరు కానీ పాల్గొనలేదు. మణి ఒక్కడికే సంబంధం ఉంది.

రాజు ఆ కాగితాలు మడిచి కవరులో పెట్టి "యేమీ అర్థం కాకుండా ఉన్నది. ఈ కేసుతో భుజంగరావుకి గాని తదితరులకి గాని యేమీ సంబంధం లేదే!" అన్నాడు.

యుగంధర్ తల ఊపి "లేదని మనం అనుకుంటున్నాము. యేదో సంబంధం ఉండి ఉండాలి" అన్నాడు.

అంతలో చెవులు చిల్లులు పడేటట్లు టెలిఫోన్ గణగణ మోగింది. రాజు రిసీవర్ తీసుకున్నాడు. "ఆ! చెపుతాను. బయలుదేరి వచ్చేస్తాం" అని రిసీవర్ పెట్టేసి "ప్రాసిక్యూటర్ గోవిందస్వామి హత్య చేయబడ్డాడట. ఏ.సి.ఫోను చేశారు" అన్నాడు.

"అయ్యో! అంత కట్టుదిట్టమయిన రక్షణ యేర్పాటు చేసినా ప్రయోజనం లేకపోయిందా! యెలా జరిగింది?" అడిగాడు యుగంధర్.

"వివరాలు యేవీ ఏ.సి.కే తెలియవుట – మిమ్మల్ని వెంటనే రమ్మన్నారు" అన్నాడు రాజు. యుగంధర్ కోటు వేసుకుంటున్నాడు. కారు షెడ్లోంచి తీసుకురావడానికి రాజు వెళ్ళాడు. అంతలో మళ్ళీ ఫోను మోగింది.

"యుగంధర్ స్పీకింగ్!" అని కళ్ళు చిట్లించి "అవును. మీ గొంతు గుర్తుపట్టాను" అన్నాడు.

"వెరీ గుడ్! ప్రాసిక్యూటర్ గోవిందస్వామిని హతమార్చాను."

"విషయం ఇప్పుడే తెలిసింది. మీరు వీళ్ళ మీద యెందుకు అంత కసి పెట్టుకున్నారు? మీకు ఏం అపకారం చేశారు వీళ్ళంతా?" అడిగాడు యుగంధర్.

అవతలనించి నవ్వు వినపడింది. "తెలుసుకోవాలని ఉంది కదూ! నేను చెపితే కానీ ఎవరికీ తెలియదు."

"ఎందుకు చెప్పకూడదు?"

"చెపితే నేనెవరో తెలిసిపోవచ్చు."

"మీరెవరో యెప్పటికీ కనుక్కోలేమనా మీ ఉద్దేశ్యం?"

"కనుక్కోవచ్చు. చివరికి నా అంతట నేనే మీ ఆఫీసుకి వచ్చి మీకు పట్టుబడవచ్చు. అంతలోగా పట్టుకోలేరు. నా పని పూర్తి కాలేదు."

"యేమిటా పని? వీళ్ళనందర్నీ హతమార్చడమేనా?" అడిగాడు యుగంధర్.

"అవును. తప్పా? ఒక మనిషి నేరం చేశాడాలేదా నిర్ణయించి ఆ మనిషి దోషని నిశ్చయించి, అతని ప్రాణం తీయడానికి వీళ్ళందరికీ ఉన్న అధికారం నాకు లేదా?"

యుగంధర్ క్షణం మౌనంగా ఉండి "కోర్టులో నలుగురి ముందూ విచారించి నేరం చేసినట్లు రుజువు అయితేనే శిక్ష విధిస్తారు. కాని వాళ్ళ ఇష్టప్రకారం చేయడం లేదుగా! చట్టప్రకారం చేస్తున్నారు. అది వాళ్ళ ఉద్యోగ ధర్మం" అన్నాడు.

"ఇది నా ఉద్యోగంగా పెట్టుకున్నాను. నా ఉద్యోగధర్మం. ఒక మనిషిని హంతకుడనో, హంతకురాలనో నిర్ణయించి ఆ మనిషి ప్రాణం తియ్యడానికి వీళ్ళకేం అధికారం ఉంది? వీళ్ళు దేవుళ్ళా!" అని రిసీవర్ పెట్టేశాడు అవతల మనిషి.

## 12

ప్రాసిక్యూటర్ గోవిందస్వామి ఇంటి ముందు కార్లు, వాన్లు, పోలీసులు, జనం. రాజు కారు వీధిలో ఆపాడు. లోపలకి యెవర్నీ వెళ్ళనివ్వకుండా కాపలా ఉన్న పోలీసులు యుగంధర్ని చూడగానే సెల్యూట్ చేశారు.

కమీషనర్ ఆఫ్ పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్, హాల్లో నిలుచునున్నారు.

"వాటీజ్ దిస్ యుగంధర్! చాలా ఘోరం! డిపార్ట్మెంట్ నవ్వుల పాలయిపోయింది. ఈ పట్టణంలో పోలీసులని ఎవరు లెఖ్ఖ చేస్తారు? ఎవరు పోలీసు వాళ్ళని గౌరవిస్తారు?" అన్నాడు ఐ. జి ఆవేశంతో.

"యుగంధర్! ఈ కేసులో మీకు కూడా ఇంట్రస్టు ఉన్నదనీ, మీరు పోలీసు డిపార్ట్మెంటుతో కలిసి దర్యాప్తు చేస్తున్నారనీ ఏ.సి. చెప్పగానే నేను చాలా ధైర్యంగా ఉన్నాను" అన్నాడు కమీషనర్.

లోపల్నించి యేడుపులు వినిపిస్తున్నాయి. టెలిఫోన్ ఆగకుండా మోగుతోంది. ప్రాసిక్యూటర్ స్నేహితులు సంతాపం తెలియచెయ్యడానికి ఫోను చేస్తున్నారు.

"డామిట్! రిసీవర్ తీసి కిందపెట్టండి!" అన్నాడు ఐ.జి. చాలా విసుగ్గా.

"హత్య యెలా జరిగింది?" అడిగాడు యుగంధర్.

"ఇద్దరు పోలీసు కానిస్టేబుల్స్ గేటు వద్ద, యిద్దరు మఫ్టీలో గోవిందస్వామి గది ముందు కాపలా ఉండగా యెలా ఈ హత్య జరిగిందని అడగండి. రేపు పత్రికల్లో అందరూ అడగపోయే ప్రశ్న అదే?" అన్నాడు కమీషనర్.

యుగంధర్ మౌనంగా ఉండిపోయాడు.

"మేడ మీది గదిలో కిటికీ దగ్గిర గోవిందస్వామి రక్తపుమడుగులో పడి ఉన్నాడు. తెల్లారిన తర్వాత ఆయన భార్య కాఫీ ఇవ్వడానికి ఆయన గదిలోకి వెళ్ళినప్పుడు చూసింది. వెంటనే అందర్నీ లేపింది. మాకు ఫోన్ చేశారు" అన్నాడు కమీషనర్.

"నలుగురు పోలీసులు కాపలా ఉండగా యెలా వచ్చాడు హంతకుడు?" అన్నాడు యుగంధర్.

"అదే నాకు అర్థం కాకుండా ఉంది. పగలు ఒక జట్టు, రాత్రి ఒక జట్టు యేర్పాటు చేశాం. వాళ్ళని కళ్ళు ముయ్యవద్దని హెచ్చరించాం. రండి! ఏ.సి., ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, పోలీస్ సర్జన్ హత్య జరిగిన గదిలో ఉన్నారు.

యుగంధర్ కమీషనర్ తో మేడమెట్లు యెక్కాడు. యుగంధర్ ని చూసి ఏ.సి. తల ఊపాడు. స్వరాజ్యరావు యుగంధర్ని దీనంగా చూశాడు. పెద్ద కిటికీ, కిటికీకి ఊచలు. ఆ కిటికీకి కింద పడున్నాడు ప్రాసిక్యూటర్ గోవిందస్వామి. "ఈ తలుపు బైట కన్ను ముయ్యకుండా కాపలా ఉన్నాం అన్నారు ఆ యిద్దరు పోలీస్ కానిస్టేబుల్స్" అన్నాడు ఏ.సి.

"బయిటినుంచే కాల్చి ఉండాలి" అన్నాడు స్వరాజ్యరావు.

"ఇంత దూరం పిస్తోలుతో ఎలా కాలుస్తాడు?"

"రైఫుల్ అయి ఉండవచ్చు" సూచించాడు యుగంధర్.

"యెక్కణ్ణించి?"

"అదుగో ఆ చెట్టు మీదనుంచి. సరీగా గురి చూస్తే సరి" అన్నాడు యుగంధర్. ప్రహరీగోడకి అవతల, పేవ్మెంటు పక్కన ఓ పెద్ద చెట్టున్నది. గుబురుగా ఉన్న ఆకుల మధ్యనించి సూర్యకిరణాలు సన్నగా వస్తున్నాయి.

"రాజూ! వెళ్ళి చూడు" చెప్పాడు యుగంధర్.

"రైఫుల్ పేల్చిన చప్పుడు మన కానిస్టేబుల్స్ కి వినిపించి ఉండదూ?" అడిగాడు ఐ.జి.

"వాళ్ళని అడగాలి" అన్నాడు ఏ.సి. ఇన్స్పెక్టర్ వైపు చూసి. స్వరాజ్యరావు వెంటనే గదిలోంచి బయటికి వెళ్ళాడు.

పోలీస్ సర్జన్ పరీక్ష పూర్తి చేసి "యేముంది చెప్పడానికి? గుండు నుదుటి మీద గుచ్చుకుంది. లోపలకి వెళ్ళింది. రక్తం కారింది. గుండు తగిలిన మరుక్షణం ప్రాణంపోయి ఉండాలి. రాత్రి పదకొండు గంటలకీ, పన్నెండు గంటలకీ మధ్య చనిపోయి ఉండాలని ఉజ్జాయింపుగా చెప్పగలుగుతున్నాను. అంతకన్నా కరెక్టుగా చెప్పాలంటే శవపరీక్ష చెయ్యవలసిందే" అన్నాడు.

"బయటికి చూస్తూ కిటికీ దగ్గర నిలుచునుండాలి కదూ!" అన్నాడు ఏ.సి.

"యేమో! గుండు చాలా దూరాన్నించి వచ్చి ఉండాలి. అంతే చెప్పగలను!" అన్నాడు సర్జన్.

రాజు, స్వరాజ్యరావు గదిలోకి వచ్చారు. అందరూ రాజు వైపు చూశారు.

"యస్ సార్! ఎవరో చెట్టు ఎక్కినట్లు స్పష్టంగా కనబడుతోంది. బూడ్సులు నొక్కినట్లు రెండుచోట్ల బెరడు చితికిపోయింది. ఈ కిటికీకి సరిగా ఎదురుగా కూర్చునేందుకు రెండు కొమ్మల మధ్య చోటున్నది. హంతకుడు ఆ చెట్టు ఎక్కి రైఫుల్ తో కాల్చి వుండాలి" అన్నాడు రాజు.

"అవును. రాత్రి పదకొండున్నర ప్రాంతాల ఠప్ మని చప్పుడు వినిపించిందిట. గేటు దగ్గర కాపలా ఉన్న కానిస్టేబుల్ ఆ చప్పుడు ఇంట్లోంచి రాలేదనీ, బైటనించి వచ్చిందనీ తెలుసుకుని కారో, మోటార్ సైకిలో బాక్ ఫైర్ అయి ఉంటుందని అనుకున్నాడుట" చెప్పాడు ఏ.సి.

"యేడవలేకపోయాడు. వెంటనే చూసి వుంటే చెట్టు మీద కూర్చున్న హంతకుడు దొరికేవాడు" అన్నాడు కమీషనర్.

"ఆ కానిస్టేబుల్ ని నిందించడం అన్యాయం. గోవిందస్వామి ఇంట్లో ఉన్నాడని కానిస్టేబుల్ కి తెలుసు. వీధిలో ఎక్కడో ఠప్ మని చప్పుడయితే

చెట్టు మీది నుంచి ఎవడో రైఫుల్ పేల్చి ఉంటాడని ఎలా అనుకుంటాడు? ఆ చెట్టు విషయం జాగ్రత్త అని అతనికి ముందే చెప్పి ఉండవలసింది" అన్నాడు యుగంధర్.

"యస్! యు ఆర్ కరెక్ట్! గోవిందస్వామి రక్షణకి ఏర్పాట్లు చేసినవాళ్ళు ఆ చెట్టు కొట్టించవలసింది" అన్నాడు కమీషనర్.

ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, ఏ.సి. మొహాలు ముడుచుకున్నారు. అది మందలింపని వాళ్ళకి తెలుసు.

"ఆ రైఫుల్ చప్పుడు విన్న కానిస్టేబుల్ ని దయచేసి పిలుస్తారా?" అడిగాడు యుగంధర్.

వెంటనే సార్జంటు శివం బయటికి వెళ్ళి నిముషంలో ఒక కానిస్టేబుల్ తో తిరిగి వచ్చాడు.

"నువ్వు గేటు దగ్గరే రాత్రంతా కాపలా ఉన్నావా?"

"అవును సార్!"

"కారు బాక్ ఫైర్ అయినట్లు చప్పుడు వినిపించిందిటగా నీకు. రాత్రి ఎన్ని గంటలకు వినిపించింది?" అడిగాడు యుగంధర్.

"పదకొండు గంటలు దాటి ఉంటుంది సార్! నేను టయిం చూడలేదు."

"సరే. ఆ సమయంలో గేటు దగ్గిర కాని, ఆ చెట్టు ప్రాంతాల గాని యెవర్నయినా చూశావా?"

ఆ కానిస్టేబుల్ ఓ నిముషం ఆలోచించి "గేటు దగ్గిర ఎవర్నీ చూడలేదు సార్! చప్పుడయిన తర్వాతో ముందో జ్ఞాపకం లేదు కాని ఆ చెట్టు వెనకనించీ ఓ మనిషి పేవ్మెంట్ మీదికెళ్ళి అటు వెళ్ళిపోయాడు సార్!" చెప్పాడు.

"అతని చేతిలో యేమున్నది?"

"దూరాన్నించి నాకు సరిగా కనిపించలేదు కాని భుజం మీద కొన్ని కర్రలున్నాయి."

"మనిషి యెలా ఉన్నాడు? నువ్వు మొహం చూసి ఉండవు. భారీగా ఉన్నాడా?"

"లేదు సార్! బాగా వొంగిపోయి ఉన్నాడు. ముసలాడిలా నడిచాడు."

"సరే! ఇక నువ్వు వెళ్ళవచ్చు" అని పోలీసు ఉద్యోగుల వైపు తిరిగి "చాలా చాకచక్యంతో చేశాడు. ముసలాడి వేషం వేసుకుని, భుజం మీద మూడు నాలుగు కర్రలు పెట్టుకుని వాటిమధ్య రైఫుల్ దాచాడు. ఇటునుంచి కాక అటునుంచి వచ్చి చెట్టు వెనక్కి వెళ్ళాడు. ఎవరూ తనని

చూడటం లేదని నిశ్చయించుకుని చెట్టు ఎక్కాడు. ఆ చెట్టు ఆకుల మధ్య కూర్చుంటే ఎవరికీ కనపడదు. అయిదు నిమిషాలే కూర్చున్నాడో, గంటో గంటన్నరో కూర్చున్నాడో, ఎంతసేపు కాచుకున్నాడో మనం ఊహించలేము. గోవిందస్వామి ఎందుకో కిటికీ దగ్గరికి వెళ్ళి బయటికి చూస్తున్నప్పుడు గురి చూసి రైఫుల్ పేల్చి ఉంటాడు" అన్నాడు యుగంధర్.

"ఈ వివరాలను బట్టి హంతకుడి విషయం ఏమయినా ఊహించగలరా?" అడిగాడు ఐ.జి.

"కొన్ని విషయాలు ఊహించవచ్చు. హంతకుడు సులభంగా చెట్టు ఎక్కగలడు. మంచి దృష్టి ఉండి ఉండాలి. కనుక వృద్ధుడు కాదు. చాలా తెలివైనవాడనీ, ధైర్యం ఉన్నవాడనీ, తెగించినవాడనీ అనుకోవచ్చు.

"అతన్ని వెంటనే పట్టుకునేందుకు మీరేమైనా సూచనలు ఇవ్వగలరా?" అడిగాడు కమీషనర్.

యుగంధర్ నవ్వి "అంత సులభం కాదనుకుంటాను. హంతకుడు ఎన్నాళ్ళనించో ఈ హత్యలకి ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. గోవిందస్వామి హత్య విషయంలో ఆ విషయం రుజువు అవుతోంది. ఆయన ఇంటికి పోలీసులు కాపలా ఉంటారనీ, ఇంట్లో జొరబడి హత్య చెయ్యడానికి వీలుండదనీ హంతకుడికి ముందే తెలిసివుండాలి. అందుకే ఆ చెట్టు చూసుకుని హత్య ఎలా చెయ్యవచ్చో ముందే ఆలోచించుకుని ఉంటాడు. ఇప్పుడు మనం చెయ్యవలసిన పని మిగతా వాళ్ళకు పటిష్టమైన రక్షణ ఏర్పాటు చెయ్యడం, వాళ్ళని హత్య చెయ్యడానికి హంతకుడికి ఏ మాత్రం అవకాశం లేకుండా చెయ్యాలి" అన్నాడు.

"యస్! అది చాలా ముఖ్యం. కిటికీలు, వాటికి యెదురుగా ఉండే చెట్లు మొదలైన వాంటేజి పాయింట్లన్నీ చాలా జాగ్రత్తగా చూడండి. ఇంకో హత్య జరగడానికి వీల్లేదు" అన్నాడు ఐ.జి.

కమీషనర్, ఏ.సి. ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. "హంతకుడికి మీ పోలీసు డిపార్ట్మెంటు మీద చాలా ద్వేషమూ, ఏం చెయ్యలేరనే చులకన భావమూ ఉన్నట్లున్నది" అన్నాడు యుగంధర్.

"యెందుకని?" అడిగాడు కమీషనర్.

"ఎర్రగుర్తు ఉత్తరాలు పంపి, ముందు నోటీసిచ్చి హత్యలు చేస్తున్నాడంటే పోలీసు డిపార్టుమెంటుని నవ్వులపాలు చేసి, అప్రదిష్ట తేవాలని సంకల్పించాడనుకోవచ్చు" అన్నాడు యుగంధర్.

"యస్! యస్! అదీ ఒక పాయింటే!" అని తల ఊపాడు ఐ.జి.

**"ఎవరు మీరు? నేను మిమ్మల్ని** యెప్పుడూ చూడలేదే!తాతగారి మీద గాని, నా మీద గాని మీకెందుకింత ద్వేషమో ఊహించలేకుండా ఉన్నాను" అన్నది పద్మప్రియ.

ఆమె బంధింపబడిన గదిలోకి వచ్చిన అతను చిన్నగా నవ్వి, తలుపుకి అడ్డంగా కుర్చీ లాక్కుని కూర్చుని "అవును. ఊహించడం చాలా కష్టం. ఆ డిటెక్టివ్ యుగంధరే తెలియక బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడు" అన్నాడు. గదిలోకి వెలుగు, గాలీ బాగా వస్తున్నాయి. బల్ల వేసుకుని ఎక్కినా అందనంత ఎత్తుగా నాలుగు కిటికీలు ఉన్నాయి.

పద్మప్రియ అతన్ని పరీక్షగా చూసింది. నల్లటి జుట్టు, పెద్ద మీసాలు, సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. నలభై యేళ్ళ మనిషిలా కనిపిస్తున్నాడు. తీరు, భాష, ఉచ్చారణ బట్టి చదువు సంస్కారం ఉన్న మనిషిలా ఉన్నాడు.

"నన్ను, రాధని ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చారు?"అడిగింది. మంచం మీద పడుకుని నిద్రపోతోంది రాధ.

అతను మళ్ళీ నవ్వి "నన్ను గుర్తుపట్టకుండా రాధని తీసుకువచ్చాను. రాధని చూసుకునేందుకు నిన్ను తీసుకువచ్చాను" అన్నాడు.

పద్మప్రియ నిప్పులు కక్కుతూ అతన్ని చూసి "నన్ను చంపదలుచుకుంటే ఆ పని త్వరగా కానివ్వండి" అన్నది.

"నా మాట నువ్వు నమ్మడంలేదన్న మాట. నీకు కానీ రాధకి కానీ ఎటువంటి హానీ చెయ్యాలన్న ఉద్దేశం లేదు నాకు. రాత్రి నీకు భోజనం తెచ్చిపెట్టిన మా పనిమనిషిని చూసి రాధ దడుసుకుంది. ఒకటే ఏడుపు. అందుకని నిన్ను తీసుకొచ్చాను. రాధకి నీ దగ్గిర చనువు ఉన్నదని నాకు తెలుసు. సునీత కోసం అప్పుడప్పుడు నువ్వు వాళ్ళింటికి వెళ్ళేదానివి కదూ!" అన్నాడతను.

"నన్నూ, రాధనీ ఇక్కడ ఎంత కాలం నిర్బంధించదలుచుకున్నారు?"

"ఏమో! నాకే తెలియదు. నా పని పూర్తి కాగానే మిమ్మల్ని మీ యిళ్ళకి పంపేస్తాను."

"ఏమిటా పని?"

"ఇంకా కొంతమంది ఉన్నారు. వాళ్ళని శిక్షించాలి."

"ఎందుకు? వాళ్ళు మీకేం అపకారం చేశారు? మా తాతగారు మీకేం హాని చేశారు?"

అతను గొంతు సవరించుకుని ఏదో చెప్పబోయి మనస్సు మార్చుకుని "చెప్పను. చెపితే నేనెవరో తెలిసిపోతుంది. నేనెవరో నీకు తెలిసినా, నీ ద్వారా యుగంధర్ కి తెలిసినా అది నీకే క్షేమం కాదు" అన్నాడు.

"నాకు తెలిస్తే ఏం? నేను యిక్కడ మీ బందీగా ఉన్నానుగా?"

"అవును. ఒకవేళ నువ్వు ఎట్లాగో యిక్కణ్ణించి తప్పించుకుని పారిపోతే నా విషయం బయటపెట్టకుండా నిన్ను చంపవలసి వస్తుంది. అటువంటి పరిస్థితి ఏర్పడేటట్లు ఎందుకు చెయ్యడం?"

అతన్ని ఎంత రెట్టించినా, ఎంత అడిగినా ప్రయోజనం లేదని పద్మప్రియ గ్రహించింది. "పోనీ మీ పని ఎప్పుడు అవుతుందో, మమ్మల్ని ఎప్పుడు విడిచిపెడతారో చెప్పగలరా?" అడిగింది.

"అదీ చెప్పలేను. భయపడవద్దనీ, దిగులుపడవద్దనీ నీకు చెప్పడానికే వచ్చాను. నీకు గాని, రాధకు గాని ఎటువంటి హానీ జరగదని మరొకసారి చెపుతున్నాను. నీకు ఏం కావలసినా ఇస్తాను. అదుగో ఆ అట్ట మీద రాయి. రోజూ పనిమనిషి ఆ అట్ట నాకు చూపిస్తుంది. నీకు కావలసినవి వెంటనే పంపిస్తాను. ఆ బీరువా నిండా పుస్తకాలున్నాయి. ఆ ఇంకో బీరువాలో బట్టలున్నాయి. ఆ డబ్బాల్లో బిస్కట్లు, చాకలెట్లు ఉన్నాయి. రాధని చూసుకో!" అని అతను లేచాడు.

"ఒక్క క్షణం ఆగండి" అన్నది పద్మప్రియ.

"ఏమిటి?"

"నేను క్షేమంగా ఉన్నానని తాతగారికి తెలియజెయ్యాలి. పాపం రాధ తల్లిదండ్రులకి కూడా తెలియజెయ్యాలి."

"యుగంధర్ కి చెప్పాను. మీరిద్దరూ క్షేమంగా ఉన్నారనీ, ఎటువంటి హానీ జరగదనీ హామీ ఇచ్చాను" అని అతను వెళ్ళిపోయాడు.

పద్మ మంచం మీద చతికిలపడ్డది. ఏమిటీ విచిత్రం! ఇతను హంతకుడా! నిర్దాక్షిణ్యంగా మనుషులను చంపేవాడికి తన మీదా, రాధ మీదా ఎందుకు ఈ కనికరం? ఒకే మనిషిలో అంతులేని ద్వేషం, పట్టలేని క్రౌర్యం ఒక పక్కా; దయా, ప్రేమా ఇంకొక పక్కా ఉంటాయా! ఇతనెవరో తెలుసుకునే కిటుకు అందులోనే ఉందా! తను తప్పించుకునేందుకు ఏదయినా మార్గం ఉందా?

14

ఫస్టు పోస్టులో వచ్చిన ఉత్తరాలు చూస్తున్నాడు యుగంధర్. కొంతమంది క్లయింట్లు రాసిన ధన్యవాదాల ఉత్తరాలు, ఓ పెళ్ళి ఇన్విటేషన్, పుస్తకాల షాపు వాళ్ళ బిల్లు చూసి అవతల పెట్టి ఆఖరు కవరు చింపాడు. అందులోంచి తెల్లకాగితం బయటికి తీసి ఆశ్చర్యంతో దాన్ని చూసి రాజుకిచ్చి "నాకూ వచ్చింది" అన్నాడు.

రెండంగుళాల పొడుగు, ఒకటిన్నర అంగుళాల వెడల్పు ఉన్న తెల్లకాగితం. మధ్య చిన్న ఎఱ్రని గుర్తు. ఇంకో కాగితం.

రాజు పళ్ళు బిగించి "వీడికెంత ధైర్యం!" అన్నాడు.

యుగంధర్ నవ్వి " ఇదీ ఒక విధంగా మంచిదే!" అన్నాడు.

"అవును. మన జోలికి వస్తే పట్టుబడకుండా తప్పించుకోలేడు" అని రాజు అంటూ ఉండగా టెలిఫోను మోగింది. యుగంధర్ రిసీవర్ తీసుకున్నాడు.

"యుగంధర్ మీకు ఇవాళ పోస్టులో ఒక ఉత్తరం వస్తుంది. అందులో వ్రాసిన విషయాల గురించి బాగా ఆలోచించండి. మళ్ళీ రాత్రి ఫోను చేస్తాను. ఏం నిర్ణయం చేసుకున్నదీ అప్పుడు చెప్పండి" అని యుగంధర్ జవాబు చెప్పకముందే డిస్కనెక్టు చేశాడు.

యుగంధర్ భుజంగరావుకి టెలిఫోను చేసి మళ్ళీ బెదిరింపు ఉత్తరమేమయినా వచ్చిందేమో అడిగాడు.

"లేదు. మీ మనుష్యులు నీడలా నా వెంట ఉంటున్నారు. నాకు ఆపద ఏమీ జరగదు. కానీ పద్మ...." అన్నాడు భుజంగరావు. అతని గొంతులో వణుకు స్పష్టంగా వినిపించింది.

"భయపడకండి. పద్మని సురక్షితంగా తీసుకురావడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అని రిసీవర్ పెట్టేశాడు యుగంధర్. తర్వాత ఏ.సి.కి ఫోను చేశాడు.

"ఇంతవరకూ మళ్ళీ ఏం జరగలేదు. మిగతావాళ్ళ నందర్నీ జాగ్రత్తగా కాపలా కాస్తున్నాము. ఇంకో హత్య జరగనివ్వము. తెగించి ప్రయత్నించాడా హంతకుడు దొరికిపోతాడు" అని చెప్పాడు ఏ.సి.

తనకి ఎఱ్రని గుర్తు ఉత్తరం వచ్చిందని యుగంధర్ చెప్పగానే " మీకూ వచ్చిందీ? అయితే మీకు వెంటనే రక్షణ ఏర్పాటు చేయిస్తాను" అన్నాడు.

"అనవసరం. నా రక్షణ నేను చూసుకుంటాను. కొత్తగా ఏమయినా జరిగిందేమో కనుక్కునేందుకు ఫోను చేశాను" అని రిసీవర్ పెట్టేశాడు యుగంధర్. దీర్ఘంగా ఆలోచిస్తూ గదిలో పచార్లు చెయ్యడం ప్రారంభించాడు. పది నిమిషాలు చూసి "ఏమిటంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు?" అడిగాడు రాజు.

యుగంధర్ నవ్వి "ఆలోచించడం తప్ప ప్రస్తుతం మనం చెయ్యగలిగిందేమీ లేదు. ఈ కేసులో మనం ఇంతవరకు చేసినదేమిటి? భుజంగరావు రక్షణకి ఇద్దరు మనుష్యులను పంపాము. అంతేగా! హంతకుడెవడో, ఎందుకీ హత్యలు చేస్తున్నాడో యింతవరకు సూచనగానయినా తెలియలేదు. ఏ క్షణాన ఎవరిని ఏ విధంగా హత్య చేస్తాడో తెలియక భయపడుతూ కూర్చున్నాము. అంతేగా!" అన్నాడు.

"అంతకన్నా మనం ఏం చెయ్యగలం! సూచనగానయినా ఏమీ తెలియనిదే!" అన్నాడు రాజు.

"అవును. అదే నేనూ అంటున్నది. మనకంటే తెలివయినవాణ్ణని హంతకుడు ఇప్పటివరకూ రుజువు చేశాడు. మన కళ్ళముందు రాధని ఎత్తుకుపోయాడు. తర్వాత పద్మప్రియని ఎత్తుకుపోయాడు. గోవిందస్వామిని హత్య చేశాడు. ఈ పనులన్నీ ఎందుకు చేస్తున్నాడో ఊహించలేకుండా ఉన్నాము. జైలు నుండి తప్పించుకున్న శివరాంకీ, ఈ హంతకుడికీ ఏమయినా సంబంధమున్నదో లేదో తెలియడం లేదు."

"మనం ఏదయినా ఎత్తువేసి ఆ హంతకుడి చేత తన ఆనవాలు బయట పెట్టించాలి."

"అదే ఆలోచిస్తున్నాను." అన్నాడు యుగంధర్.

అరగంట పచార్లు చేస్తూ ఆలోచించాడు. ఆష్ ట్రే సిగరెట్ పీకలతో నిండిపోయింది. ఉన్నట్లుండి కుర్చీలోంచి లేచి "అంతే! అలాగే చెయ్యాలి" అన్నాడు.

"ఏం చెయ్యాలి?" అడిగాడు రాజు.

యుగంధర్ చెప్పడం ప్రారంభించాడు.

## 15

డిటెక్టివ్ యుగంధర్ టెలిఫోను దగ్గిర కూర్చున్నాడు. సాయంకాలం మళ్ళీ ఫోను చేస్తానని చెప్పాడు హంతకుడు. అయిదు గంటలయింది. ఆ ఫోను కోసం కాచుకునున్నాడు. తను యేర్పాటు చేసిన ప్రకారం అన్నీ సక్రమంగా జరిగితే ఈసారి హంతకుడు చిక్కి తీరాలి. పోలీసు డిపార్టుమెంటులోని అందరు ఉద్యోగులు పాల్గొనే ఇంత పెద్ద వల ఇంత జాగ్రత్తగా ఇదివరకెన్నడూ తను వెయ్యలేదు. మద్రాసు నగరంలో ఉన్న అన్ని పబ్లిక్ టెలిఫోన్ బూతుల దగ్గిరా మఫ్టీలో ఉన్న ఇద్దరిద్దరు కానిస్టేబుల్స్ కాపలా ఉండేట్లు ఏర్పాట్లు చేశారు. ఏ.సి., స్వరాజ్యరావు టెలిఫోను ఎక్స్చేంజి మేనేజరు గదిలో కూర్చున్నారు. రాజు ఆటోమాటిక్ టెలిఫోన్ ఎక్స్చేంజి మిషను దగ్గిర ఒక టెలిఫోను ఆపరేటరుతో కాపలా ఉన్నాడు. చెవులకి హెడ్ ఫోన్స్ పెట్టుకున్నాడు. యుగంధర్ కి ఎవరు ఫోన్ చేసి మాట్లాడినా ఆ మాటలు రాజుకి వినపడతాయి. హంతకుడు ఫోన్ చేస్తే రాజు వెంటనే పక్కన ఉన్న స్విచ్ నొక్కాలి. ఆ స్విచ్ నొక్కిన మరుక్షణం హంతకుడు ఏ టెలిఫోన్ బూత్ నుంచి మాట్లాడుతున్నాడో ఆ బూత్ లో ఎర్ర దీపం వెలుగుతుంది. ఎర్రదీపం వెలగగానే ఆ బూత్ దగ్గిర మఫ్టీలో కాపలా కాస్తున్న కానిస్టేబుల్స్ బూత్ లో ఉన్న మనిషిని పట్టుకోవాలి. ఇదీ ఏర్పాటు, హంతకుడు ఏ హోటలులోనో, షాపులోనో ఉన్న ప్రయివేటు టెలిఫోను ఉపయోగించకుండా టెలిఫోను అధికారులు ప్రయివేటు టెలిఫోను ఉన్నవాళ్ళందరికీ కొత్త మనిషిని ఎవరినీ తమ టెలిఫోన్లు ఉపయోగించనివ్వవద్దని ముందే చెప్పారు. టెలిఫోన్ బూత్ లలో ఎర్రదీపాలు ఏర్పాటు చెయ్యడం హంతకుడు తెలుసుకుని యుగంధర్ కి ఫోన్ చెయ్యడం మానవచ్చు. అందుకని ఎర్రదీపాల ఏర్పాటు చాలా రహస్యంగా చేశారు.

పోలీసులన్నా, యుగంధరన్నా హంతకుడికి చాలా చులకన భావం కలిగింది. అతనిలో ఆత్మవిశ్వాసం, తన శక్తిసామర్థ్యాల మీద నమ్మకం ఎక్కువయింది. అతను పట్టుపడేందుకు అవే కారణం కావచ్చునని పోలీసులు అనుకున్నారు. యుగంధర్ కి ఫోన్ చేస్తాడనీ, పట్టుబడతాడనీ ఏ.సి., స్వరాజ్యరావు చాలా ఆశగా ఉన్నారు.

యుగంధర్ కి సహనం ఎక్కువ. ఎంతటి ఉపద్రవం సంభవించినా, ఎటువంటి చిక్కులో ఇరుక్కున్నా ఆరాటపడకుండా ఆలోచించే మానసిక శిక్షణ అలవాటు చేసుకున్నాడు. అటువంటి యుగంధరే ఆరాటంతో క్షణక్షణానికీ టెలిఫోను వంక చూస్తున్నాడు. గణగణా గంట

మోగింది. రిసీవర్ అందుకునేందుకు యుగంధర్ చెయ్యి జాపాడు. తనలో తను నవ్వుకున్నాడు. అది టెలిఫోను బెల్ కాదు తలుపుకున్న కాలింగ్ బెల్. చకచక వెళ్ళి తలుపు తీశాడు.

"యుగంధర్ గారున్నారా?"

"యస్!"

"మీతో అయిదు నిమిషాలు మాట్లాడాలి."

"ఇప్పుడు కాదు. రేపు రండి."

"ప్లీజ్! చాలా అవసరంగా మాట్లాడాలి. ఎర్రని గుర్తు ఉత్తరం గురించి మాట్లాడాలి."

ఆ మాట వినగానే యుగంధర్ కి మతి పోయినట్లయింది.

"సరే! రండి!" అన్నాడు వెనక్కి తిరుగుతూ.

ఆ వచ్చిన మనిషి గదిలో అడుగుపెట్టి వెంటనే తలుపు మూసేశాడు. తలుపు మూసుకుంటున్న చప్పుడు విని వెనక్కి తిరిగాడు యుగంధర్.

"ప్లీజ్! తొందరపడి ఏమీ చెయ్యకండి. చేతులు పైకెత్తి ఉంచండి" అన్నాడు ఆ మనిషి. అతని చేతిలో పిస్తోలున్నది. సూటిగా యుగంధర్ ఛాతీకి గురి పెట్టాడు.

"ప్లీజ్! మిమ్మల్ని కాల్చడం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు" అన్నాడు అతను చాలా మర్యాదగా.

యుగంధర్ రెండు చేతులూ పైకి ఎత్తాడు. ఎర్రని గుర్తు ఉత్తరాలు పంపిన మనిషి ఇతనే అయితే అన్నింటికీ తెగించిన మనిషన్నమాట. బయట మెట్ల మీద చీకటిగా ఉండటం వల్ల అతన్ని సరిగా చూడలేకపోయాడు. ఇప్పుడు పరీక్షగా చూశాడు.

పొడుగ్గా, సన్నగా ఉన్నా బలహీనుడు కాదు. మొహానికి నల్లని బట్ట ముసుగుగా కట్టుకున్నాడు. కళ్ళ దగ్గిర మాత్రం రెండు చిల్లులున్నాయి. చేతులకి నల్లని గ్లవుస్ తొడుక్కున్నాడు. తెల్ల షార్కు స్కిన్ పాంటు, అదే కోటు, తళతళ మెరుస్తున్న బూట్లు.

"చేతులు ఎత్తానుగా! త్వరగా!" అడిగాడు యుగంధర్.

"చేతులు ఎత్తిపెట్టి ఉంచి వెనక్కి తిరిగి మీ గదిలోకి వెళ్ళండి" అన్నాడతను.

అతను తనని చంపడానికి రాలేదు. చంపదలుచుకుంటే మెట్ల దగ్గర ఉన్నప్పుడే పిస్తోలు పేల్చి పారిపోయేవాడు. ఎర్రనిగుర్తు ఉత్తరం తనకీ వచ్చింది. అంటే తనకీ అపాయం ఉందని హెచ్చరించాడు. తను కాస్త జాగ్రత్త పడవలసింది. ఎవరో తెలుసుకోకుండా తలుపు తెరిచి ఉండకూడదు. మనస్సంతా టెలిఫోన్ కాల్ మీద ఉండటం వల్లా, హంతకుడు ఏదో టెలిఫోన్ బూత్ దగ్గిర ఉంటాడనుకోవడం వల్లా తలుపు తెరిచాడు.

"దయచేసి అలా కూర్చోండి. గోడ వేపు మొహం పెట్టి, చేతులు పైకి ఎత్తి ఉంచండి."

అతను చెప్పినట్లు చేశాడు యుగంధర్.

"యుగంధర్ గారూ! మిమ్మల్ని హత్య చెయ్యడానికి నేను ఇక్కడికి రాలేదు. మీతో మాట్లాడడానికి వచ్చాను. కాని మీరు దురుసుగా ప్రవర్తించారా నిస్సంకోచంగా కాల్చివేస్తాను."

"తెలుసు" అన్నాడు యుగంధర్.

"మీతో టెలిఫోన్లో మాట్లాడనుకున్నాను. కాని మీరూ, పోలీసులు కలిసి నన్ను పట్టుకోడానికి చాలా పెద్ద పన్నాగం పన్నారు. అందువల్ల నేనే స్వయంగా రావలసి వచ్చింది."

"ఊ" అన్నాడు యుగంధర్.

"నాకు మీ మీద ఎటువంటి ద్వేషమూ లేదు. చాలా గౌరవం ఉంది. దోషులను శిక్షించడంలో, నిర్దోషులను రక్షించడంలో మీకు మీరే సాటి అని తెలుసు. రెండేళ్ళ క్రితం మీరు ప్రభుత్వం పని మీద విదేశాలకు వెళ్ళి ఆరు నెలల పాటు అక్కడ ఉండిపోవడం నా దురదృష్టం" అన్నాడతను. యుగంధర్ మౌనంగా ఉండిపోయాడు.

"ఇంకో గంటో రెండు గంటలో మనల్ని ఎవరూ డిస్టర్బ్ చేయరనుకుంటాను. సావధానంగా మాట్లాడుకోవచ్చుగా!" యుగంధర్ తల ఊపాడు.

"యుగంధర్ గారూ! ఎంతమంది పోలీసులు కాపలా ఉన్నా, ఎన్ని రక్షణ ఏర్పాట్లు చేసుకున్నా ఓ మనిషిని చంపదలచుకుంటే ఆపడం చాలా కష్టం. ఓ వారం రోజులో, నెల రోజులో మహా అయితే ఒక సంవత్సరమో జాగ్రత్తపడతారు. ఆ తర్వాత? మీరేమంటారు?" అడిగాడు అతను చనువుగా.

చదువుకున్నవాడని ఉచ్చారణ బట్టి తెలుస్తోంది.

"హత్య చేయబోయే మనిషిని ముందే పట్టుకుంటే తప్ప లేకపోతే ఆ ప్రమాదం ఉన్నది" అన్నాడు యుగంధర్.

"ఇప్పటికి ఇద్దర్ని చంపాను – రిటయిర్డు సూపరింటెండు మాధవన్ నీ, ప్రాసిక్యూటర్ గోవిందస్వామినీ. ఇంకా చాలామందిని హత్య చేయదలచుకున్నాను."

"ఎందుకు?"

"రాధ, పద్మప్రియ నా ఆధీనంలో ఉన్నారు. ఆ ఇద్దరినీ నేను చంపదలచుకుంటే ఏ క్షణాన్నయినా చంపవచ్చుగా!"

"అవును."

"మిగతావాళ్ళకి మీరూ, పోలీసులు కలిసి కట్టుదిట్టమయిన ఏర్పాట్లు చేస్తే అవకాశం దొరికేదాకా ఓపిగ్గా కాచుకుంటాను."

"ఆలోగా మిమ్మల్ని పట్టుకోవచ్చుగా?"

"నన్ను పట్టుకోలేరు. నేనెవరో మీకు తెలియదు. తెలిసినా పట్టుకోలేరు."

"నేరాలు చేసేవాళ్ళంతా అలాగే అనుకుంటారు!"

అతను చిన్నగా నవ్వి "కావచ్చు. కాని నా విషయం వేరు. అతిశయంతో అంటున్న మాట కాదు. ఆ సంగతి ఇప్పుడెందుకు గాని ముందు నే వచ్చిన పనేమిటో చెబుతాను వినండి. త్వరగా చెప్పడం మంచిది. సూపరింటెండు మాధవన్ మీద కాని, ప్రాసిక్యూటర్ గోవిందస్వామి మీద కాని వ్యక్తిగతంగా నాకు ద్వేషం లేదు. వాళ్ళ ఉద్యోగధర్మం వాళ్ళు నిర్వహించారు. అంతే!" అన్నాడు.

"ఏమిటది?"

"చెపుతాను. నిజానికి ఎవర్ని కాని హత్య చెయ్యడం నాకు ఇష్టం లేదు. చాలామందికి ఎర్రనిగుర్తు ఉత్తరాలు పంపాను. పోలీసు అధికారులని భయపెట్టడమే నా ఉద్దేశ్యం!"

"ఎందుకు?"

"ఉత్తరాలు పంపి ఎవర్నీ హత్య చెయ్యకపోతే పోలీసులు నా ఉత్తరాలను లెఖ్ఖ చెయ్యరు. చాలామందికి ఉత్తరాలు పంపాను. వాళ్ళల్లో యిద్దర్ని హత్య చేశాను. మిగతావాళ్ళని హత్య చేస్తానని పోలీసులు హడలి చస్తున్నారు."

"పోలీసులని హడలకొట్టడం వల్ల మీకేమిటి ప్రయోజనం?"

"జీవితాంతం జైలు శిక్ష అనుభవిస్తున్న ఒక మనిషిని జైలులోంచి విడిపించాలి."

"ఎవరతను? శివరామా?"

"శివరామా! అతనెవరో నాకు తెలియదు."

"అతను ఈ మధ్యనే జైలులోంచి తప్పించుకున్నాడు. మీరు విడిపించాలనుకున్నది ఎవరిని?"

"నా కుమారుణ్ణి" అన్నాడతను. ఆ మాట అంటున్నప్పుడు అతని కంఠస్వరం కొద్దిగా వణికింది.

"మీ కుమారుడి పేరు? ఏం నేరం చేశాడు?" అడిగాడు యుగంధర్.

"ఏ నేరమూ చెయ్యలేదు. చేసిన నేరమల్లా నిజం చెప్పడం."

"నేరం చెయ్యకపోతే శిక్ష ఎందుకు వేస్తారు?"

అతను నిట్టూర్చి "మన దేశంలో పోలీసులు, వాళ్ళ దర్యాప్తులు, కోర్టులో విచారణ, జడ్జీల తీర్పు చాలా న్యాయంగా, నిష్పక్షపాతంగా ఉంటాయని నేను ఒప్పుకుంటాను. కాని ఒక్కొక్కప్పుడు ఎవరో అబద్ధాలు చెప్పడం వల్లో లేక సాక్ష్యం అపార్థం చేసుకోవడం వల్లో నిర్దోషులని శిక్షించడం జరగవచ్చుగా" అన్నాడు.

"ఎప్పుడన్నా జరగవచ్చు గాని సామాన్యంగా జరగదు."

"అవును. సామాన్యంగా జరగదని నేనూ ఒప్పుకుంటాను. కాని నా కుమారుడి విషయంలో జరిగింది."

"అటువంటప్పుడు నేను విదేశాల నుంచి తిరిగి రాగానే నన్ను ఎందుకు కలుసుకోలేదు?"

"మిమ్మల్ని కలుసుకున్నా మీరు అప్పుడేం చెయ్యగలరు? అప్పీలు చేశాము. అప్పీలు కొట్టివేసి శిక్ష ఖాయపరిచారు. నా కొడుకు నిర్దోషి అని మీరు ఎలా రుజువు చేయగలరు?"

"నిర్దోషి అని నిశ్చయంగా తెలిపే సాక్ష్యాలు సంపాదిస్తే ఆ రుజువులు చూపిస్తూ గవర్నర్ కి దరఖాస్తు పెట్టుకోవచ్చు!"

"నిజమే కాని అప్పటికి కోర్టులలో, అధికారులలో నాకు నమ్మకం పోయింది."

"నమ్మకం పోయి ఏం చేశారు?"

"యావజ్జీవిత శిక్ష అనుభవిస్తున్న మనిషిని జైలునించి విడిపించడం అసాధ్యమని నాకు తెలుసు. కాని నా కొడుక్కి జరిగిన అన్యాయం సహించలేకపోయాను. వాడొక్కడే నాకు. వాణ్ణి జైలు నుంచి విడిపించాలని నిశ్చయించుకున్నాను. ఆ ప్రయత్నంలో నా ప్రాణాలు కోల్పోవడానికి సిద్ధపడ్డాను. నేను ప్రాణాలకు తెగించానని ఇప్పుడైనా తెలుసుకోండి."

"ఆ విషయం నాకు మొదటినించీ తెలుసు."

"కనీసం ఇద్దర్నయినా హత్య చేస్తే గాని అధికారులు నా విషయం సీరియస్ గా ఆలోచించరు. పోలీసు ఉద్యోగులనీ, పెద్ద ఆఫీసర్లనీ బెదిరిస్తే తప్ప ఖంగారు పడరు. అందుకే రిటయిర్డు జడ్జి భుజంగరావుకి ఎర్రనిగుర్తు ఉత్తరం పంపాను. ఆయన మనుమరాలిని ఎత్తుకుపోయాను. అందుకే మాధవన్ నీ, గోవిందస్వామినీ హత్య చేశాను."

"పోలీసులని హడలగొట్టారని ఒప్పుకుంటాను. అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏముంది? మీ కుమారుణ్ణి ఎలా విడిపిస్తారు?"

అతను నవ్వి "ఇప్పుడు బేరానికి సమయం వచ్చింది. రాజీకి వస్తారా?" అడిగాడు.

"ఏమిటా బేరం? ఏమిటా రాజీ?"

"అధికారులు నా కొడుకుని వదిలేసి విదేశాలకు వెళ్ళిపోవడానికి పాస్పోర్టు ఇవ్వాలి. డబ్బు విషయం నేను చూసుకుంటాను. అందుకు ఒప్పుకుంటే నేను ఈ హింసాకాండ మానేస్తాను."

యుగంధర్ నవ్వి "మీరు రెండు హత్యలు చేశారు. మీకు మరణశిక్ష పడాలి. హత్యానేరానికి మీ కుమారుడు యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నాడు. ప్రభుత్వం మీతో రాజీకి వస్తుందని మీరెట్లా అనుకున్నారో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు.

"అందుకే మిమ్మల్ని ఇప్పుడు కలుసుకున్నాను. పెద్ద ఆఫీసర్లతో, మంత్రులతో మీకు బాగా స్నేహం అనీ, పలుకుబడి ఉన్నదనీ నాకు తెలుసు. వాళ్ళకు మీరు నచ్చచెప్పాలి. రాధా, పద్మప్రియా కాక ఇంకా కొంతమంది కూడా ఆపదలో ఉన్నారు. వాళ్ళను రక్షించేందుకు ఇదొక్కటే మార్గమని, ఒప్పుకోమని ఒత్తిడి చెయ్యండి."

"ఇటువంటి బేరానికి ప్రభుత్వం అంగీకరించదు."

"ప్లీజ్! బాగా ఆలోచించండి. రాధనీ, పద్మనీ నేను హత్య చెయ్యదలచుకుంటే ఎవరూ ఆపలేరు. ఇంకా కొంతమందిని హత్య చెయ్యగలను. నాకు ఎవరూ అడ్డు రాలేరు. అన్ని ప్రాణాలు వృధాగా ఎందుకు బలిస్తారు! మీకు రేపు సాయంకాలం వరకూ వ్యవధి ఇస్తున్నాను. నా షరతులకు ప్రభుత్వాన్ని మీరు ఒప్పించలేకపోతే రేపు రాత్రి ఇంకో హత్య జరుగుతుంది. వస్తాను" అని అతను వెళ్ళిపోవడానికి తయారైనాడు.

"మీ కుమారుడి పేరు చెప్పారు కాదు" అన్నాడు యుగంధర్.

"చెప్పను. నా షరతులకి ప్రభుత్వం ఒప్పుకుంటే అప్పుడు చెపుతాను."

అతని అడుగుల చప్పుడు దగ్గరగా వినిపించి యుగంధర్ వెనక్కి తిరగడానికి తల తిప్పాడు. వెంటనే కణత మీద గట్టిగా దెబ్బ తగిలింది. స్పృహ పోయింది.

## 16

"రండి యుగంధర్! మీకోసమే కాచుకున్నాము" అన్నాడు గవర్నర్.

విశాలమైన హాలు, ఎత్తుగా ఉన్న కప్పు, గొలుసులకి వేళ్ళాడుతున్న ఎలక్ట్రిక్ దీపాలు, ఎన్నో ఫాన్లు, మెత్తని తివాసీ, గది మధ్య తళ తళ మెరుస్తున్న పెద్ద రోజ్ ఉడ్ బల్ల. బల్లకి ఒక వైపున ముఖ్యమంత్రి, హోమ్ మంత్రి కూర్చున్నారు. వాళ్ళ పక్కన ఇన్స్పెక్టరు జనరల్ ఆఫ్ పోలీసు, కమీషనర్ ఆఫ్ పోలీసు కూర్చున్నారు.

"మీతో చర్చించనిదే ఏ నిర్ణయమూ చెయ్యకూడదని నేను సలహా ఇచ్చాను" అన్నాడు ముఖ్యమంత్రి.

యుగంధర్ వెళ్ళి కమీషనర్ పక్కన కూర్చున్నాడు. యుగంధర్ పక్కన రాజు కూర్చున్నాడు.

"మీ అభిప్రాయం ఏమిటి యుగంధర్?" అడిగాడు గవర్నర్.

"హంతకుణ్ణి పట్టుకోవడం సులభం కాదు. కొంత వ్యవధి కావాలి. ఆలోగా అతను ఇంకా కొందరిని హత్య చేస్తాడు."

"అందరికీ కట్టుదిట్టమయిన రక్షణ ఏర్పాట్లు చేస్తే యెలా హత్య చేస్తాడు?" అడిగాడు ముఖ్యమంత్రి.

"పద్మప్రియ అనే యువతి, రాధ అనే నాలుగేళ్ళ పిల్ల హంతకుడి ఆధీనంలో ఉన్నారు. వాళ్ళిద్దర్నీ ఏ క్షణాన అయినా చంపవచ్చు అతను. మనం ఎలా ఆపగలం?" అన్నాడు యుగంధర్. అందరి మొహాలు వాడిపోయాయి. ఎవరూ మాట్లాడలేదు.

"ఇక మిగతావాళ్ళ రక్షణ గురించి ఆలోచిద్దాం. ఎర్రని గుర్తు ఉత్తరాలు వచ్చినవాళ్లకి మనం రక్షణ ఏర్పాటు చెయ్యవచ్చు. కాని హంతకుడికి వాళ్ళనే హత్య చెయ్యాలన్న పట్టుదల ఏమీ లేదు. మనల్ని బెదిరించి తన షరతులకి ఒప్పించడానికే హత్యలు చేస్తున్నాడు కనుక ఇంకెవరినైనా హత్య చెయ్యవచ్చు."

గవర్నరూ, ముఖ్యమంత్రి ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"వీడెవడో తెలుసుకునే అవకాశం లేదా?" అడిగాడు హోమ్ మంత్రి ఐ.జి.ని.

ఐ.జి. కమీషనర్ వేపు ప్రశ్నార్థకంగా చూశాడు. కమీషనర్ యుగంధర్ని చూశాడు.

"తెలుసుకోవచ్చుననుకుంటాను" అన్నాడు యుగంధర్ నెమ్మదిగా.

"ఎలా! అయితే తాత్సారం దేనికి?" అడిగాడు ముఖ్యమంత్రి.

"తెలుసుకున్నా ప్రయోజనం ఉండదనుకుంటాను. పేరు, రూపమూ మార్చుకుని తిరుగుతూ ఉంటాడు."

"ఆ విషయం తరవాత ఆలోచిద్దాము. అతనెవరో ముందు తెలుసుకుంటే__" అన్నాడు ఐ.జి.

అందరూ యుగంధర్ని రెప్ప వాల్చకుండా చూస్తున్నారు.

"హత్యానేరానికి తన కుమారుడికి యావజ్జీవ శిక్ష పడిందనీ, నేను విదేశాలకు వెళ్ళినప్పుడు ఆ కేసు విచారణ జరిగిందనీ చెప్పాడు. అంటే రెండేళ్ళ క్రిందట ఆ కేసు విచారణకి వచ్చి ఉండాలి."

అందరూ తలలు ఊపారు.

"భుజంగరావునీ, ఇంకా కొందర్నీ బెదిరించాడు. కానీ మాధవన్నీ, గోవిందస్వామినీ మాత్రమే హత్య చేశాడు. ఆ కేసు మాధవన్ దర్యాప్తు చేసినట్లు, గోవిందస్వామి ఆ కేసులో ప్రాసిక్యూటర్ గా పని చేసినట్లు అతని మాటలని బట్టి ఊహించాను. అందుకే వాళ్ళిద్దర్నీ హత్య చేసి ఉంటాడు."

"అయితే ఆ కేసుతో ఎలాంటి సంబంధం లేని పద్మప్రియనీ, రాధనీ చంపుతాడని మీరెందుకు భయపడాలి?" అడిగాడు కమీషనర్.

అందరూ తలలు ఊపారు.

"మనం తన షరతులకి ఒప్పుకునేట్లు చెయ్యడానికి వ్యక్తిగతంగా కారణం ఏమీ లేకపోయినా హత్యలు చేస్తాడు ఇక."

"మాధవన్ రికార్డు ఫైల్ తీసి చూస్తే హంతకుడు ఎవరైనదీ తెలుస్తుందన్నమాట" అన్నాడు గవర్నర్.

యుగంధర్ తల ఊపి "మాధవన్ దర్యాప్తు చేసినదీ, గోవిందస్వామి ప్రాసిక్యూట్ చేసినదీ ఏ కేసో చూడాలి" అన్నాడు.

"మీరు ఆ విషయం వెంటనే ఆరా తియ్యండి" అన్నాడు ముఖ్యమంత్రి ఐ.జి.తో.

"హంతకుడు ఎవరో తెలిసినా అతన్ని పట్టుకోవడం సులభం కాదంటున్నారు యుగంధర్" అన్నాడు గవర్నర్.

ముఖ్యమంత్రి తల ఊపి "హంతకుడి షరతులు ఒప్పుకుని అతని కుమారుణ్ణి ఒదిలిపెట్టడమా, పెట్టకపోవడమా అనే విషయం మనం ఇప్పుడు తేల్చుకోవాలి" అన్నాడు గవర్నర్ వేపు చూస్తూ.

ఎవరూ జవాబు చెప్పడానికి సిద్ధపడలేదు. హంతకుడి షరతులకి ఒప్పుకోకపోతే కనీసం ఇంకో రెండు అమాయక ప్రాణాలని బలివ్వవలసి వస్తుందని వాళ్ళకి తెలుసు. అయినా అతని షరతులు ఒప్పుకోవడం మంచిదని చెప్పడానికి ఎవరూ సాహసించలేకపోయారు.

"ఒక హంతకుడి బెదిరింపుకి లొంగిపోయి ఇంకో హంతకుణ్ణి జైలులోంచి వదిలిపెడితే రాష్ట్రంలో ప్రభుత్వమూ, పోలీసు సిబ్బందీ నవ్వుల పాలవుతాయి. ప్రజలకి చట్టాల మీద గౌరవం పోతుంది" అన్నాడు ముఖ్యమంత్రి.

"అవును, దొంగలు, హంతకులు విర్రవీగిపోతారు. వాళ్ళే రాజ్యం ఏలుతారు" అన్నాడు హోమ్ మంత్రి.

"అయితే అంగీకరించమని హంతకుడికి చెపుతాను" అన్నాడు యుగంధర్.

అందరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు మళ్ళీ.

ఆ నిర్ణయం చేసే బాధ్యత ఎవరూ తీసుకోదలుచుకోలేదు.

"యుగంధర్! మీ అభిప్రాయం చెప్పండి" అడిగాడు గవర్నర్.

"క్షమించాలి. నేనేం చెప్పలేను" అన్నాడు యుగంధర్.

రాజు యుగంధర్ని ఆశ్చర్యంతో చూశాడు. యుగంధర్ సామాన్యంగా తన అభిప్రాయమేమిటో చెప్పడానికి జంకడు. బాధ్యత తీసుకునేందుకు భయపడే మనిషి కాడు.

ఐ.జి. గొంతు సవరించుకుని "హంతకుడి షరతులకి మనం లొంగిపోకూడదు. అతన్ని పట్టుకునేలోగా మరి కొందర్ని హత్య చెయ్యవచ్చు. అందుకు మనం సిద్ధపడాలి" అన్నాడు.

"అందరి అభిప్రాయం అదేనా?" అడిగాడు గవర్నర్.

"నేను ఐ.జి. అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను" అన్నాడు హోమ్ మంత్రి.

"అది మీ డిపార్టుమెంటు కనుక మీ అభిప్రాయానికి విలువ ఇవ్వాలి" అన్నాడు ముఖ్యమంత్రి.

"అయితే ఈ సమావేశం ముగించవచ్చు. మీరంతా హంతకుణ్ణి పట్టుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించండి. ఇంకో హత్య జరక్కుండా చూడండి" అన్నాడు గవర్నర్. అంతటితో ఆ సమావేశం ముగిసింది.

---

"**ఆ! ఇదుగో! ఈ కేసే అయ్యుండాలి**" అన్నాడు కమీషనర్.

"వివరాలన్నీ సరిగా సరిపోతున్నాయా?" అడిగాడు యుగంధర్.

"కమీషనర్ తల ఊపి "కేసును గురించి క్లుప్తంగా వ్రాసి ఉంది. చదవండి" అని ఫైలు యుగంధర్ కి ఇచ్చాడు.

యుగంధర్ పైకి చదవడం ప్రారంభించాడు. రాజు, ఏ. సి. స్వరాజ్యరావు చెవులప్పగించి వింటున్నారు.

"మే పదహారో తేదీన శేషాద్రి అనే యువకుడు దారుణంగా హత్య చెయ్యబడ్డాడు. అతను ఓ కంపెనీలో టైపిస్టుగా పని చేసేవాడు. వయస్సు ఇరవై అయిదు సంవత్సరాలు. సైదాపేటలో ఓ మేడ మీది గది అద్దెకు తీసుకుని ఉండేవాడు. 17 తేదీ ఉదయం ఇల్లు ఊడ్చే మనిషి వెళ్ళి తలుపు తొయ్యగానే తెరుచుకుంది. పక్కమీద రక్తపు మడుగులో పడి ఉన్నాడు శేషాద్రి. రాత్రి పది గంటల తర్వాత పన్నెండు గంటలకు ముందూ అతన్ని కత్తితో పొడిచి చంపినట్లు డాక్టరు అభిప్రాయం వెల్లిబుచ్చాడు. రాత్రి ఎనిమిది గంటలకి మీనాక్షి అనే యువతి అతని గదికి వెళ్ళినట్లు తెలిసింది. ఆమె కాలేజీ విద్యార్థిని. గవర్నమెంటు ఉద్యోగి కుమార్తె. చాలా అందమైనది. రాత్రి తొమ్మిది గంటల వరకూ ఆమె శేషాద్రితో అతని గదిలో ఉన్నట్లూ తర్వాత యింటికి వెళ్ళినట్లూ ఆమె చెప్పింది. తొమ్మిదీ ముప్పయికి ఇంటికి వచ్చినట్లు ఆమె తండ్రీ, తల్లీ, అన్నా, చెల్లెలు సాక్ష్యం ఇచ్చారు. మీనాక్షికి మరొక యువకునితో కూడా స్నేహం ఉంది. అతని పేరు శిరీష్ కుమార్. అతనికి ఇరవై ఆరేళ్ళు.

మెడిసన్ చదువుతున్నాడు. అతని తండ్రి వీరభద్రరావు లాయర్. ఆయనకి శిరీష్ ఒక్కడే కొడుకు. శేషాద్రి, శిరీష్ ఇద్దరూ మీనాక్షిని ప్రేమించారు. శేషాద్రి శ్రీమంతుడు కాదు. అందంగా ఉంటాడు. సంపాదన తక్కువ. శిరీష్ డాక్టరు కాబోతున్నాడు. తండ్రి సంపన్నుడు. కురూపి కాదు కాని, అందగాడు కాదు. ఈ ఇద్దరిలో ఎవర్ని తన భర్తగా ఎన్నుకోవడమా అనే సందిగ్ధంలో ఉంది మీనాక్షి. ఆమెకి శేషాద్రి మీద ఎక్కువ ఇష్టం. మే 16 తేదీ సాయంకాలం తను శేషాద్రిని వివాహం చేసుకోదలచానని శిరీష్ కి చెప్పింది. శిరీష్ మీనాక్షితో పోట్లాడాడు. శేషాద్రినీ, ఆమెనూ సుఖంగా బ్రతకనివ్వనని బెదిరించాడు. వాళ్ళిద్దరి సంభాషణా విన్న ఓ హోటలు సర్వరు సాక్ష్యం ఇచ్చాడు. శేషాద్రి గదిలో తలుపు గొళ్ళెం మీదా, అద్దం మీదా, రోజ్ వుడ్ బల్ల మీదా, శిరీష్ వేలిముద్రలు కనిపించాయి. శిరీష్ వేసుకున్న తెల్ల కాన్వాస్ షూస్ మీద రక్తం మరకలున్నాయి. ఎనలయిజ్ చెయ్యగా శేషాద్రి రక్తం గ్రూపుకు చెందిన రక్తం అని తెలిసింది. హత్య చెయ్యడానికి ఉపయోగించిన కత్తి దొరకలేదు. రాత్రి పన్నెండు గంటలప్పుడు శేషాద్రి గదిలోంచి శిరీష్ బయిటికి రావడం పక్క ఇంట్లో ఉన్న ఆసామి చూసాడు. పన్నెండు గంటల ప్రాంతాల తన బండి ఎక్కి శిరీష్ ఇంటికి వెళ్ళినట్లు సైకిల్ రిక్షా అతను సాక్ష్యం ఇచ్చాడు. మొదట్లో తను శేషాద్రి ఇంటికి 16 తేదీ వెళ్ళలేదన్నాడు కాని తరువాత మీనాక్షిని వివాహం చేసుకోవద్దనీ, అతనికి వచ్చే కొద్ది జీతంతో మీనాక్షిని సుఖపెట్టలేడనీ చెప్పడానికి వెళ్ళాడని ఒప్పుకున్నాడు శిరీష్. తను వెళ్ళేటప్పటికే శేషాద్రి హత్య చెయ్యబడ్డాడనీ, నేరం తనమీదకి వస్తుందని భయపడి వెళ్ళలేదని మొదట్లో చెప్పాననీ అన్నాడు. సూచనాపూర్వకమైన సాక్ష్యం బలంగా ఉండడం వల్ల శిరీష్ ని అరెస్ట్ చేశారు పోలీసులు. సెషన్సు కోర్టులో విచారణ జరిగింది. శిరీష్ కి యావజ్జీవ జైలు శిక్ష విధించాడు జడ్జి. అప్పీలులో శిక్ష ఖాయం అయింది. ఇన్స్పెక్టర్ నటరాజన్ సహాయంతో సూపరింటెండెంట్ మాధవన్ ఆ కేసు దర్యాప్తు చేశాడు. ప్రభుత్వం తరపున గోవిందస్వామి ప్రాసిక్యూషన్ నిర్వహించాడు" అంతటితో చదవడం ఆపి "శిరీష్ మీద అన్యాయంగా నేరం మోపలేదు కాని...." అన్నాడు యుగంధర్.

"కాని?" అడిగాడు కమీషనర్.

"చాలా బలమైన సాక్ష్యం ఉన్నమాట నిజమే కాని శిరీష్ హత్య చేశాడని నిర్ధారణగా చెప్పడానికి వీలులేదు."

"ఎందుకని?"

"హత్యకు ఉపయోగించిన కత్తి దొరకలేదు. అంతా సూచనాపూర్వకమైన సాక్ష్యమే కాని ప్రత్యక్ష సాక్ష్యం ఏమీ లేదు. శిరీష్ తండ్రి చెప్పినట్లు అన్యాయం జరిగి ఉండవచ్చు."

"యుగంధర్! అప్పీలులో కూడా శిక్ష ఖాయం చేశారుగా!" అన్నాడు ఏ.సి.

"నిజమే. శిరీష్ నిర్దోషి అని నిశ్చయంగా అనడం లేదు నేను. నిర్దోషి అయివుండడానికి అవకాశం ఉంది. అతని తండ్రి వీరభద్రరావు లాయర్. తన కొడుకు మీద ప్రేమ కొద్దీ శిరీష్ నిర్దోషి అని ఉండడు. అతను హత్య చేసి ఉండవచ్చుననే అనుమానం యే మాత్రం వున్నా, పోలీసుల మీదా, ప్రభుత్వం మీదా ఇంత కచ్చ, ద్వేషం పెట్టుకోడు" అన్నాడు యుగంధర్.

"శిరీష్ దోషా, నిర్దోషా అనే సమస్య మనకనవసరం. మన సమస్య అది కాదుగా!" అన్నాడు కమీషనర్.

"అనవసరం ఎందుకయింది? శిరీష్ నిజంగా నిర్దోషి అయితే, అన్యాయంగా అతనికి శిక్ష పడి వుంటే ఆ అన్యాయం సరిదిద్దవలసిన బాధ్యత మనమీద ఉన్నది. వీరభద్రరావుని ఈ హత్యాకాండ మానమనీ, పోలీసులకి లొంగిపొమ్మనీ, నేను దర్యాప్తు చేసి శిరీష్ నిర్దోషి అని తేల్చుకుంటే అతన్ని ప్రభుత్వం విడిచిపెట్టేందుకు ప్రయత్నిస్తాననీ చెపుతాను" అన్నాడు యుగంధర్.

రాజు చిన్నగా దగ్గాడు.

"ఏమిటి?" అడిగాడు యుగంధర్ రాజుని.

"శిరీష్ నేరం చేశాడా లేదా అనే విషయం అతని తండ్రి వీరభద్రరావు పోలీసులకి లొంగిపోవడంతో ఎందుకు ముడిపెట్టాలి? శిరీష్ నిర్దోషి అని తేలితే అతన్ని వదిలిపెట్టాలి. అతని తండ్రి చేసిన హత్యలకీ, జైలులో ఉన్న శిరీష్ కీ ఏమిటి సంబంధం?" అడిగాడు రాజు.

"అవును. నువ్వు చెప్పింది సబబుగానే ఉంది. కానీ వీరభద్రరావుని పట్టుకోవడంలో మనం నిమగ్నులమైతే శిరీష్ నిర్దోషిత్వం ఋజువు చేసేందుకు మనకి వ్యవధి ఉండదు. వీరభద్రరావు పోలీసులకి లొంగిపోతే తర్వాత మనం శిరీష్ దోషి అయినదీ కానిదీ ఋజువు చెయ్యడానికి వ్యవధి ఉంటుంది" అన్నాడు యుగంధర్.

"యుగంధర్! శిరీష్ నిర్దోషి అయితే, ఆ విషయం ఇప్పుడైనా సరే ఋజువు చేసి అతన్ని విడిపించడానికి మీరు ప్రయత్నం చేసే పక్షంలో మాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. ఆ విషయం వీరభద్రరావుకి చెప్పండి" అన్నాడు యుగంధర్.

"అంటే వీరభద్రరావు చెప్పిన షరతులు కొద్దిగా మార్చి ఒప్పుకుంటున్నామన్నమాట" అన్నాడు ఏ.సి.

"ఎలా?" అడిగాడు యుగంధర్.

"తన కొడుకుని వెంటనే వదిలిపెడితే ఈ హత్యాకాండ మానేస్తానన్నాడు వీరభద్రరావు. అతను పోలీసులకి లొంగిపోతే శిరీష్ ని వదిలిపెడతామంటున్నాము మనం. అంతేగా!"

"కాదు. శిరీష్ ని బేషరతుగా వదిలిపెడతామని మనం చెప్పము. అతను నిర్దోషి అని నిర్ధారణ అయితేనే విడుదల చేయించడానికి ప్రయత్నిస్తామని చెపుతాము."

"యస్. యస్. ఇక చర్చ అనవసరం. వీరభద్రరావుకి చెప్పి చూడండి ఏమంటాడో!" అన్నాడు ఏ.సి.

"చెపుతాను కాని అతను ఒప్పుకుంటాడన్న నమ్మకం లేదు నాకు. అతని గురించి తెలుసుకోగలిగినదంతా తెలుసుకోండి. దర్యాప్తు నిర్లక్ష్యం చెయ్యవద్దు" చెప్పాడు యుగంధర్.

## 18

డిటెక్టివ్ యుగంధర్ తన గదిలో రివాల్వింగు కుర్చీలో కూర్చున్నాడు. క్షణక్షణం గడియారం వంక చూస్తున్నాడు.

ఆ రోజు రాత్రి అయేలోగా ఏదో ఒకటి తేల్చి చెప్పమన్నాడు హంతకుడు. ఎలా చెప్పడం! అతను ఫోన్ చేస్తాడా! టెలిఫోను చేసేటట్లయితే పట్టుకునేందుకు కట్టుదిట్టాలు చేశారు పోలీసులు. క్రితం రోజు వాళ్ళు చేసిన ఏర్పాట్లన్నీ అలాగే ఉన్నాయి. యుగంధర్ ఇంటి ప్రాంతాల మూలమూలల చీకట్లో దాక్కున్నారు మఫ్టీలో ఉన్న పోలీసులు. యుగంధర్ ఇంటికి ఎవరు వచ్చినా, ఇంట్లోంచి ఎవరు బయటికి వెళ్ళినా పట్టుకుని హెడ్ క్వార్టర్సుకు తీసుకురమ్మని ఆర్డరు. కమీషనర్ ఆ విషయం యుగంధర్ కి ముందే చెప్పాడు. అటువంటి కట్టుదిట్టాలు చేస్తే తను హంతకుడితో మాట్లాడే అవకాశం లభించదనీ, పద్మప్రియ, రాధ ప్రాణాలు బలి ఇవ్వడం అవుతుందనీ యుగంధర్ కమీషనర్ కి చెప్పలేదు. వాళ్ళ ఉద్యోగ ధర్మం వాళ్ళు చేస్తుంటే తను అభ్యంతరం చెప్పడం మంచిది కాదు. ఇలాటి ఏర్పాట్లు చెయ్యడం వల్ల తన షరతులను నిరాకరించారని హంతకుడు అనుకుని తనని కలుసుకునే ఉద్దేశం మానుకుంటాడా! యుగంధర్ ఆలోచిస్తున్నాడు.

అంతలో తలుపు తట్టిన చప్పుడయింది. ముందు గదిలో ఎక్స్టెన్షన్ టెలిఫోను దగ్గర కూర్చున్న రాజు లేచి వెళ్ళి తలుపు తీశాడు.

"ఆ. ఉన్నారు. మీ పేరు?" అడిగాడు రాజు ఆ వచ్చిన స్త్రీ అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పి.

"నా పేరు చెప్పినా ఆయనకి తెలియదు. ఆయన్ని కలుసుకోవాలి" అన్నది ఆమె.

"సారీ! ఆయన బిజీగా ఉన్నారు."

ఆమె కొన్ని పేర్లు చెప్పింది.

ఆ పేర్లు వినగానే ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లయి "ఏమిటి వాళ్ళ విషయం?" అడిగాడు రాజు.

"డిటెక్టివ్ యుగంధర్ గారితో చెపుతాను."

"రండి" అని రాజు ఆమెని లోపలకి తీసుకువెళ్ళాడు.

ఆమె రాజుతో మాట్లాడడం యుగంధర్ విన్నాడు.

ఆమె గదిలోకి రాగానే "పద్మప్రియ, రాధ విషయం ఏమిటమ్మా!" అడిగాడు.

"మీరేనా యుగంధర్?"

"అవును."

ఆమె హాండ్ బేగ్ తెరిచి ఒక కవరు తీసి ఇచ్చింది. అందులోంచి పావు తావు కాయితం తీసి యుగంధర్ చదివాడు.

యుగంధర్ గారికి,

మీరు గవర్నరుతోనూ, మంత్రులతోనూ, ఉన్నత పోలీసు ఉద్యోగులతోనూ నేను చెప్పిన విషయం చర్చించారని నాకు తెలుసు. ఏం నిర్ణయించారో తెలియదు. మీ నిర్ణయం యేమిటో రాసి ఈ యువతికి ఇవ్వండి. నాకు అందుతుంది.

ఈమెను వెంబడించమని డిటెక్టివ్ లను నియమించి నా ఉనికి తెలుసుకోడానికి ప్రయత్నించకండి. ప్రయోజనం ఉండదు.

X

యుగంధర్ ఆ ఉత్తరం ఇంకోసారి చదివి అడుగున ఉన్న ఎర్రగుర్తు పరీక్షగా చూశాడు.

"నీ పేరేమిటి?" అడిగాడు ఆ యువతిని.

"మందారం."

"ఎక్కడ ఉంటున్నావు? ఏం చేస్తున్నావు?"

"రాయపురంలో. ఏమీ చేయడం లేదు" అని వెకిలిగా నవ్వింది. ఆమె వృత్తి ఏమిటో ముఖం చూస్తేనే తెలిసింది యుగంధర్ కి.

"ఈ ఉత్తరంలో ఏమున్నదో, ఎవరు రాశారో నీకు తెలుసా?"

"తెలియదు. మీకు ఇవ్వమని చెప్పి పది రూపాయలు ఇచ్చాడు. మీరిచ్చే జవాబు తీసుకువస్తే ఇంకా ఇరవై రూపాయలు ఇస్తానన్నాడు. నన్ను అటకాయిస్తే పద్మప్రియ, రాధ గురించి మీతో మాట్లాడాలని చెప్పమన్నాడు.

"అతనెవరో నీకు తెలుసా?"

"తెలియదు."

"జవాబు కోసం ఎప్పుడు వస్తానన్నాడు?"

"చెప్పలేదు. నన్ను కలుసుకుని జవాబు తీసుకుంటానన్నాడు. ఎప్పుడో చెప్పలేదు."

"ఆ మనిషి ఎలా ఉంటాడో వర్ణించగలవా?"

"సరిగా చెప్పలేను. బాగా చూడలేదు."

"ఎందుకు చూడలేదు?"

"నేను సెంట్రల్ స్టేషన్ పక్క వీధిలో బస్టాండ్ దగ్గర నిలుచునుండగా ఎవరో ఒకతను వచ్చి పక్క వీధిలో ఒక కారు ఆగి ఉందనీ, అది ఎక్కమనీ చెప్పాడు. వెళ్లాను. కారు దగ్గిరికి వెళ్ళే లోపున ఇంకో మనిషి వచ్చి నాకీ ఉత్తరం, ఓ పది రూపాయల నోటూ ఇచ్చాడు. చీకటిగా ఉండడం వల్ల అతన్ని సరిగా చూడలేదు" అన్నదామె బెదురుతూ.

"ఇదంతా నిజమేనా?" అడిగాడు యుగంధర్. ఆమె తల ఊపింది.

"వీధిలో ఉన్న కారు ఎక్కమని చెప్పిన మనిషి ఎవరో నీకు తెలుసా?"

"తెలియదు."

"అయితే ఎందుకు వెళ్ళావు?"

ఆమె జవాబు చెప్పకుండా తల వంచుకున్నది. నిజమే చెప్పిందని యుగంధర్ అనుకున్నాడు. వీరభద్రరావు తన ఆనవాలు గాని, ఉనికి గాని అంత సులభంగా బయట పడనివ్వడు. లెటర్ పాడ్ తీసి వీరభద్రరావుకి ఉత్తరం వ్రాసి మడిచి కవరులో పెట్టి ఆమెకిచ్చాడు.

"నేను వెళ్ళవచ్చా?" అడిగిందామె ఆదుర్దాగా.

"వెళ్తుగాని ఉండు" అని రిసీవర్ తీసుకుని కమీషనర్ కి ఫోన్ చేశాడు యుగంధర్.

"మీరు నా ఇంటి చుట్టూ మఫ్టీలో కానిస్టేబుల్స్ ని కాపలా పెట్టారని నాకు తెలుసు. అందుకే చెపుతున్నాను" అని మందారం అనే ఆమె వీరభద్రరావు దగ్గిరనుంచి ఉత్తరం తీసుకుని తన ఇంటికి రావడం గురించి వివరంగా చెప్పాడు.

"ఈ అమ్మాయిని మీరు పట్టుకున్నా ఏమీ ప్రయోజనం ఉండదనుకుంటాను. డిటెక్టివ్ లు వెంబడించినా లాభం ఉండదు. నా ఉత్తరం వీరభద్రరావుకి అందడం వల్ల ఏమయినా ప్రయోజనం కలగవచ్చని మీరు అనుకుంటే ఈ అమ్మాయిని పట్టుకోకండి. నా ఉత్తరం తీసుకెళ్ళి వీరభద్రరావుకి ఇవ్వనివ్వండి" అని చెప్పి రిసీవర్ పెట్టేశాడు.

"ఇక వెళ్ళవచ్చా?" అడిగింది ఆమె.

"ఇంకో పది నిముషాలుండి వెళ్ళు" చెప్పాడు యుగంధర్.

❦❦❦

**అది పోలీసు కమీషనర్ ఆఫీసు గది.**

"వీరభద్రరావుని గురించి వివరాలు సేకరించారా?" అడిగాడు యుగంధర్.

"యెస్" అని బల్లమీది కాగితాల్లోంచి ఓ కాగితం తీసి చదివాడు కమీషనర్.

శిరీష్ కి శిక్ష పడగానే వీరభద్రరావు 'లా' ప్రాక్టీసు మానేశాడు. అప్పటికే దాదాపు రెండు లక్షల వరకూ ఆర్జించాడు. మద్రాసులో రెండు ఇళ్ళు కొన్నాడు. బాంకులో యాభై వేల వరకూ రొక్కం ఉంది. యాభై వేల ఇన్సూరెన్సు పాలసీ ఉన్నది. ఇళ్ళు రెండూ అమ్మేశాడు. ఇన్సూరెన్సు పాలసీ సరెండరు చేసి రొక్కం తీసుకున్నాడు. బాంకులో ఉన్న రొక్కం తీసుకుని అక్కౌంటు మూసేశాడు. ఓ వారం రోజులు హోటల్ శ్రీనివాస్ లో ఉన్నాడు. ఓ రోజు టాక్సీ ఎక్కి సెంట్రల్ స్టేషను దగ్గిర దిగాడు. తరవాత వీరభద్రరావు ఏమయినదీ ఎవరికీ తెలియదు. అతని స్నేహితులూ, బంధువులు మళ్ళీ ఎప్పుడూ అతన్ని చూడలేదు. గాలిలో కలిసిపోయినట్లు మాయమయినాడు.

"అయితే వేషమూ, రూపమూ, పేరూ మార్చుకుని ఈ ఊళ్ళోనే ఎక్కడో ఉండి ఉంటాడు" అన్నాడు యుగంధర్.

"ఎక్కడున్నదీ తెలుసుకునేందుకు ఏ సూచనా లేదుగా!" అన్నాడు కమీషనర్.

"నిన్న మందారం విషయం ఏమయింది?"

"క్షమించాలి. మీ సలహా పాటించలేదు" అన్నాడు కమీషనర్. అతని ముఖం ఎర్రనయింది.

"పాటించరని తెలుసు. మీరు పోలీసు ఉద్యోగులు. ఎలా పాటిస్తారు? ఇంతకీ ఏమయింది?"

"ఇక్కడికి తీసుకువచ్చి బెదిరించి చూశాము. ప్రయోజనం లేకపోయింది. వదిలేశాము."

"వదిలేసి?"

"ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, సార్జంటు శివం మారువేషాల్లో ఆమెని వెంబడించారు."

"తర్వాత?"

"రాయపురంలో చర్చి వీధిలోకి వెళ్ళింది. పది గజాల దూరంలో మా వాళ్ళు వెంబడించారు. అంతలో నలుగురు రౌడీలు ఎక్కణ్ణించో వచ్చి వాళ్ళిద్దరి మీదా పడ్డారు. ఆ నలుగురితో ఇన్స్పెక్టరు, సార్జంటు కలియబడ్డారు. పిస్తోళ్లు తీసి కాలుస్తామని బెదిరించిన తరవాత ఆ రౌడీలు పారిపోయారు. ఆలోగా ఆ వీధిలోంచి ఆమె వెళ్ళిపోయింది."

"మళ్ళీ కనపడలేదా?"

"కనపడకుండా ఎక్కడికి పోతుంది! ఆమెనీ, ఆ రౌడీలని కూడా పట్టుకున్నాము. కానీ ఏమీ తెలియలేదు. పోలీసు ఆఫీసర్లమని ముందే చెప్పి ఉంటే కలియబడేవాళ్ళం కావనీ, మందారాన్ని అల్లరి చెయ్యడానికి ఎవరో వెంబడిస్తున్నారనుకుని కలియబడ్డామనీ ఆ రౌడీలు చెప్పారు. ఆ పని చెయ్యమని ఎవరో తమకు చెప్పారనీ, మనిషికి ఇరవై అయిదు రూపాయలు ఇచ్చారనీ వాళ్ళు చెప్పారు. వాళ్ళకి మందారం బాగా తెలుసును. అందువల్ల ఆ మనిషి ఎవరో వాళ్ళు ఆరా తియ్యకుండా పోలీసులతో కలియబడ్డారుట."

"మందారాన్ని ప్రశించారా? ఏమన్నది?"

"చర్చి వీధి దాటి పక్క వీధిలోకి వెళ్ళగానే తన పక్కకి ఎవరో వచ్చి ఇరవై రూపాయలు ఇచ్చి యుగంధర్ ఇచ్చిన కవరు ఇవ్వమని అడిగాడుట. ఇచ్చిందట."

"అతని ఆనవాలు ఏమయినా చెప్పిందా?"

"లేదు. చీకటిగా ఉందనీ, ముఖ కనిపించకుండా హాటు బాగా కిందికి పెట్టుకున్నాడనీ అన్నది."

"పోనీలెండి. నా ఉత్తరం అతనికి అందిందిగా" అన్నాడు యుగంధర్.

అంతలో ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు హడావిడిగా వచ్చి "ఎర్రని గుర్తు ఉత్తరం కేసు ఇంకొకటి వచ్చింది సార్!" అన్నాడు.

"ఏమిటది?" అడిగాడు కమీషనర్.

"ఇక్కడే ఉన్నాడు, పిలవనా?"

"పిలు."

స్వరాజ్యరావు బయిటికి వెళ్ళి రెండు నిమిషాలలో ఒక మనిషిని వెంటబెట్టుకు వచ్చాడు. అతను ఫుల్ సూటులో ఉన్నాడు. భయపడుతున్నాడు.

"ఎర్రని గుర్తు ఉత్తరాల గురించి పత్రికల్లో చదివాను. అందుకే తిన్నగా వచ్చాను" అన్నాడతను.

"చెప్పండి" అన్నాడు కమీషనర్.

"ఆ ఉత్తరం పంపించిన మనిషి నా భార్యని ఎత్తుకుపోయాడు."

"సావధానంగా, విపులంగా చెప్పండి. మీ పేరు?"

"వేణుగోపాల్. డైమండ్ ఆటోమొబైల్సులో ఇంజనీర్ని. నా భార్య పేరు మీనాక్షి. వివాహమయి రెండేళ్ళయింది. పిల్లలు లేరు. నిన్న సాయంకాలం నేను ఇంటికి వచ్చేటప్పటికి నా భార్య ఇంట్లో లేదు. బల్ల మీద ఓ చీటీ ఉంది. తను తన తండ్రి ఇంటికి వెళుతున్నాననీ, రాత్రి నన్ను అక్కడికి వచ్చి ఇంటికి తీసుకురమ్మనీ రాసింది. మేము రాయపేటలో ఉంటున్నాము. ఆమె తండ్రి త్యాగరాయనగరంలో ఉంటున్నాడు. బద్ధకంగా ఉండి నిన్న రాత్రి నేను వెళ్ళలేదు. పొద్దున్నే వస్తుందనుకున్నాను. రాలేదు. ఒంట్లో బాగాలేక రాలేదేమోననుకుని హోటల్లో భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళాను. పది గంటల ముప్ఫయి నిమిషాలప్పుడు నాకు ఫోన్ కాల్ వచ్చింది. ఎర్రని గుర్తు ఉత్తరాలు రాస్తున్న మనిషి నా భార్యని ఎత్తుకుపోయాడనీ, వెంటనే పోలీసులకి రిపోర్టు చెయ్యమనీ ఎవరో చెప్పారు. నేను వెంటనే త్యాగరాయ నగర్ వెళ్ళాను. మా మామగారు ఇంట్లోనే ఉన్నారు. నా భార్య అసలు రానేలేదని చెప్పారాయన. వెంటనే మీకు చెప్పడానికి వచ్చాను" అన్నాడతను.

"మీ మామగారి పేరు?" అడిగాడు యుగంధర్.

"వైకుంఠరావు గారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్!"

"శిరీష్ కేసు తీసి ఆ కేసులో మీనాక్షి తండ్రి పేరేమిటో చూడండి" చెప్పాడు యుగంధర్.

కమీషనర్ ఫైలు తిరగేసి "యు ఆర్ రైట్! వైకుంఠరావు" అన్నాడు.

"రాధని కాని, పద్మప్రియని కాని హత్య చెయ్యటం వీరభద్రరావుకి ఇష్టం లేదన్నమాట!" అన్నాడు యుగంధర్.

"ఎందుకంటున్నారా మాట?" అడిగాడు కమీషనర్.

"వీరభద్రరావుకి కసి ఉంటే మీనాక్షి మీద ఉంటుంది. శిరీష్ కి శిక్ష పడటానికి ఆమె కొంతవరకు కారణం కదూ!"

"మీనాక్షిని అతను ఎత్తుకుపోవచ్చునన్న అనుమానం మీకు ఉంటే ముందే ఎందుకు చెప్పలేదు?" అడిగాడు కమీషనర్ యుగంధర్ని సూటిగా కళ్ళల్లోకి చూస్తూ.

"సారీ! ఎర్రని గుర్తు ఉత్తరాలు రాస్తున్న మనిషి వీరభద్రరావని ఇప్పుడేగా నిర్ధారణ అయింది."

"మీరు మాట్లాడుతున్నది ఏమిటో నాకు అర్థం కాలేదు. దయ చేసి తెలిసేట్లు చెప్పండి" అడిగాడు వేణుగోపాల్.

"మీ భార్య మీనాక్షిని హత్య చెయ్యడానికి ఎత్తుకుపోయాడని నా అనుమానం" అన్నాడు యుగంధర్.

"మీనాక్షిని హత్య చేస్తాడా? ఎందుకు?" అడిగాడు వేణుగోపాల్ భయపడుతూ.

"దయచేసి మీ మామగారి చిరునామా చెప్పండి" అడిగాడు యుగంధర్.

"విన్సెంట్ రోడ్, 114 త్యాగరాయ నగర్."

"థాంక్సు" అని యుగంధర్ లేచాడు.

"ఎక్కడికి?" అడిగాడు కమీషనర్.

"వైకుంఠరావు గారితో మాట్లాడాలి" అని యుగంధర్ కమీషనర్ గదిలోంచి బయటికి వెళ్ళాడు.

# 20

"వైకుంఠరావు గారి ఇంటికి ఎందుకు?" అడిగాడు రాజు కెనెమెరా హోటలు ముందునించి మౌంట్ రోడ్లోకి క్రిజ్లర్ కారు తిప్పుతూ.

"మీనాక్షి విషయం మాట్లాడేందుకు?"

"ఏం మాట్లాడాలి?"

యుగంధర్ ఆలోచనలో ఉండిపోయాడు.

ఇంటి ముందు తళతళ మెరుస్తున్న కారు ఆగగానే వసారాలో పడక కుర్చీలో పడుకుని పత్రిక చదువుకుంటున్న వైకుంఠరావు లేచి నిలబడి కారు వేపు చూశాడు.

"వైకుంఠరావు గారు మీరేనా?"

"అవును."

"నా పేరు యుగంధర్. ప్రయివేటు డిటెక్టివ్ ని. ఇతను నా అసిస్టెంటు రాజు. మీ అమ్మాయి మీనాక్షి గురించి వచ్చాము."

"ఏమైంది? ఇంటినించి నిన్ననగా వెళ్ళిందని అల్లుడు చెప్పాడు. ఇంకా రాలేదుట. గాభరాతో నా కాళ్ళూ, చేతులూ ఆడటం లేదు."

"శేషాద్రి హత్య కేసు గురించి కొన్ని విషయాలు అడగడానికి వచ్చాను."

"ఎప్పుడో జరిగిన ఆ కేసు గురించి ఇప్పుడెందుకు? ముందు మీనాక్షి ఏమైనదీ కనుక్కోండి."

"ఆ కేసుకీ, ఇప్పుడు మీ అమ్మాయి పరారీ కావడానికీ సంబంధమున్నదని నా నమ్మకం. అందుకే వచ్చాను."

"యేమడగాలనుకున్నారో అడగండి" అన్నాడు వైకుంఠరావు.

"శేషాద్రి హత్య జరిగిన రాత్రి మీ అమ్మాయి మీనాక్షి రాత్రి తొమ్మిది గంటలకి ఇంటికి వచ్చిందని మీరూ, మీ ఇంట్లో వాళ్ళూ సాక్ష్యం ఇచ్చారు కదూ!"

"అవును."

"నిజంగానే తొమ్మిది గంటలకి ఇంటికి వచ్చిందా? లేక మీ అమ్మాయి మీదికి నేరం రాకుండా ఉండేందుకు మీరంతా అట్లా చెప్పారా?"

వైకుంఠరావు చర్రున ముందుకు వచ్చి "ఇన్ సల్టు చేస్తున్నారు. వెళ్ళండి" అన్నాడు.

"ఐయామ్ సారీ! మీ అమ్మాయి క్షేమం కోరి మీరు అబద్ధం చెప్పారేమో అనుకున్నాను" అన్నాడు యుగంధర్.

వైకుంఠరావు పరీక్షగా యుగంధర్ని చూస్తూ, "శేషాద్రి హత్యకీ, ఇప్పుడు నా కూతురు కనపడకపోవడానికీ సంబంధమేమిటో చెపుతారా?" అడిగాడు.

"శేషాద్రి హత్యానేరానికి శిరీష్ అనే అతనికి శిక్ష పడిందని మీకు జ్ఞాపకమున్నదా?"

వైకుంఠరావు తల ఊపాడు.

"ఆ శిరీష్ తండ్రి వీరభద్రరావు మీ కూతుర్ని ఎత్తుకుపోయి ఉంటాడని నా అనుమానం."

"ఎందుకు?"

యుగంధర్ భుజాలు చరిచి "బెదిరించడానికి అయి ఉండవచ్చు, లేదా హత్య చెయ్యవచ్చు" అన్నాడు.

వైకుంఠరావు కుర్చీలోంచి లేచి గాభరాగా చూస్తూ "ఏమిటీ ఘోరం" ఈ పట్టణంలో పోలీసులూ, రక్షణా లేదా ఏమిటీ? మిస్టర్ యుగంధర్! మీరు చెప్పినదే నిజమైతే ఎట్లాగైనా మీరే మీనాక్షిని రక్షించాలి. ప్లీజ్!" అన్నాడు.

"శేషాద్రి హత్య గురించి, మీనాక్షి గురించి మీరు నిజం చెపితే ___"

"ఏం చెప్పమంటారు! నాకు తెలిసిన విషయాలన్నీ అప్పుడే పోలీసులకి చెప్పాను."

"అయితే ఎవ్వరూ ఏం చెయ్యలేరనుకుంటాను" అని యుగంధర్ లేచి నిలబడ్డాడు.

"ఒక క్షణం ఆగండి" అన్నాడు వైకుంఠరావు.

యుగంధర్ మాట్లాడకుండా నిలబడ్డాడు.

అయిదు నిముషాలు వైకుంఠరావు ఆలోచించుకుని "మీరు వెళ్ళండి. నేను కమీషనర్ ఆఫ్ పోలీసుని కలుసుకుంటాను" అన్నాడు.

యుగంధరూ, రాజూ మళ్ళీ క్రిజ్లర్ కారు ఎక్కారు.

"యెక్కడికి?" అడిగాడు రాజు.

"ఇంటికి" చెప్పాడు యుగంధర్.

రాజు కారు స్పీడుగా తోలుతూ "ఆయన యేదో దాస్తున్నాడనిపిస్తోంది" అన్నాడు.

"అవును. అబద్ధం చెపుతున్నాడు. నిజం చెపితే మీనాక్షిని రక్షించేందుకు అవకాశం ఉండేది."

"ఏమిటా నిజం?"

"శేషాద్రి హత్యతో మీనాక్షికి ఏదో సంబంధం వుండి వుండాలి. మీనాక్షి ఎలిబీ నిజమై ఉండదు. ఆమెకి ఎలిబీ ఇచ్చిన వాళ్ళంతా ఆమె ఆత్మీయులు."

"అంటే మీనాక్షి శేషాద్రిని హత్యచేసి ఉంటుందని మీ అభిప్రాయమా?"

"శిరీష్ నిర్దోషి అయితే శేషాద్రిని ఇంకెవరో హత్య చేసి ఉండాలిగా! మీనాక్షి హత్య చేసి ఉండవచ్చు కదూ!"

"మీనాక్షికి శేషాద్రిని చూస్తే ఇష్టం కదా! ఎందుకు హత్య చేస్తుంది?"

"ఏమో! ఏదయినా కారణం ఉన్నదేమో!" అన్నాడు యుగంధర్.

అంతలో కారు గేటు దగ్గిర ఆగింది. యుగంధర్ కారు దిగి ఇంట్లోకి వెళ్ళాడు.

రాజు కారు షెడ్లో పెట్టి కన్సల్టింగ్ రూంలోకి వెళ్ళాడు. యుగంధర్ చేతిలో ఉన్న కాగితం చూసి "ఏమిటది?" అడిగాడు.

"రైల్వే రసీదు. లెఫ్ట్ లగేజిది. పోస్టుబాక్సులో వుంది" అంటూ ఓ గులాబీ రంగు కాగితం రాజుకిచ్చాడు యుగంధర్.

అది లెఫ్ట్ లగేజిలో ఒక పెట్టె పెట్టిన రశీదు. యుగంధర్ పేరు రాసి వుంది దానిమీద.

"యేమిటీ రశీదు?" అడిగాడు రాజు.

"వెనక్కి తిప్పి చూడు."

రాజు వెనక్కి తిప్పి చూశాడు. ఎర్రని సిరాతో X గుర్తు ఉంది.

"వీరభద్రరావు పంపాడా?" యుగంధర్ తల ఊపి రిసీవర్ తీసి "హల్లో! నేను యుగంధర్ని!" అని కమీషనర్ కి ఆ రైలు రశీదు గురించి చెప్పి "దయచేసి ఆ పెట్టె తెప్పించే ఏర్పాటు చెయ్యండి" అని రిసీవరు పెట్టేసి "ఇన్స్పెక్టరు స్వరాజ్యరావు వస్తాడు రశీదు కోసం" చెప్పాడు రాజుకి.

"మనమే వెళ్ళి తీసుకోవచ్చుగా!" అడిగాడు రాజు.

"యెలాగూ తర్వాత పోలీసులకు చెప్పవలసి వస్తుంది కనుక ముందే చెప్పాను."

"అందులో...." అన్నాడు రాజు.

యుగంధర్ తల ఊపాడు. ఇద్దరు డిటెక్టివ్ ల మొహాలూ ఆలోచనతో తీవ్రంగా ఉన్నాయి. తలుపు చప్పుడయింది. ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు హడావిడిగా లోపలికి వచ్చి "ఏదీ రశీదు?" అడిగాడు.

యుగంధర్ రశీదు ఇచ్చాడు.

"మీరు రారా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"అనవసరం" అన్నాడు యుగంధర్.

రశీదు తీసుకుని స్వరాజ్యరావు వెళ్ళిపోయాడు.

# 21

**"నో! నో! ఇలా ఘోరాలు జరుగుతూంటే ఎలా?"** అన్నాడు కమీషనర్ ఆఫ్ పోలీసు కన్సల్టింగ్ రూంలో కూర్చున్న యుగంధర్ని చూడగానే.

"లెఫ్ట్ లగేజ్ రూంలోంచి పెట్టె తెప్పించారా?" అడిగాడు యుగంధర్.

కమీషనర్ తల వూపి ఓ కవరు యుగంధర్ కిచ్చాడు.

"ఈ కవరు మాత్రమేనా ఆ పెట్టెలో ఉంది?"

కమీషనర్ యుగంధర్ వేపు నిస్పృహతో చూసి "శవం కూడా ఉంది" అని ఊరుకున్నాడు.

ఆయన చాలా కలవరపడుతున్నాడని యుగంధర్ గ్రహించి ఏమీ అడక్కుండా కవరు తిప్పి చూశాడు.

డిటెక్టివ్ యుగంధర్ కి అని పైన వ్రాసి ఉంది. అందులోంచి పావు తావు కాగితం బయిటికి తీసి చదవడం ప్రారంభించాడు. యుగంధర్ వెనక నిలబడి రాజు కూడా చదివాడు.

"డిటెక్టివ్ యుగంధర్ కి, మీరు నా హెచ్చరిక లక్ష్యపెట్టకపోవడం వల్ల యింకో ప్రాణం బలి అయింది. పద్మప్రియనీ, రాధనీ చంపి శవాలు ఈ పెట్టెలో పెట్టి మీకు పంపుదామనుకున్నాను. కానీ యీ నాలుగు రోజుల్నించీ వాళ్ళతో బాగా చనువు ఏర్పడింది. అందువల్ల వాళ్ళని చంపేందుకు నాకు చేతులు రాలేదు. రాధ ముద్దుమాటలూ, పాలబుగ్గలు, నవ్వులు, అల్లరి – ఎలా వాటిని చితిపెయ్యడం! అందుకే మీనాక్షిని ఎత్తుకు వచ్చాను. మీనాక్షికి శేషాద్రి హత్యతో ఏదో కొంత సంబంధం ఉన్నదని మొదట్నించీ నాకు అనుమానంగానే ఉండేది. ఎత్తుకురాగానే ఒక చీకటి గదిలో బంధించాను. రకరకాల భయపెట్టి నిజం చెప్పించడానికి ప్రయత్నించాను. అప్పుడు కోర్టులో చెప్పిన విషయాలు తప్ప యింకేమీ చెప్పలేదు. మొండిగా అబద్ధమే చెప్పిందో లేక నిజమే చెప్పిందో నాకు తెలియదు. ఒక పక్క శేషాద్రిని, యింకోపక్క నా కొడుకు శిరీష్ నీ ఆకర్షించి మభ్యపెట్టి బాధించింది. అయినప్పటికీ మీనాక్షిని చంపడం ఇష్టంలేక ఊరుకున్నాను. నా హెచ్చరిక మీరు లక్ష్యపెట్టకపోవడం వల్ల యిప్పుడు తప్పనిసరి అయింది. ఏం చెయ్యను!

మీనాక్షిని ఆట్టే బాధపెట్టలేదు. అరక్షణంలో ముగించాను. పెట్టె తయారుగా ఉంది. రైల్వే వారి లెఫ్ట్ లగేజ్ రూంలో పెట్టడానికీ, రసీదు మీకు అందజెయ్యడానికీ ఏర్పాటు చేశాను. అన్నీ సక్రమంగా జరుగుతాయనీ, ఈ ఉత్తరం మీ చేతికి అందుతుందనీ ఆశిస్తాను.

మీరు ఉన్నత పోలీసు అధికారులతోనూ, ప్రభుత్వోద్యోగులతోనూ ఇంకోసారి సంప్రదించండి. ఇన్ని ప్రాణాలను బలి ఇస్తూ కూడా శిరీష్ ని జైలులో ఉంచడం ముఖ్యమా?

ఇప్పుడైనా నా షరతులకు ఒప్పుకుంటారనీ, శిరీష్ ని వెంటనే విడుదల చేస్తారనీ ఆశిస్తాను.

X"

ఆ ఉత్తరం కమీషనర్ కి ఇస్తూ "ఎందుకు చింపలేదు?" అడిగాడు యుగంధర్.

కమీషనర్ భుజాలు చరిచాడు. చదవమని చెప్పాడు యుగంధర్.

ఆయన ఉత్తరం చదివి మడిచి "మీనాక్షి అన్నమాట" అన్నాడు.

"ఏం! ఇంతకు ముందు తెలియలేదా?"

"లేదు. శవాన్ని ముక్కలు ముక్కలుగా కోసి ట్రంకు పెట్టెలో పెట్టాడు."

"మొహమూ?" అడిగాడు రాజు.

"రూపురేఖలు లేకుండా చెక్కాడు. అది మీనాక్షి శవం అని తెలుసుకునేందుకు వీలులేకుండా చేశాడు."

"ఎందుకో?" అన్నాడు యుగంధర్.

"ఏమిటి ఎందుకో?" అడిగాడు కమీషనర్.

"అది మీనాక్షి శవం అని ఉత్తరం రాసి ఆ పెట్టెలో పెట్టాడు. అటువంటప్పుడు రూపురేఖలు తెలియకుండా మొహం చెక్కేయడం, శవాన్ని ముక్కలు ముక్కలుగా కొయ్యడం దేనికి?"

"ఆనవాలు లేకుండా చెయ్యాలన్న ఉద్దేశం కాకపోవచ్చు. మనిషి మీద ద్వేషం ఉండో, పెట్టెలో పట్టించేందుకో అలా చేసి ఉండవచ్చు" అన్నాడు కమీషనర్.

"మీరు చెప్పింది అంత సబబుగా లేదు. అతను రాసిన ఉత్తరం బట్టి మీనాక్షి మీద అతనికి ద్వేషం ఉన్నట్లు తోచడం లేదు. చంపేసిన తరువాత శవాన్ని అట్లా ముక్కలు ముక్కలుగా కొయ్యడం ఎంతో ద్వేషమూ, కసీ ఉంటే గానీ జరగదు."

"అయితే మీ ఉద్దేశం ఏమిటి?"

"అది మీనాక్షి శవం కాదేమో! ఆమె తండ్రికీ, భర్తకీ చూపించారా?"

"లేదు."

"అయితే ఆ ఏర్పాటు చేయించండి."

కమీషనర్ ఫోన్ చేసి ఏ.సి. కి చెప్పాడు. తర్వాత యుగంధర్ వేపు తిరిగి "ఎవరి శవమో పెట్టెలో పెట్టి అది మీనాక్షి అని అబద్ధం రాస్తాడా? అందువల్ల అతనికి కలిగే ప్రయోజనం ఏమిటి?" అడిగాడు.

"అదే ఆలోచిస్తున్నాను" అని యుగంధర్ సిగిరెట్ వెలిగించి డబ్బా కమీషనర్ కి అందించాడు.

కాలుస్తున్న సిగిరెట్ ఆష్ ట్రేలో విసుగ్గా పడేసి " సారీ సర్! ఈ కేసు ప్రారంభమైనప్పటినుంచీ ఈ గదిలోనో, కమీషనర్ గదిలోనో కూర్చుని ఆలోచించడం తప్ప మనం చేస్తున్నదేమీ లేదు. ఇంకా ఆలోచించడమేనా?" అన్నాడు రాజు.

"ఏం చెయ్యాలో నువ్వు చెప్పు" అన్నాడు యుగంధర్.

"వీరభద్రరావు యీ ఊళ్ళోనే ఉన్నాడు. ఎక్కడో ఓ గదిలో తలుపు గడియ పెట్టుకుని దాక్కోలేదు. వీధిలోకి వెళ్ళి ఆడపిల్లల్ని ఎత్తుకుపోతున్నాడు. ఉత్తరాలు రాసి పోస్టు చేస్తున్నాడు. శవాన్ని ముక్కలు ముక్కలుగా కోసి పెట్టెలో పెట్టి రైలుస్టేషన్ కి తీసుకెళ్ళాడు. ఫోన్ కాల్స్ చేస్తున్నాడు. అతనికి ఓ ఇల్లు, పెద్ద కారు ఉండి ఉండాలి. ఇంట్లో ఒకరో ఇద్దరో నౌఖర్లు ఉండి ఉండాలి. పోలీసులూ మనమూ కలిసి కూడా అతన్ని పట్టుకోలేకపోవడం చాలా అవమానకరంగా ఉంది" అన్నాడు రాజు ఉద్రేకంతో.

కమీషనర్ తల ఊపాడు.

"నువ్వు చెప్పినవన్నీ ఒప్పుకుంటున్నాను. ఆ వీరభద్రరావుని ఎలా పట్టుకోగలమో చెప్పు. ఎక్కడ వెతకాలో చెప్పు. పోలీస్ కమీషనర్ నీకు కావలసిన సహాయం ఇస్తారు. తెలిస్తే వెళ్ళి పట్టుకో!" అన్నాడు యుగంధర్.

"అదే ఆలోచిస్తున్నాను."

యుగంధర్ చిన్నగా నవ్వాడు. రాజు కూడా నవ్వాడు. అయిదు నిమిషాల సేపు ఎవరికి వాళ్ళు ఆలోచిస్తూ మౌనంగా కూర్చున్నారు. చటుక్కున యుగంధర్ వేపు చూసి "నాకో ఆలోచన తట్టింది." అన్నాడు రాజు.

"ఏమిటది?"అడిగాడు యుగంధర్.

"శిరీష్ ని వదిలిపెట్టడానికి ప్రభుత్వాన్ని ఒప్పించామని అతనికి చెప్పండి."

"చెపుతాను. తర్వాత?"

"శిరీష్ లా మేకప్ చేసుకుని నేను వెళతాను. అతను నన్ను కలుసుకుంటాడు. అప్పుడు అతన్ని పట్టుకోవచ్చు."

యుగంధర్ నవ్వి "వీరభద్రరావు అంత తెలివి తక్కువవాడు కాదని యింకా నీకు తెలియలేదా! నిజంగా మనం శిరీష్ ని వొదిలిపెట్టించినా వీరభద్రరావు అతన్ని కలుసుకోడు. కొడుక్కి డబ్బు అందే ఏర్పాటు చేసి విదేశాలకు పంపేస్తాడు. తర్వాత ఎప్పుడో శిరీష్ వెళ్ళిన దేశం వెళతాడు" అన్నాడు.

కమీషనర్ తల ఊపి "యుగంధర్ ఈజ్ రైట్!" అన్నాడు.

రాజు మొహం వేళ్ళాడేసి "పోనీ యింకో..." అని అడిగాడు.

"చెప్పు."

"వీరభద్రరావు యింట్లో టెలిఫోన్ ఉండి ఉంటుంది."

"ఉంటుందని ఎందుకనుకుంటున్నావు?"

"ఆ రోజు కొత్తవాళ్ళెవరినీ ఫోన్ చెయ్యనివ్వవద్దని ప్రయివేట్ ఫోనులున్న వాళ్ళందరికీ పోలీసు అధికారులు చెప్పారు."

"అవును" అన్నాడు కమీషనర్.

"పబ్లిక్ టెలిఫోన్ బూతుల దగ్గర ఎర్ర దీపాలు ఏర్పాటు చేసి అతన్ని పట్టుకునేందుకు గట్టి పథకం వేశారు."

"యస్."

"కాని అతను టెలిఫోన్ ఉపయోగించకుండా తిన్నగా ఇక్కడికి వచ్చి మీతో మాట్లాడాడు. పోలీసులు చేసిన ఏర్పాట్లన్నీ అతనికి తెలుసునని చెప్పాడు కదూ?"

"అవును" అన్నాడు యుగంధర్.

"అతనికి ప్రయివేటు టెలిఫోన్ ఉంటే అందరితో బాటు పోలీసులు అతన్నీ హెచ్చరించి ఉంటారు. కొత్తవాళ్ళనెవర్నీ తమ టెలిఫోనులు ఉపయోగించనివ్వవద్దనీ పోలీసులు చెప్పిన విషయం ఆ విధంగా అతనికి తెలిసి ఉంటుంది" రాజు ఉత్సాహంతో చెప్పాడు.

"వెరీ గుడ్ పాయింట్, నిజమే! అయితే?" అడిగాడు యుగంధర్.

"ప్రయివేటు టెలిఫోను ఉన్న ప్రతీ యింటికీ వెళ్ళి..." అని రాజు చెప్పబోతోంటే యుగంధర్ అడ్డు వచ్చి "అతని ఇంట్లో టెలిఫోన్ ఉందని ఎందుకు అనుకోవాలి? వీరభద్రరావు రూపమూ, పేరూ మార్చుకున్నాడు. ఏదో వ్యాపారం చేస్తున్నట్లు ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఆఫీసు పెట్టుకుని ఉండవచ్చు. ఆ ఆఫీసులో ఫోను ఉండవచ్చు" ఉన్నాడు.

రాజు నిరాశతో చూశాడు.

"రాజు చెప్పినట్లు చేస్తే నష్టమేమున్నది?" అడిగాడు కమీషనర్.

"ఏమీ ఉండదు" చెప్పాడు యుగంధర్.

"అయితే రాజూ పద! నా ఆఫీసుకు వెళదాం. ఏర్పాట్లు చేయిస్తాను" అన్నాడు కమీషనర్.

రాజు యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"వెళ్ళు. ఏదో ఒక ప్రయత్నం చెయ్యడం మంచిదే" అన్నాడు యుగంధర్.

## 22

డిటెక్టివ్ యుగంధర్ తలుపు లోపల గడియ పెట్టుకున్నాడు. ఎవరైనా తలుపు తియ్యడానికి ప్రయత్నిస్తే వెంటనే మోగే అలారం స్విచ్ వేసి పెట్టాడు. కన్సల్టింగ్ రూంలోకి వెళ్ళి కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచించడం ప్రారంభించాడు.

హంతకుడు ఎక్కడున్నదీ, ఏ వేషంలో ఉన్నదీ సూచనగానైనా తెలియనిదే వీధుల్లో పడి వెతకడం అర్థం లేని పని. హంతకుడు ఎంత తెలివైనవాడైనా, ఎంత జాగ్రత్త పడ్డా అతన్ని గురించి తెలిపే విషయాలు కొన్ని ఉంటాయి. వాటిని క్రమంగా పెట్టుకుని, అర్థం చేసుకుని హంతకుడి ఆచూకీ తెలుసుకునేందుకు తెలివైన అపరాధ పరిశోధకుడు తన మేధస్సు ఉపయోగిస్తాడు. వీరభద్రరావుని గురించి రాజు ఊహించిన విషయాలు చాలావరకూ నిజమే అయిఉండవచ్చు. అతనికి కారు ఉండి ఉంటుంది. పెద్ద ఇల్లు, టెలిఫోను కూడా ఉండాలి. డబ్బుకు ఆశపడి కిక్కురుమనకుండా అతను చెప్పినట్లు చేసే నౌఖర్లు కూడా ఉండి ఉంటారు.

అప్పీలులో కొడుకు శిక్ష ఖాయం కాగానే వీరభద్రరావు ప్రాక్టీసు మానేసి ఆస్తి అమ్మేసి రొఖ్ఖం తీసుకుని మద్రాసు విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. పేరు, రూపం మార్చుకుని తిరిగి వచ్చి హత్యాకాండ సాగించి పోలీసులనూ, ప్రభుత్వాన్ని హడలకొట్టి కొడుకుని విడుదల చేయించడానికి అప్పుడే పథకం ఆలోచించి ఉంటాడు. లేకపోతే తన ఆచూకీ ఎవరికీ తెలియకుండా అలా ఎందుకు పరారీ అవుతాడు?

మద్రాసులో పాతికేళ్ళు 'లా' ప్రాక్టీసు చేసిన మనిషికి ఎంతోమంది స్నేహితులుంటారు. ఎంత దూరాన్నించి అయినా అతన్ని పోల్చగల ఆత్మీయులుంటారు. మేకప్ తో రూపం మార్చుకున్నా, కంఠస్వరం మార్చి మాట్లాడినా గుర్తు పట్టగల వాళ్ళుంటారు. అదీగాక ఇరవై నాలుగు గంటలూ పెట్టుకున్న మీసాలతో, మేకప్ చేసుకున్న మొహంతో వూళ్ళో ఎట్లా తిరుగుతాడు! బహుశా మొహానికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుని ఉంటాడు.

మన దేశంలో ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు ఒకరో ఇద్దరో బొంబాయిలో ఉన్నారు. మద్రాసులో లేరు. వీరభద్రరావు బొంబాయి వెళ్ళి మొహానికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాడా?

"నా మొహం పూర్తిగా మార్చాలి. ఈ మొహానికీ, ఆ మొహానికీ ఎక్కడా పోలిక లేకుండా చెయ్యాలి." అని సర్జన్ కి చెపితే అతనికి అనుమానం కలగదా! డబ్బుకి కక్కుర్తిపడి ఒప్పుకుంటాడా! లేక విదేశాలకి వెళ్ళి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుని తిరిగి వచ్చాడా! అయితే పాస్పోర్టు, అయిడెంటిఫికేషన్ పత్రాలు మొదలైనవి ఎట్లా సంపాదించాడు! పేరు మార్చుకుని, రూపం మార్చుకుని విదేశాన్నించి ఎలా తిరిగి

వస్తాడు! పాస్పోర్టు ఎలా వస్తుంది! డబ్బు ఇచ్చి దొంగ పాస్పోర్టు సంపాదించి విదేశాన్నించి తిరిగివచ్చి ఉంటాడా! ఆస్తి అమ్మివేసి పోగుచేసిన రొఖ్ఖం అంతా ఏం చేసి ఉంటాడు! బొంబాయిలో బాంకులో వేసి ఉండాలి. అంత డబ్బు వేస్తూ అక్కౌంటు ప్రారంభించే మనిషిని బాంకి ఏజంటు, గుమస్తా చూడకుండా ఉండరు. ఇంకో మొహంతో తిరిగివచ్చి బాంకులోంచి డబ్బు తీసుకోబోతే వాళ్ళకి అనుమానం కలిగి ఉండదా? డబ్బు బాంకిలో వేయకుండా రొఖ్ఖంగానో, బంగారంలోకి మార్చో ఎక్కడో దాచిపెట్టి ఉండవచ్చు. విదేశాన్నించి తిరిగివచ్చి మారుపేరుతో యిక్కడ జీవితం ప్రారంభించి ఉంటాడు. ఆ మారుపేరు ఏమిటో తెలుసుకోవడం ఎట్లా? మారు రూపంలో తీయించుకున్న ఫోటో ఉంటుందా?

విదేశానికి మద్రాసు నుంచి బయలుదేరి ఉండడు. బొంబాయికి వెళ్ళి అక్కణ్ణించి వెళ్ళాడా!

యుగంధర్ రిసీవర్ తీసి బొంబాయి నగర పోలీస్ కమీషనర్ కి పర్సన్ టు పర్సన్ ఎక్స్ప్రెస్ ట్రంక్ కాల్ బుక్ చేశాడు.

ఇరవై నిమిషాల తర్వాత టెలిఫోన్ మోగింది. బొంబాయి కాల్ తీసుకోమని ఆపరేటర్ చెప్పింది.

“డిటెక్టివ్ యుగంధర్ హియర్.”

“యస్. కమీషనర్ స్పీకింగ్!”

“గత రెండు సంవత్సరాలలో ఎప్పుడో మద్రాసులో లాయరుగా ఉండే వీరభద్రరావు అనే ఆయన బొంబాయి నించి విదేశాలకు వెళ్ళి వుండాలి. ఎప్పుడు, ఏ దేశానికి వెళ్ళాడో మీ రికార్డులో ఉంటుందనుకుంటాను.”

“యస్. ఉంటుంది.”

“ఆ వివరాలు కావాలి.”

“ఆల్ రైట్. వివరాలు వ్రాయించి పోస్టు చెయ్యనా?”

“ఒద్దు, టెలిప్రింటర్ ద్వారా మద్రాసు పోలీస్ కమీషనర్ ఆఫీసుకు పంపండి.”

“ఆల్ రైట్.”

“థాంక్సు” చెప్పి యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు. హాల్లో పచార్లు చేస్తూ ఆలోచిస్తున్నాడు. అంతలో టెలిఫోన్ మోగింది.

“హల్లో! యుగంధర్ స్పీకింగ్.”

“భుజంగరావుని. మీరు ఒకసారి రాగలరా?”

“వెంటనే వస్తున్నాను” అని రిసీవర్ పెట్టేశాడు యుగంధర్. క్రిజ్లర్ కారు ఎక్కి బయలుదేరాడు.

యుగంధర్ని చూసి కూడా నౌఖరు తలుపు తెరవలేదు. మేడ మీదికి వెళ్ళి భుజంగరావుకి చెప్పి తర్వాత వచ్చి తలుపు తీశాడు.

“క్షమించండి. ఎవరు వచ్చినా తనకు చెప్పనిదే తలుపు తెరవవద్దని అయ్యగారు చెప్పారు” అన్నాడా నౌఖరు.

“అవును. అది మంచిదే” అని యుగంధర్ మేడమెట్లు ఎక్కాడు.

ఈ నాలుగు రోజుల్లో వయస్సు పది యేళ్ళు పెరిగినట్లు కనపడ్డాడు భుజంగరావు. మొహం పీక్కుపోయింది. కళ్ళ కింద గుంటలు. బలహీనంగా ఉన్నాడు.

“అలా ఉన్నారేం!” అడిగాడు యుగంధర్.

భుజంగరావు చిన్నగా నవ్వి “మానసిక వ్యథ. కూర్చోండి యుగంధర్! ఇవాళ పోస్టులో ఈ ఉత్తరం వచ్చింది” అంటూ యుగంధర్ కి ఒక కవరు అందించాడు.

కవరులోంచి కాయితం బయిటికి లాగి అడుగున సంతకం ఉందేమో చూశాడు. X గుర్తు మాత్రం ఉంది. చదవడం ప్రారంభించాడు.

"భుజంగరావు గారికి,

మీ మనమరాలు పద్మప్రియ నా ఆధీనంలో ఉన్నదని మీకు తెలుసుగా! ఇప్పటివరకూ క్షేమంగానే ఉన్నదని చెప్పటానికి సంతోషిస్తున్నాను. ఈ ఉత్తరం వెనకవైపు మీకు పద్మప్రియ రాసింది.

ఇప్పుడు మీకు ఈ ఉత్తరం నేను రాయడానికి కారణం ఉంది. పద్మప్రియ క్షేమం తెలపడం కాదు. నాకో కొడుకు ఉన్నాడు, పేరు శిరీష్. ఎవరో తప్పుడు సాక్ష్యం చెప్పడం వల్లో, కేసు అపార్థం చేసుకోవడం వల్లో, వాడి, నా దురదృష్టం వల్లో వాడిమీద హత్యానేరం మోపబడింది. విచారణ జరిగి యావజ్జీవ శిక్ష పడింది. వాణ్ని జైలులోంచి విడిపించడానికి నా ప్రయత్నం నేను చేస్తున్నాను. మీరు నాతో సహకరిస్తే మీ మనమరాలు పద్మప్రియని మీ ఇంటికి పంపేస్తాను.

పద్మప్రియ, రాధ నా బందీలుగా ఉన్నారు. నేను తలుచుకుంటే వీళ్ళిద్దర్నే కాక ఇంకా ఎంతమందినో హత్య చెయ్యగలను. ఇప్పటికి ముగ్గుర్ని హత్య చేశాను. పోలీసులు కాని, ప్రఖ్యాత డిటెక్టివ్ యుగంధర్ కాని నన్ను పట్టుకోలేకపోయారు. వాళ్ళకి ఆ సమర్ధత లేదు. ఉంటే ఈపాటికి పట్టుకునేవాళ్ళే.

శిరీష్ ని వొదిలిపెట్టమన్నాను. నేను అడిగింది అంతే. ఈ దేశంలో ఉండడనీ, యింకో దేశానికి వెళ్ళిపోతాడనీ చెప్పాను. అందులో పోలీసులకి నామర్దా ఏమీ లేదు. వాళ్ళ ప్రతిష్ట కాపాడుకునేందుకు జైలులోంచి తప్పించుకు పారిపోయాడని చెప్పవచ్చునన్నాను. కాని పోలీసు అధికారులు, ప్రభుత్వోద్యోగులు ఒప్పుకోలేదు.

రెండురోజులు గడువు ఇస్తున్నాను. ఈలోగా మీరు గవర్నర్ని, మంత్రులనీ కలుసుకుని మాట్లాడి నా షరతులకి వాళ్ళని ఒప్పించండి. ఇది వాళ్ళకు వ్యక్తిగతమైన సమస్య కానందువల్ల ఒప్పుకోకపోవచ్చు, కాని ఇది మీకు వ్యక్తిగత సమస్య. పద్మప్రియ ప్రాణం మీరు కాపాడాలంటే నా కుమారుణ్ణి వదిలిపెట్టే ఏర్పాటు మీరు చెయ్యాలి. ఆలస్యం చేయకండి. వెంటనే పూనుకోండి. ఎల్లుండి వరకూ నావల్ల మీకు ఎటువంటి ఆపదా కలగదు."

యుగంధర్ ఉత్తరం చదివి మడిచి భుజంగరావుకి ఇచ్చేశాడు.

"ఏమంటారు?" అడిగాడు ఆయన.

"యేమనగలను!"

"గవర్నర్ని కలుసుకోనా?"

"అది మీరే నిర్ణయించుకోవాలి."

"ఆ వీరభద్రరావుకి పిచ్చి పట్టిందేమో! లేకపోతే తనకి ఎటువంటి హానీ చెయ్యనివాళ్ళని ఎత్తుకుపోవడం, అకారణంగా హత్యలు చెయ్యడం పిచ్చి లక్షణాలు కాకపోతే యేమిటి!"

"నిజమే! కాని పిచ్చివాడు చెప్పినట్టల్లా చెయ్యడం ఎలా!"

"చెయ్యకతప్పదు కదూ! ఏ నేరమూ ఎరుగని అమాయకులను ఎత్తుకుపోయి చంపుతానంటున్నాడు. చంపితే చంపనీ అని ఎట్లా ఊరుకోవడం!"

"క్షమించండి భుజంగరావు గారూ! ఈ విషయంలో మీకు సలహా ఇవ్వలేను నేను. ప్రభుత్వంసంబంధమున్న విషయం ఇది. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడమో, మానడమో మీరే నిర్ణయించుకోవాలి."

"పద్మప్రియ ఆచూకీ ఏమైనా మీకు తెలిసిందా?"

"లేదు."

"పద్మని విడిపించే అవకాశం ఏమైనా ఉందా?"

"ఉందనే అనుకుంటున్నాను."

"పద్మకి ఆపద కలగదనీ, క్షేమంగా తీసుకురాగలననీ మీరు హామీ ఇవ్వగలరా?"

"ఇవ్వలేను."

"ఉన్నది ఉన్నట్లు చెప్పినందుకు థాంక్సు" అని భుజంగరావు లేచి కోటు తొడుక్కున్నాడు.

"నేనిక వెళ్ళవచ్చా!" అడిగాడు యుగంధర్.

భుజంగరావు తల ఊపాడు.

# 23

**"బొంబాయి నించి మీకు టెలీప్రింటరు మెసేజి వచ్చింది"** అన్నాడు కమీషనర్ యుగంధర్ కి ఓ కాగితం ఇస్తూ.

"రిఫరెన్సు వీరభద్రరావు. ఎంక్వయిరీ డిటెక్టివ్ యుగంధర్. ఒకటిన్నర సంవత్సరం కింద వీరభద్రరావు విమానంలో అమెరికాకి వెళ్ళాడు. తిరిగి వచ్చినట్లు రికార్డులో లేదు" ఆ కాగితంలో ఉన్న విషయం యిది.

"దీన్ని బట్టి యేమైనా తెలుస్తోందా?" అడిగాడు కమీషనర్.

"నా ఊహ సరైనదే అనిపిస్తోంది. రాజు యేం చేస్తున్నాడు?"

కమీషనర్ చిన్నగా నవ్వి "రాజు, ఇన్స్పెక్టరు స్వరాజ్యరావు, సార్జంటు శివం, డజను మంది డిటెక్టివ్ కానిస్టేబుల్స్ సహాయంతో టెలిఫోనులు ఉన్న ఇళ్ళన్నీ తనిఖీ చేస్తున్నారు" అన్నాడు.

"ట్రంకుపెట్టెలో శవం గురించి యేం తేలింది?"

"వేణుగోపాల్ నీ, వైకుంఠరావునీ పిలిపించాను. మీనాక్షి శవం అని గుర్తుపట్టడానికి ఆధారాలు యేమీ లేవని చెప్పారు."

"ఆల్ రైట్! నేను బొంబాయి వెళ్ళి రేపు సాయంకాలానికి తిరిగి వస్తాను."

"బొంబాయికి ఎందుకు? అక్కడి కమీషనర్ కి మెసేజి పంపిస్తే కావలసిన విషయాలు కనుక్కుని తెలియజేస్తారుగా."

"నేనే వెళ్ళడం మంచిది" అన్నాడు యుగంధర్.

కమీషనర్ ఒక నిమిషం పాటు ఆలోచించి "ఆల్ రైట్!" అన్నాడు.

డిటెక్టివ్ యుగంధర్ విమానంలో బొంబాయికి బయలుదేరుతున్నాడని మద్రాసు కమీషనర్ బొంబాయి పోలీసు కమీషనరుకి వార్త పంపాడు. బొంబాయి కమీషనర్ మెహతా యుగంధర్ కి చిరకాల స్నేహితుడు. అందుకే ఆయన విమానాశ్రయానికి వెళ్ళాడు.

"ఎందుకు, ఇక్కడికి వచ్చారు? అంత శ్రమ దేనికి? నేనే మీ ఆఫీసుకి వస్తున్నానుగా!" అన్నాడు యుగంధర్ విమానం దిగి మెహతాకి షేక్ హ్యాండ్ ఇస్తూ.

"ఇప్పుడు నాకంత పని యేమీ లేదు. రండి" అని యుగంధర్ని తన కారు దగ్గరికి తీసుకెళ్ళాడు మెహతా.

కారు కదిలింది. తను దర్యాప్తు చేస్తున్న కేసు గురించి మెహతాకి వివరంగా చెప్పాడు యుగంధర్.

"గుడ్ గాడ్. పిచ్చివాడు మా బొంబాయిలో హత్యలు ప్రారంభించలేదు అంతవరకు నయమే! చాలా చిక్కయిన కేసే. మద్రాసు పోలీసులూ, ప్రభుత్వోద్యోగులూ చాలా ఇబ్బందిలో పడి ఉంటారు."

యుగంధర్ నవ్వి "అటువంటి సమస్య మీకు కలిగితే యేం చేస్తారు? శిరీష్ ని వదిలిపెట్టమని సలహా ఇస్తారా?" అడిగాడు.

"నొ! నొ! ఒకసారి అటువంటి బలహీనత కనబరిచామా ఇక పోలీసులకి రాష్ట్రంలో పరపతి వుండదు" అన్నాడు మెహతా.

యుగంధర్ తలవూపి తనకి కావలిసిన సహాయం గురించి చెప్పాడు.

"ఓ యస్! ఇన్స్పెక్టర్ని మీ కూడా పంపిస్తాను. కనుక్కోవడం కష్టం అనుకుంటాను. అయినా ప్రయత్నించండి. గుడ్‌లక్!" అన్నాడు కమీషనర్. ॥

# 24

"నాకు ఆకలేస్తోంది."

"బిస్కట్లు ఇవ్వనా?"

"ఊహు."

"యేం కావాలి?" అడిగింది పద్మప్రియ రాధని.

"అమ్మ కావాలి" అన్నది నాలుగేళ్ళ రాధ కళ్ళ నిండా నీళ్ళు పెట్టుకుని.

"రేపు మీ అమ్మ దగ్గిరికి తీసుకువెళతాలే. బిస్కట్లు తిను" అని రాధని వొళ్ళోకి తీసుకుంది పద్మ.

"రోజూ రేపు రేపు అంటున్నావు. అమ్మ ఇప్పుడే కావాలి" అని ఏడవడం మొదలుపెట్టింది రాధ.

యేం చెప్పాలి! ఎట్లా సముదాయించాలి! పద్మ కళ్ళల్లో కూడా నీళ్ళు నిండాయి.

"ఏడవకు రాధా! అమ్మ దగ్గిరికి తీసుకువెళతాగా!" అని రాధ తల నిమిరింది.

అంతలో తలుపు తెరిచి ఓ స్త్రీ తొంగి చూసింది.

నల్లగా, లావుగా ఉంది. నెరిసిన జుట్టు, రెండు బంగారం పళ్ళు, చెవులకి బంగారం చుట్టలు, ఎర్రచీర – భయంకరంగా ఉంది.

"ఎందుకు ఏడుస్తోంది?" అడిగింది పద్మని.

"అమ్మ కావాలిట."

పొగాకు నములుతూ "కాసేపట్లో ఓ అమ్మ వస్తుంది ఈ గదిలోకి" అన్నది నవ్వుతూ.

"ఎవరా అమ్మ?" అడిగింది పద్మ.

ఆ స్త్రీ పెదిమ విరిచి "నాకు తెలియదు. ఊరికే గొడవ చెయ్యకండి. అయ్యగారు పక్క గదిలో ఉన్నారు" అని తలుపు మూసి వెళ్ళిపోయింది.

కాపలాకి పెట్టిన ఆ స్త్రీని చూస్తే పద్మప్రియకి ఎందుకో భయం. తననేమీ చెయ్యలేదు. ఎప్పుడూ కసరనైనా కసరలేదు. కానీ ఆ మొహం చూస్తే ఆమెకి వణుకు పుట్టుకొస్తుంది. రాధ గుక్క పెట్టి ఏడుస్తుంది.

అతను ఇంకెవర్నో ఎత్తుకువచ్చాడన్నమాట. ఇందర్ని ఇలా ఎత్తుకువస్తూ ఉంటే పోలీసులు, ఆ డిటెక్టివ్ యుగంధరూ యేం చేస్తున్నారు అనుకుంది పద్మ.

అంతలో మళ్ళీ తలుపు తెరుచుకుంది.

"వెళ్ళు. ఊ! లోపలికి వెళ్ళు" అరిచింది ఆ భయంకరమైన స్త్రీ. ఎవరో ఒక తోపు తోసినట్లు ఓ యువతి గదిలోకి వచ్చి పడ్డది. వెంటనే తలుపు మూసుకుంది. ఆమె తల పైకెత్తి పద్మప్రియనీ, రాధనీ చూసింది.

విరబోసుకున్న జుట్టు, ఎర్రగా ఉన్న కళ్ళు, చెంపల మీదినుంచి రక్తం సన్న ధారగా కారుతోంది. కణత మీద రక్తం చుక్కలు. గజగజ వొణుకుతోంది.

పద్మప్రియ ఒక గంతులో ఆ యువతిని సమీపించి "ఎవరమ్మా మీరు? ఏమైంది? ఆ గాయాలు యేమిటి?" అడిగింది ఆప్యాయంగా.

పద్మ అలా అడగ్గానే ఆమెకి దుఃఖం పొంగి వచ్చింది. పది నిమిషాల తర్వాత దుఃఖం దిగమింగి చెప్పడం ప్రారంభించింది.

తన పేరు మీనాక్షి. తండ్రి యింటికి వెళ్ళాలని బయలుదేరి బస్టాప్ దగ్గిర నిలబడింది. బస్ ఎంతసేపటికీ రాలేదు. టాక్సీ ఎక్కుదామనుకుంటుండగా తన ముందు ఓ కారు ఆగింది. తన భర్త చెయ్యి టేబుల్ ఫానులో పడిందనీ, ఆస్పత్రికి తీసుకువెళ్ళమని చెప్పి మేనేజర్ కారు పంపాడనీ ఆ కారు డ్రయివర్ చెప్పాడు. తను వెంటనే ఆ కారు ఎక్కింది. ఆ సమయంలో బస్టాప్ దగ్గిర ఇంకెవరూ లేరు. వీధిలో కూడా దరిదాపుల జనం లేరు. కారు జనరల్ ఆస్పత్రి వేపు తిప్పలేదు అతను. ఇటు వెళుతున్నావేం అని అడిగింది తను. అతను జవాబు చెప్పకుండా వెనక్కి తిరిగి తన తల మీద గట్టిగా కొట్టాడు. దేంతో కొట్టాడో గాని వెంటనే తనకి స్పృహ పోయింది. స్పృహ వచ్చిన తర్వాత చూస్తే ఒక గదిలో ఉంది. అంతవరకూ చెప్పి మీనాక్షి యేడ్వడం మొదలు పెట్టింది.

"యేడవకండి. ప్రయోజనమేమున్నది! తరవాత ఏం జరిగింది? ఈ గాయాలు ఎట్లా తగిలాయి?" అడిగింది పద్మప్రియ.

"నాకు స్పృహ వచ్చేటప్పటికి నా యెదుట ఇంతకు ముందు ఇక్కడికి వచ్చిన మనిషి కూర్చుని ఉంది. యెక్కడున్నానని అడిగాను. అది జవాబు చెప్పకుండా గదిలోంచి వెళ్ళిపోయింది. అది వెళ్ళిన అయిదు నిమిషాలకి ఓ మనిషి గదిలోకి వచ్చాడు. చాలా శుభ్రంగా ఉన్న ఖరీదయిన బట్టలు వేసుకున్నాడు. ఇంగ్లీషులో బాగా మాట్లాడాడు. అతని ముఖంలో ఏ కోశానా దయాదాక్షిణ్యాలు అనేవి లేవు. చాలా క్రూరంగా ఉంది. నువ్వు ఎవరు? నన్ను ఎందుకు ఎత్తుకొచ్చావు? అని అడిగాను. తనెవరో చెప్పలేదు. కాని అతని కంఠస్వరం ఎప్పుడో ఎక్కడో విన్న కంఠస్వరంలా ఉంది. నాకెదురుగా కూర్చుని కోర్టులో లాయరు ప్రశ్నించినట్లు ప్రశ్నించాడు."

"ఏం విషయం?" అడిగింది పద్మప్రియ.

"ఓ హత్య గురించి."

"ఎవరి హత్య? ఆ హత్య గురించి నీకు ఏం తెలుసు?"

పద్మ ఆ ప్రశ్న అడగగానే మీనాక్షి కొంచెం అనుమానంగా చూసింది. "నువ్వు కూడా అతని మనిషివేనా! ఈ సానుభూతి, ఆపేక్ష అంతా నాటకమా?" అడిగింది.

"నన్నూ, ఈ రాధనీ కూడా నిన్ను ఎత్తుకొచ్చినట్లే ఎత్తుకువచ్చి ఈ గదిలో బంధించాడు."

"నిజమేనా?"

"అవును."

"మరి నీ మొహానికి గాయాలేమీ లేవే!"

"ఏమో! ఇంతవరకు మా జోలికి రాలేదు. కావలసినవన్నీ పంపిస్తున్నాడు. స్వేచ్ఛ లేకుండా బంధించాడని కాని ఇంటికీ ఇక్కడికీ ఏమీ తేడా లేకుండా చూస్తున్నాడు. ఒకటి రెండుసార్లు అతను ఇక్కడికి వచ్చి అన్నీ సరిగా అందుతున్నాయా, ఏం ఇబ్బంది లేకుండా సౌకర్యంగా ఉందా అని అడిగాడు. నాకు అతను క్రూరంగా కనిపించలేదు. కాని నేను విన్న విషయాలని బట్టి అతనో హంతకుడని తెలిసింది."

మీనాక్షికి పద్మప్రియ మీద అనుమానం పోలేదు. మౌనంగా ఉండిపోయింది.

"ఈ గాయాలు అతనే చేశాడన్నమాట" అన్నది పద్మ.

మీనాక్షి తల ఊపింది.

"హింసించాడా?" అడిగింది పద్మ.

తల ఊపింది మీనాక్షి.

"నేనడిగిన విషయం నీకు తెలియదా? తెలిసీ చెప్పదలచుకోలేదా?"

"నీకెందుకు ఆ విషయం?"

"ఇతను హంతకుడు. ఇప్పటికి ఒక హత్య చేశాడని నాకు తెలుసు. అందుకే అడిగాను."

"హత్యలు చేసే మనిషి అని మొహం చూస్తేనే తెలుస్తోంది."

"పోనీ చెప్పవద్దులే! ఆ గాయాలు తడిగుడ్డతో తుడుస్తానుండు" అని మీనాక్షిని నీళ్ళగదిలోకి తీసికెళ్ళింది పద్మ.

## 25

**రాజూ, సార్జంటు శివం** ఒక జట్టుగా బయలుదేరారు. అడయార్, మైలాపూర్, శాంథోమ్ ప్రాంతాల వాకబు చేస్తామన్నారు. మైలాపూర్ లో ప్రయివేటు టెలిఫోనులు ఉన్న ఇళ్ళన్నీ చూసారు. ఎవరినీ అనుమానించేందుకు కూడా ఎక్కడా ఆస్కారం లేకపోయింది. ఆ ఇళ్ళల్లో ఉన్నవాళ్ళు ఇచ్చిన సంజాయిషీ తృప్తిగా ఉంది. పక్కఇళ్ళల్లో వాకబు చేసి వాళ్ళ గత జీవితాలు దోషరహితంగా ఉన్నాయని తేల్చుకున్నారు. వీరభద్రరావు మైలాపూరులో లేడని నిర్ధారణ అయింది. తరవాత అడయారులో దర్యాప్తు ప్రారంభించారు. అడయారులో మైలాపూరు అంత సులభంగా పని కాలేదు. ఇళ్ళు దగ్గిర దగ్గిరగా లేవు. పెద్ద పెద్ద బంగాళాలు. విశాలమైన తోటలు. శ్రీమంతుల భవంతులు. పక్క ఇళ్ళల్లో విచారించితే ఏమీ చెప్పలేకపోయారు. ఒకళ్ళ జోలికి ఒకళ్ళు పోరు. ఒకరి విషయం ఇంకోరు పట్టించుకోరు. ఎవరి సంగతి వాళ్ళది. అందుకని తిన్నగా ఇంట్లోకి వెళ్ళి యింటి యజమానులని చూసి అడుగుతున్నారు.

"ఎకనామికల్, స్టాటిస్టిక్స్ బ్యూరో నించి వచ్చాము. ప్రభుత్వం ప్రజల గురించి కొన్ని వివరాలు సేకరించడానికి ప్రయత్నిస్తోంది" అని ప్రారంభించి ప్రశ్నలు అడుగుతున్నారు.

ఓ ఇంటిముందు ఓ పక్క 'కాంతి' అన్న బోర్డు ఉన్నది. ఇంకో పక్క కే. సుందరేశ్వరరావు అన్న బోర్డు ఉంది. గేటు నించి ఇంటికి దాదాపు అర ఫర్లాంగు దూరం. విశాలమైన తోట, గుబురుగా ఉన్న చెట్లు, అందంగా పూసిన పూలమొక్కలు, పోర్టికోలో తళ తళ మెరుస్తున్న సరికొత్త అంబాసిడరు కారు.

రాజు కాలింగు బెల్ నొక్కాడు.

ఏభై సంవత్సరాల వృద్ధురాలు వచ్చి తలుపు తెరిచింది. మనిషిని చూస్తే దాసీదని తెలుస్తోంది.

"అయ్యగారున్నారా?"

"ఎవరు మీరు?"

"గవర్నమెంటు ఉద్యోగులం."

చెపుతానని ఆ మనిషి వెళ్ళిపోయింది. రాజూ, శివం వసారాలో నిలబడ్డారు. సార్జంటు శివం యూనిఫారంలో లేడు.

అయిదు నిమిషాల తర్వాత ఒకాయన వచ్చి "యస్ కమిన్" అన్నాడు.

"మేము స్టాటిస్టిక్స్ బ్యూరో నించి వస్తున్నాం" అని పుస్తకం తెరుస్తూ "కొన్ని విషయాలు అడగాలి" అన్నాడు రాజు.

"అడగండి" అన్నాడు ఆయన చిన్నగా నవ్వుతూ.

అతనికి యాభై ఏళ్ళకు పైగా ఉంటాయి. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. సన్నగా ఉన్నా బలహీనుడు కాడు. చామనచాయ. అమెరికన్ ఫ్రేము కళ్ళద్దాలు, షార్కు స్కిన్ సూటు. వేలికి ఉంగరం. బంగారు గొలుసు. చేతి గడియారం.

"మీ పేరు?"

"సుందరేశ్వరరావు"

"ఉద్యోగం?"

"ప్రొప్రయిటర్, ఇండియా కెమికల్స్ ఎక్స్పోర్టర్సు, ఫస్టు లైను బీచి, నెంబరు 979."

"మీ వయస్సు?"

"యాభై నాలుగు."

"మీ ఇంట్లో ఎంతమంది ఉన్నారు?"

"నా భార్య పోయింది. పిల్లలు లేరు. నేనూ, పనిమనిషి."

"ఇంకా నౌఖర్లున్నారా?"

"లేరు. తోటపని చూడడానికి పక్కయింటి తోటమాలి రెండు రోజులకొకసారి వస్తాడు."

"మీ ఆదాయం?"

అతను నవ్వి "నిజంగా మీరు స్టాటిస్టిక్స్ బ్యూరో వాళ్ళేనా లేక ఇన్ కంటాక్సు వాళ్ళా?" అడిగాడు.

"మా కార్డు చూడవచ్చు" అని రాజు జేబులో చెయ్యి పెట్టాడు.

"నొ. నొ. తమాషాకి అన్నాను. దటీజ్ ఆల్ రైట్! పోయిన సంవత్సరం ఖర్చులన్నీ పోగా నికర ఆదాయం పధ్నాలుగు వేలు వచ్చింది."

"అంతకుముందు సంవత్సరం?"

"యెనిమిది వేలు."

"మీరు వ్యాపారం ప్రారంభించి ఎంత కాలమైంది?"

"రెండేళ్ళు."

"ఈ ఇల్లు మీరు కట్టించారా, కొన్నారా?"

"కొన్నాను."

"ఎంతకాలం అయింది?"

"ఏడాదిన్నర అయింది."

"ఎంతకి కొన్నారు?"

"లక్షా యాభై వేలకి."

"మీ ఇల్లు లోపలంతా చూడవచ్చా?"

"స్టాటిస్టిక్స్ కీ నా ఇంటికీ సంబంధం ఏమిటి?"

"ఏ ఇంటికి ఎన్ని గదులున్నదీ కూడా తెలుసుకోమన్నారు మా పై అధికారులు" అన్నాడు రాజు నవ్వుతూ.

ఆయన ఓ నిమిషం పాటు ఆలోచించి "ఆల్ రైట్! పదండి" అన్నాడు.

ఆయన ముందు, వెనక రాజు, తర్వాత సార్జంటు శివం హాలు దాటి ఓ పెద్ద గదిలోకి వెళ్ళారు. డైనింగ్ టేబుల్, కుర్చీలు, ఫ్రిజిడేర్ – అది వంట ఇల్లు. ఎడమ వైపు కొట్టు గది. దాని వెనక నీళ్ళగది, వసారా. ఒక్కొక్క గదీ చూసుకుంటూ రాజు కాయితం మీద రాసుకుంటున్నాడు.

"మేడ?" అడిగాడు శివం.

"రండి, వెళదాం" అని మళ్ళీ హాల్లోకి దారి తీసి మేడమెట్లు ఎక్కాడు ఆ ఇంటి యజమాని. రాజు, సార్జంటు శివం ఆయన వెనకే మేడమెట్లు ఎక్కారు.

"ఇది నా పడక గది" అన్నాడు అతను ఒక గది తలుపు తీసి.

అది ఏర్ కండీషన్డ్ గది. మధ్య పెద్ద మంచం. కింద తివాచీ.

"అది అతిథుల గది" అని ఇంకో గది తలుపు తెరిచాడు ఆయన.

రాజు, సార్జంటు ఆ గదిలోకి వెళ్ళారు. కీచుమన్నది ఎక్కడో. చిన్న నవ్వు వినిపించింది. రాజు చటుక్కున వెనక్కి తిరిగాడు. తలుపు మూసుకున్నది. ఒక్క గంతులో తలుపు దగ్గరికి వెళ్ళి లాగాడు. రాలేదు. ఎగిరి రెండు కాళ్ళతో బలంగా తన్నాడు. కదలలేదు. ఇద్దరూ గదిలో బంధింపబడ్డారు. రాజు శివం వేపు చూశాడు.

"ఇతడు హంతకుడేమో అని అనుమానం కలిగిన తర్వాత దురుసుగా ఇలా లోపలికి వచ్చి ఉండకూడదు" అన్నాడు శివం.

"ఇంటి లోపల చూస్తే ఇతను హంతకుడో కాదో నిర్ధారణ అవుతుందనుకున్నాను."

"అయిందేదో అయింది. ఇప్పుడేం చెయ్యాలి అని ఆలోచించాలి మనం."

"గది సౌండ్ ప్రూఫ్. ఉక్కు తలుపులు. కిటికీలు చాలా ఎత్తుగా ఉన్నాయి. దగ్గిరదగ్గిరగా ఊచలు. తప్పించుకు బయటపడటం చాలా కష్టం" అన్నాడు రాజు.

అంతలో "దయచేసి మీరిద్దరూ జేబుల్లో ఉన్న వస్తువులన్నీ తీసి బల్ల మీద పెట్టండి" అన్న మాటలు వినిపించాయి.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. ఎక్కణ్ణించి మాట్లాడుతున్నాడు! మాయ తలుపు ఏమైనా ఉందా అనుకుంటూ రాజు చుట్టూ చూశాడు.

"దయచేసి చెప్పినట్లు చేయండి."

లౌడ్ స్పీకర్లోంచి ఆ మాటలు వినిపిస్తున్నాయని రాజు గ్రహించాడు.

"ఏమిటిది! మమ్మల్ని ఎందుకిట్లా బంధించారు? మేము ప్రభుత్వోద్యోగులం. ఇది నేరం." అన్నాడు రాజు.

నవ్వు వినిపించింది. "మీరు యుగంధర్ అసిస్టెంటు రాజు. అతను సార్జంటు శివం. అవునా! చెప్పినట్లు చెయ్యండి."

"చెయ్యకపోతే?"

"మంచిది కాదు" ఆ మాటతో ఢాం అని పేలుడు వినిపించింది. గుండు పక్కనించీ దూసుకుపోయి సోఫాలో గుచ్చుకుంది.

"ఇంకోసారి చెప్తున్నాను."

రాజు, శివం ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. మనీపర్సులు, పిస్తోళ్లు అన్నీ తీసి బల్ల మీద పెట్టారు.

"తర్వాత?" అడిగాడు రాజు.

"మీ మంచి కోసమే అవన్నీ ఇచ్చేయమన్నాను రాజూ! మా మనిషి భోజనం తెచ్చి పెడుతుంది. ఆ మనిషిని మోసం చేసి తప్పించుకునేందుకు ఆలోచించకండి. చాలా ప్రమాదం. ఇంకో విషయం. నా చేతిలో చిక్కానని యుగంధర్ కి ఉత్తరం రాయి. బల్ల సొరుగులో కాయితాలు, కలం ఉన్నాయి."

26

"మీరు వచ్చిన పని సులభంగానే అయిపోయింది. గుడ్!" అన్నాడు బొంబాయి పోలీసు కమీషనర్ యుగంధర్ తో.

"ఆ పేరుతోనే మద్రాసులో ఉంటున్నాడో పేరు మళ్ళీ మార్చుకున్నాడో తెలియదు. ఈ ఫోటో దొరికింది. అంతవరకూ నయం."

"ఇక ఆ మనిషిని పట్టుకోవడం కష్టం కాదనుకుంటాను. విష్ యూ గుడ్ లక్."

కమీషనర్ కి షేక్ హాండ్ ఇచ్చి యుగంధర్ విమానం ఎక్కాడు.

ఏర్ పోర్టులోనూ, కస్టమ్స్ ఆఫీసు లోనూ వాకబు చేసి వీరభద్రరావు ఏ పేరుతో విదేశం నించీ విమానంలో దిగిందీ తెలుసుకునేందుకు ఓ రోజంతా పట్టింది. అతని పాస్పోర్టులో ఏదో చిన్న లోపం ఒకటి కనిపించడం వల్ల కస్టమ్సు వాళ్ళు పాస్పోర్ట్ తీసుకుని తర్వాత పంపిస్తామని చెప్పారు. పేరు శ్రీరంగనారాయణ అని పూనా నగర వాస్తవ్యుడని పాస్పోర్టు వల్ల తెలిసింది. వెంటనే యుగంధర్ ఈ వివరాలు పూనా పోలీసులకు తెలియజేసి శ్రీరంగనారాయణ పూనాలో ఎక్కడున్నదీ వాకబు చేయించాడు.

శ్రీరంగనారాయణ అనే పేరు పాస్పోర్టులో ఉన్నది కానీ, పాస్పోర్టులో ఉన్న ఫోటోతో పోలిస్తే వివరాలన్నీ వీరభద్రరావుకి సరిపోదు. యుగంధర్ ఆ విషయం పట్టించుకోక మద్రాసుకి బయలుదేరాడు. కారు తీసుకుని ఏర్ పోర్టుకి రమ్మని రాజుకి మెస్సేజ్ పంపించాడు. విమానంలోంచి యుగంధర్ మీనంబాకంలో దిగగానే రాజు కనపడలేదు. పోలీస్ కమీషనర్, ఏ.సి ఎదురయ్యారు.

"మీరెందుకు వచ్చారు? రాజు ఏడీ? ఇంకో హత్య జరిగిందా?" అడిగాడు యుగంధర్.

"రండి! ఆఫీసుకి వెళ్లి మాట్లాడుకుందాం" అన్నాడు కమీషనర్. వాన్ కదలగానే ఆనాటి దినపత్రిక యుగంధర్ కి ఇచ్చాడు.

"ఎర్రగుర్తు హంతకుడు __ బెదిరింపు" అన్న శీర్షిక కనిపించింది పత్రిక తెరవగానే. యుగంధర్ చదవడం ప్రారంభించాడు.

"ఈ మధ్య చంపుతానని బెదిరిస్తూ ఎర్రగుర్తు ఉత్తరాలు కొంతమందికి వచ్చాయి. పోలీసు సూపరింటెండెంటు మాధవన్, ప్రాసిక్యూటర్ గోవిందస్వామి హత్య చెయ్యబడ్డారు. భుజంగరావు మనుమరాలు పద్మప్రియనీ (20 సం.), మాధవన్ మనవరాలు రాధనీ (4 సం.) ఎత్తుకుపోయి రెండు రోజుల క్రితం మీనాక్షి అనే యువతిని హత్య చేసిన ఎర్రగుర్తు ఉత్తరాలు రాసే హంతకుడు మా కార్యాలయానికి ఒక ఉత్తరం వ్రాశాడు. దాన్ని యథాతథంగా ప్రచురిస్తున్నాము.

__ సం.

"మద్రాసు నగర పౌరులారా! పాఠకులారా! నేను ఈ నగరంలో ప్రాక్టీసు చేసిన ఒక లాయర్ని. చాలాకాలం క్రితం, జరిగిన విషయం ఇది. నాకు ఒక్కడే కొడుకు. అతని పేరు శిరీష్. మీనాక్షి అనే యువతిని నా కొడుకు ప్రేమించాడు. ఆ మీనాక్షికి శేషాద్రి అనే ఇంకో స్నేహితుడు ఉండేవాడు. అతనూ మీనాక్షిని ప్రేమించాడు. వాళ్ళిద్దర్లో ఎవరిని వివాహం చేసుకోవడమా అని సందిగ్ధంలో పడింది మీనాక్షి. మీనాక్షి చివరికి శేషాద్రినే వివాహం చేసుకోవడానికే నిశ్చయించుకుంది. ఒక రాత్రి శేషాద్రి గదికి మీనాక్షి వెళ్లి కొంతసేపుండి ఇంటికి వెళ్ళిపోయింది. శేషాద్రితో మాట్లాడటానికీ, ఆ మీనాక్షిని పెళ్లి చేసుకోవద్దనీ అతను ఆమెను సుఖపెట్టలేడనీ చెప్పడానికి నా కొడుకు ఆ శేషాద్రి గదికి వెళ్ళాడు. అప్పటికే శేషాద్రి హత్య చేయబడ్డాడు. పోలీసులు నా కొడుకు శిరీష్ మీద హత్య కేసు పెట్టారు. సూచనాపూర్వకమైన సాక్ష్యం మాత్రమే ప్రవేశపెట్టారు. ప్రత్యక్ష సాక్ష్యం కానీ, నా కొడుకు శిరీషే హంతకుడు అని నిర్ధారణగా తెలిపే మరే ఇతర సాక్ష్యం లేదు. శిరీష్ కి యావజ్జీవ శిక్ష విధించారు. నా కొడుకు హంతకుడు కాదు. అపుడు మెడిసిన్ చదువుతున్నాడు. అన్యాయంగా జైలుకి పంపించారు అధికారులు. శిరీష్ ని జైల్లోంచి విడిపించాలని, రెండేళ్ళుగా ప్రయాసపడుతున్నాను. ఇపుడు ఉన్న విషయం ప్రజలకి చెప్పడం మంచిదని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

పోలీసులని భయపెట్టి, ప్రభుత్వాన్ని హడలగొట్టి నా కొడుకుని విడిచిపెట్టేలా చెయ్యాలని ఇంతవరకు రెండు హత్యలు చేశాను. ఇంకా ఎంతమందినో హత్య చెయ్యడానికి పథకాలు తయారు చేశాను. నా కొడుకుని విడిచిపెడితే ఈ హత్యాకాండ మానేస్తానని యుగంధర్ ద్వారా ప్రభుత్వానికి కబురు పంపాను. కాని ప్రయోజనం లేకపోయింది. కనుక ఇప్పుడు ప్రజలే పూనుకుని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసి నా కొడుకుని విడిచిపెట్టేలా చెయ్యాలి. లేకపోతే ఈ హత్యాకాండ ఆగదు. అమాయకులను కూడా వరుసగా హత్య చేయవలసి వస్తుంది. వీళ్ళను హత్య చెయ్యవచ్చు, వీళ్ళను చెయ్యకూడదు అనే విచక్షణ లేదు నాకు. నా చేతికి చిక్కిన ఏ వ్యక్తినైనా హత్య చేస్తాను. నా కొడుకుని విడుదల చేసేవరకూ దారుణమైన ఈ ఘోర హత్యాకాండ సాగుతూనే ఉంటుంది.

ఎర్రని గుర్తు."

యుగంధర్ పత్రిక మడిచి కమీషనర్ కిచ్చి "జనం ఏమంటున్నారు?" అడిగాడు.

"చాలా భయపడుతున్నారు. ఎవరికెప్పుడు మూడుతుందోనని హడిలిపోతున్నారు."

"ఎవరూ పిల్లల్ని స్కూళ్ళకి పంపడం లేదు. చిన్నపిల్లల స్కూళ్ళు, ఆడపిల్లల కాలేజీలు మూసేశారు. సినిమాలకి కూడా ఆడవాళ్ళు, పిల్లలు వెళ్ళడం లేదు. ఇళ్ళలోంచి బయటికి రాకుండా తలుపులు గడియ పెట్టుకుని కూర్చుంటున్నారు" చెప్పాడు ఏ.సి.

యుగంధర్ తల ఊపి "అవును. పోలీసులని భయపెట్టడం కోసం ఏ పాపమూ ఎరుగని అమాయకులను కూడా చంపుతాననే మనిషి ఉంటే భయపడరూ! అధికారులు ఏమంటున్నారు?" అడిగాడు.

"నిన్న మళ్ళీ మంత్రులు సమావేశమయ్యారు. ముందు ఆ శిరీష్ ని వదిలిపెట్టి ఈ హత్యాకాండ ఆపితే తర్వాత హంతకుడిని పట్టుకోవడం గురించి ఆలోచించుకోవచ్చు అంటున్నారు. మీరు వచ్చేవరకు ఏ నిర్ణయమూ చెయ్యదలచుకోలేదు."

"పత్రికలో ఈ ఉత్తరం చదివాక పెద్ద పెద్దవాళ్ళంతా గవర్నర్ మీదా, ప్రభుత్వం మీదా ఒత్తిడి తీసుకువచ్చి ఉంటారు."

"ఎవరో ఎందుకు! రిటయిర్డ్ జడ్జి భుజంగరావే గవర్నర్ని కలుసుకుని శిరీష్ ని వదిలిపెట్టమని ప్రాధేయపడ్డాడు."

"ఆ విషయం నాకు తెలుసు. ఇంతకీ రాజు ఏడీ? అతని దర్యాప్తు ఎంతవరకు వచ్చింది?" అడిగాడు యుగంధర్.

రాజు విషయం అడగ్గానే కమీషనర్ మొహం వాడిపోయింది. రెండు నిమిషాలు మౌనంగా ఉండి "ఏమైనదీ నాకు తెలియలేదు" అన్నాడు.

"అంటే రాజు మీ డిపార్టుమెంటు సహాయంతోనేగా దర్యాప్తు చేస్తున్నాడు."

"అవును. రాజు, సార్జంటు శివం ఒక జట్టుగా బయలుదేరి దర్యాప్తు ప్రారంభించారు. నిన్నటినుంచీ వాళ్ళిద్దరూ కనిపించడం లేదు."

యుగంధర్ కనుబొమలు ముడిచి "ఏ పేటల్లో, ఏ ప్రాంతాల్లో దర్యాప్తు చేయదలచినదీ ఎవరికీ చెప్పలేదా?" అడిగాడు.

"అడయార్, శాంథోమ్, మైలాపూర్లలో దర్యాప్తు చేస్తామన్నారు."

"ఎవరి ఎవరి ఇళ్ళకి వెళ్లిందీ, ఏ ప్రాంతాల దర్యాప్తు చేసినదీ తెలియలేదా?"

"ఆ విషయం స్వరాజ్యరావు దర్యాప్తు చేస్తున్నాడు" అని "మీరు వెళ్ళిన పని ఏమైంది?" అడిగాడు కమీషనర్.

యుగంధర్ ఓ ఫోటో జేబులోంచి తీసి చూపించి "ఇది వీరభద్రరావు ఫోటో అనుకుంటున్నాను" అన్నాడు.

కమీషనర్ ఫోటో పరీక్షగా చూశాడు. "లాయర్ వీరభద్రరావుకీ, ఈ ఫోటోలో మనిషికీ ఎక్కడా పోలిక లేదే!" అన్నాడు.

"అవును. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాడు. ఒడ్డు, పొడుగు, బరువు మొదలైనవి సరిగా సరిపోతున్నాయి."

"అయితే ఈ ఫోటోకి కాపీలు తీయించి అన్ని పోలీస్ స్టేషన్లలో బస్సులలో, రైల్వే స్టేషన్లలో అంటించి పట్టుకున్నవాళ్లకి బహుమతి ప్రకటిద్దాం."

"ఒద్దు. అనుమానం కలిగి పారిపోతాడు."

"అయితే ఏం చేద్దాం?"

"ముందు రాజు విషయం కనుక్కోవాలి. నాకు చాలా ఆదుర్దాగా ఉంది. ఖర్మ చాలక వీరభద్రరావు ఇంటికే వెళ్ళారేమో!"

"సార్జంటు శివం కూడా ఉన్నాడుగా!"

"ఇద్దర్నీ బందీలు చేశాడేమో! లేక...." అని చెప్పలేక ఊరుకున్నాడు యుగంధర్.

ఏమనడానికి కమీషనర్ కి నోరాడలేదు.

అంతలో వాన్ యుగంధర్ ఇంటి ముందు ఆగింది. యుగంధర్ తో బాటు కమీషనరూ వాను దిగి లోపాలకి వెళ్ళాడు. నౌఖరు హడావిడిగా వచ్చి "చిన్నయ్య గారు అంతు లేరండీ!" అన్నాడు.

యుగంధర్ బల్ల దగ్గరికి వెళ్ళాడు. బల్ల మీద ఉత్తరాలున్నాయి. దబదబ కవర్ల మీది దస్తూరి చూశాడు. ఒకదాని మీద రాజు దస్తూరి కనిపించింది. ఆత్రంగా కవరు చింపాడు.

"నేను క్షేమంగా ఉన్నాను ఇప్పటివరకూ. సార్జంటు శివమూ నాతో ఉన్నాడు. వీరభద్రరావు షరతులకి ఒప్పుకోండి. లేకపోతే మా ఇద్దరి ప్రాణాలకూ ప్రమాదం.

రాజు."

అది రాజు దస్తూరే! సందేహం లేదు. కానీ రాజు తనకై తను ఆ ఉత్తరం రాసి ఉండడు. అలా ఎన్నటికీ రాయడు. ఒక హంతకుడికి లొంగిపోయి తన ప్రాణాలు కాపాడమని అడగడు. ఆ వీరభద్రరావు రాయించి ఉండాలి. అందుకే రాజు అని రాయడానికి బదులు రాజూ అని రాశాడు. ఉత్తరం కమీషనరుకి ఇచ్చి యుగంధర్ కవరు పరీక్ష చేశాడు. మౌంట్ రోడ్డు పోస్టాఫీసు ముద్ర ఉంది. వీరభద్రరావు ఇల్లు మౌంట్ రోడ్డుకి దరిదాపుల ఉండదనుకున్నాడు.

"చాలా చిక్కులో పడ్డాం" అన్నాడు కమీషనర్.

యుగంధర్ మొహం బిగుసుకుపోయింది. పళ్ళు కొరుకుతున్నాడు. "పదండి! స్వరాజ్యరావుని కలుసుకుని రాజు విషయం ఏమైనా తెలిసిందేమో కనుక్కుందాం" అన్నాడు.

27

**రాజు నవ్వి "అమాయకుల** మల్లే ఇలా బుట్టలో ఎలా పడ్డాం?" అన్నాడు సార్జంటు శివంతో.

శివం మొహం ముడుచుకుని "మీకు అనుమానం కలిగినప్పుడు మనం వెళ్ళిపోయి సెర్చి వారంటు తీసుకుని రావలసింది" అన్నాడు మందలింపుగా.

"మనం ఇక్కడికి రాగానే నాకు అనుమానం కలిగిందని అతను తెలుసుకునుంటాడు. మనని వెళ్ళనిచ్చేవాడు కాదు అవసరమైతే షూట్ చేసేవాడు" అని రాజు తలుపూ, కిటికీలూ పరీక్షగా చూశాడు. అది సౌండ్ ప్రూఫ్ గది. ఒకే తలుపున్నది. కిటికీలు చాలా ఎత్తుగా ఉన్నాయి.

"మనకి భోజనం పంపుతాడో పంపడో!" అన్నాడు.

"ఇప్పుడు మీకు అదా బెంగ?" అడిగాడు శివం.

రాజు నవ్వి నోటి మీద వేలు పెట్టి చూపిస్తూ శివం దగ్గరికి వెళ్ళి చెవిలో "ఈ గదిలో మైక్రోఫోను పెట్టి ఉంటాడు" అని చెప్పి "చాలా ఆకలిగా ఉంది" అన్నాడు పెద్దగా.

"అవును. నాకూ ఆకలేస్తోంది" అన్నాడు శివం.

అయిదు నిమిషాల తర్వాత చప్పుడు చెయ్యకుండా తలుపు తెరుచుకుంది. అవతల చీకటి. రాజు అడుగు ముందుకి వేసేలోగా గదిలోకి రెండు ట్రేలు వచ్చాయి. వెంటనే తలుపు మూసుకుంది. ట్రేల్లో భోజనం ఉంది.

రాజు నవ్వి మైక్రోఫోను ఉన్నదన్న నా అనుమానం ధృఢపడ్డది అని తెలుపుతూ తల ఊపాడు. శివం చేతిని పట్టుకుని 'ఇక్కణ్ణించి బయటపడే విధం ఆలోచించాలి' అని శివం అరిచేతిలో రాశాడు.

శివం తల ఊపాడు.

●●●

బీచ్ రోడ్ మీద ఒక కారు ఆగి ఉంది. ఇద్దరు యువకులు ఆ కారు దగ్గర నిలబడ్డారు.

ఎక్కమని డ్రైవింగు సీటులో కూర్చున్న వీరభద్రరావు చెప్పగానే వాళ్ళిద్దరూ కారు ఎక్కి కూర్చున్నారు.

"నే చెప్పినట్లు చేశారా?" అడిగాడు అతను.

"ఆ! అడయారులో టెలిఫోనులు ఉన్న ఇళ్ళన్నిటికి అడిగాము. వాళ్ళ సంజాయిషీలు రాశాము. ఇవిగో కాయితాలు" అన్నారు వాళ్ళిద్దరూ.

అతను ఆ కాయితాలు తీసుకుని పరీక్షగా చూసి "గుడ్! ఇదిగో మీకిస్తానన్నది" అని రెండు వంద రూపాయల నోట్లు ఇచ్చాడు.

"థాంక్సు. వస్తాము. మళ్ళీ ఏదయినా__" అన్నారు వాళ్ళు.

"అవసరముంటే పిలుస్తాను" అని వీరభద్రరావు చెప్పగానే ఆ యువకులిద్దరూ తలుపు తెరిచి దిగి వెళ్ళిపోయారు.

అతను కారు స్టార్టు చేశాడు.

●●●

"అడయార్లో టెలిఫోనులు ఉన్న ఇళ్ళన్నిటికీ వెళ్ళారు వాళ్ళిద్దరూ" అన్నాడు ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు.

"మీరు టెలిఫోన్ చేసి ఆ ఇళ్ళవాళ్ళని అడిగారా?"

"అవును."

"వాళ్ళు వెళ్ళిన ఆఖరి ఇల్లు ఎవరిది?"

"అడయార్ గాంధీనగర్లో ఓ ఇంటికి వెళ్ళారు. ఇంటి యజమాని జనరల్ ఆస్పత్రిలో సర్జన్. పదేళ్ళ కిందట ఆ ఇల్లు కట్టించాడు. ఆయన్ని అనుమానించడానికి ఆస్కారం లేదు."

"అక్కణ్ణించి ఎక్కడికి వెళ్ళారు?"

"అడయార్లో వాళ్ళు వెళ్ళిన ఆఖరి ఇల్లు ఇదే. అక్కణ్ణించి శాంథోమ్ కి వెళ్ళారేమో!"

"శాంథోమ్ లో అడిగారా?"

"శాంథోమ్ లో ఎటునించి మొదలు పెట్టినది తెలియదు. అడయార్ వేపు ఉన్న కొన్ని ఇళ్ళకీ, మైలాపూర్ వేపు ఉన్న కొన్ని ఇళ్ళకీ ఫోన్ చేసి అడిగాము. ఆ ప్రాంతాలకి వాళ్ళు రాలేదుట."

యుగంధర్ సిగిరెట్ వెలిగించాడు. "అయితే వీరభద్రరావు ఇల్లు అడయార్ లోనే ఉండి ఉంటుంది" అన్నాడు.

"అలా ఎందుకనుకుంటున్నారు?" అడిగాడు స్వరాజ్యరావు.

"ఊహించాను. రాజుకీ, సార్జంటుకీ అడయార్ లో ఓ ఇంటి మీద అనుమానం కలిగి ఉంటుంది. ఆ ఇంటికి మళ్ళీ వెళ్ళి ఉంటారు. ఆ ఇంట్లో వీరభద్రరావు ఉండి ఉంటే వాళ్ళిద్దర్నీ బంధించి ఉంటాడు."

"అది ఏ ఇల్లో ఎట్లా తెలుస్తుంది?" అడిగాడు ఇన్స్పెక్టరు.

యుగంధర్ నవ్వి "రాజు ప్రారంభించిన దర్యాప్తు వృథా కాలేదు. అంతవరకూ తెలుస్తూనే ఉంది. కనుక రాజు దర్యాప్తు చేసిన పద్ధతిలోనే మనమూ దర్యాప్తు చెయ్యాలి" అన్నాడు.

"సరే, ఏర్పాటు చేస్తాను" అని స్వరాజ్యరావు లేచి నిలబడ్డాడు.

"ఏ ఏర్పాటూ వద్దు. మనమిద్దరం వెళదాము."

"రెండు మూడు జట్లు బయలుదేరితే త్వరగా పని అయిపోతుంది."

"పిట్ట భయపడి పారిపోవచ్చు. రండి, వెళదాం" అన్నాడు యుగంధర్.

## 28

"రా! అయ్యగారు పిలుస్తున్నారు" అన్నది పనిమనిషి.

మీనాక్షి బెదురుతూ పద్మప్రియ దగ్గరికి జరిగింది.

ఆ ముసిలిది నవ్వి "నువ్వు ఏ మూల నక్కి దాక్కున్నా ప్రయోజనం లేదు. రా!" అని ఒక అడుగు ముందుకు వేసింది.

మీనాక్షి ఏడుస్తోంది.

"ఎక్కడికి తీసుకువెళతావు?" అడిగింది పద్మప్రియ.

"అవతల గదిలోకి. అయ్యగారక్కడ ఉన్నారు."

"దేనికి?"

"ఈ అమ్మాయితో మాట్లాడాలిట. త్వరగా రా" అని మీనాక్షి చెయ్యి పట్టుకుని చరచర లాక్కెళ్ళింది ఆమె. పక్క గది తలుపు తెరిచి, మీనాక్షిని లోపలి తోసి తలుపు మూసేసింది.

"రా! ఇట్లారా?" అన్నాడతను.

మీనాక్షి గజగజ వణుకుతోంది.

"రా! అలా భయపడుతూ నిలుచుని ప్రయోజనం లేదు" అని మీనాక్షి చెయ్యి పట్టుకుని అవతల ఉన్న గదిలోకి లాక్కెళ్ళాడు." కుర్చీ చూపించి కూర్చోమన్నాడు. బల్ల మీదున్న టేప్ రికార్డర్ స్విచ్ ఆన్ చేసి, రికార్డింగ్ మీట నొక్కి మీనాక్షికి ఎదురుగా కూర్చున్నాడు.

"మీనాక్షీ! ఇప్పుడైనా నిజం చెప్పు" అన్నాడు. మీనాక్షి ఏడుస్తోంది.

"నిన్న నిన్ను పెట్టిన హింస కన్నా ఎక్కువ హింస పెడతాను ఇవాళ. ఉల్లిపాయ పొర వలిచినట్టు నీ చర్మం వొలుస్తాను. సూదులతో కళ్ళు పొడుస్తాను. నాలో జాలి అనేది ఏ కోశానా లేదు. జాగ్రత్త."

"నాకేం తెలియదు. నన్నెందుకు బాధిస్తారు?" అన్నది వెక్కి వెక్కి ఏడుస్తూ.

"నీ కళ్ళనీళ్ళకు కరిగే హృదయం కాదు ఇది. శేషాద్రి హత్య చెయ్యబడ్డ రాత్రి నువ్వు ఇంటికి ఎన్ని గంటలకి వెళ్ళావు? నిజం చెప్పు."

"తొమ్మిది గంటలకి."

"అబద్ధం. నిజం చెప్పు" అని దబ్బనంతో ఆమె చెంప మీద పొడిచాడు.

మీనాక్షి కెవ్వుమని కేక పెట్టింది.

"శేషాద్రిని ఎవరు హత్య చేశారు? చెప్పు" అంటూ అగ్గిపుల్ల గీసి మీనాక్షి గెడ్డం దగ్గిర పెట్టాడు.

మీనాక్షి కేక పెట్టింది.

"నువ్వు ఎంత అరిచినా లాభం లేదు, చెప్పు."

"నాకేం తెలియదు. మీరు నన్ను ఎంత బాధపెట్టినా, ఎంత హింసించినా ప్రయోజనం లేదు."

అతను విరగబడి నవ్వి " మీనాక్షీ! నిన్ను ఎత్తుకు వచ్చేటప్పుడు శేషాద్రి హత్య గురించి నీకు తెలుసుననీ, దాస్తున్నావనీ నేను అనుకోలేదు. నిన్ను చంపడానికి ఎత్తుకు వచ్చాను. నీకు క్లోరోఫాం ఇచ్చినప్పుడు స్పృహ వచ్చే ముందు చాలాసేపు ఏదో గొణిగావు. అప్పుడు తెలిసింది" అన్నాడు.

"ఏం గొణిగాను?"

"ముందు నువ్వు నిజం చెప్పు."

మీనాక్షి గుటకలు మింగుతూ ఆలోచిస్తోంది.

అంతలో పనిమనిషి వచ్చి ఎవరో వచ్చారని చెప్పింది.

"ఎవరు?"

"గవర్నమెంటు ఉద్యోగులు."

"దేనికి?

"చెప్పలేదు. మీతో మాట్లాడాలిట."

అతను లేచి "బాగా ఆలోచించు. ఇప్పుడే వస్తాను. నిజం చెప్పాలి" అని బల్ల సొరుగు లాగి పిస్తోలు తీసుకుని తూటాలు సరిగా ఉన్నాయేమో చూసుకుని బయటికి వెళ్ళాడు.

●●●

ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, డిటెక్టివ్ యుగంధర్ కారు ఎక్కారు. అది పోలీస్ కారని రాసి లేదు దాని మీద. టూవే రేడియో ఉంది దాంట్లో. అప్పటికి దాదాపు ఇరవై ఇళ్ళకి వెళ్ళి ఇంట్లో వాళ్ళనీ, పక్క ఇళ్ళలో వాళ్ళనీ ప్రశ్నించారు.

"ఇంకా జాబితాలో ఎన్ని ఇళ్ళున్నాయి?" ప్రశ్నించాడు యుగంధర్.

"అరవై రెండు."

"అంతేగా! సాయంకాలం అయేలోపు పూర్తి చేయవచ్చు."

స్వరాజ్యరావు తల ఊపి కారు స్టార్టు చేశాడు.

అంతలో రేడియోలో 'అటెన్షన్ ప్లీజ్' అన్న మాటలు వినిపించాయి. యుగంధరూ, స్వరాజ్యరావు చెవులు రిక్కించుకుని వింటున్నారు.

'కోయంబత్తూరు జైలు నుంచి తప్పించుకు పారిపోయిన శివరాం అనే ఖైదీని ఇవాళ పొద్దున్న పది గంట అప్పుడు తిండివనం రైలుస్టేషనులో రైల్వే పోలీసులు పట్టుకున్నారు.'

"హెడ్ క్వార్టర్సుని కాంటాక్టు చెయ్యండి ఇన్స్పెక్టర్" చెప్పాడు యుగంధర్.

"ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు స్పీకింగ్"అన్నాడు మైకులో.

"పోలీసు హెడ్ క్వార్టర్సు" అన్నమాట వినిపించగానే "ఎర్రగుర్తు కేసుకీ, శివరాంకీ సంబంధం ఏమైనా ఉన్నట్టు తెలిసిందేమో అడగండి" అన్నాడు యుగంధర్.

ఇన్స్పెక్టరు అడిగాడు. ఆ కేసుకీ, శివరాంకీ ఏమీ సంబంధం లేదని చెప్పారు రేడియోలో.

యుగంధర్ తల ఊపి "కేవలం కాకతాళీయం అన్నమాట. హత్యకేసుల్లో మనల్ని గందరగోళం పరచడానికి అప్పుడప్పుడు ఇటువంటి కాకతాళీయపు సంఘటనలు చిత్రంగా జరుగుతూ ఉంటాయి" అని "తరవాత ఇల్లు" అడిగాడు.

"ఇంటి పేరు కాంతి. ఇంటి యజమాని పేరు కె. సుందరేశ్వరరావు" చెప్పాడు స్వరాజ్యరావు.

"పదండి."

కారు గేటులోకి తిప్పి కొంత దూరం వెళ్ళి పోర్టికోలో ఆపాడు ఇన్స్పెక్టరు.

కాలింగ్ బెల్ నొక్కగానే పనిమనిషి వచ్చి తలుపు తీసి ఎవరు కావాలని అడిగింది.

"సుందరేశ్వరరావు గారు."

"అయ్యగారు చాలా పనిలో ఉన్నారు."

"అయినా తప్పదు. పిలు."

"కోప్పడతారు."

"గవర్నమెంటు ఉద్యోగులం. నువ్వు వెళ్ళి చెప్పకపోతే మేమే వెళ్ళి కలుసుకుంటాము."

"ఒద్దు. పిలుస్తానుండండి" అని వెళ్ళిపోయింది ఆ పనిమనిషి.

మెట్ల మీద చప్పుడయింది. ఇన్స్పెక్టరు, యుగంధరూ అటు తిరిగి చూశారు. ఎవరూ లేరు. అయిదు నిమిషాలు దాటింది. ఇన్స్పెక్టరు అసహనంతో బూడ్సు కాళ్ళు టకటకమనిపించాడు.

ఇంతలో ఆ ముసలి పనిమనిషి మెట్లు దిగి వచ్చి "అయ్యగారు మిమ్మల్ని మేడ మీదకి రమ్మంటున్నారు" అన్నది.

ఇద్దరూ ఆ ముసలిదాని వెనకే వెళ్ళారు. మెట్లు ఎక్కాక కుడివైపుకి తీసుకెళ్ళింది.

యుగంధర్ కి ఏదో అనుమానం కలిగి "మీ అయ్యగారు ఏం చేస్తున్నారు?" అడిగాడు.

"రాసుకుంటున్నారు" అని ఓ గది తలుపు తెరిచి "వెళ్ళండి" అన్నది.

యుగంధర్ కి అనుమానం ఎక్కువైంది. పిస్తోలు తీసి చేతిలో తయారుగా పట్టుకుని గదిలో అడుగుపెట్టాడు. వెనకే ఇన్స్పెక్టరు గదిలోకి వెళ్ళాడు. చిన్న చప్పుడు వినిపించి ఇద్దరూ వెనక్కి తిరిగారు. తలుపు మూసుకుంది.

# 29

"మీరు బోనులో పులిలా తిరుగుతూ తీవ్రంగా ఆలోచించి ప్రయోజనం ఏమీ లేదు" అన్నాడు రాజు సార్జంటు శివంతో.

శివం కాలుస్తున్న సిగిరెట్ కింద పారేసి "మనల్ని అతను చంపేవరకూ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటామా?" అన్నాడు.

"చంపుతాడనుకోను. తన షరతులు అధికారులు ఒప్పుకునేటంత వరకూ మనల్ని బందీలుగా ఉంచుతాడు."

"నేను ఊరికే కూర్చోలేను."

"ఏం చేద్దాం?"

"తలుపు బద్దలు కొట్టేందుకు ప్రయత్నిద్దాం."

"ఉక్కు తలుపు. సాధ్యం కాదనుకుంటాను."

"ప్రయత్నించి చూద్దాం" అని సార్జంటు తలుపు వేపు తిరిగాడు. రాజు, శివం కలిసి తలుపుని భుజాలతో బలంగా తోశారు. కదలలేదు. దూరంగా వెళ్ళి పరుగున వచ్చి కాళ్ళతో గట్టిగా తన్నారు. బ్రహ్మాండమైన చప్పుడైంది కానీ అంగుళమైనా కదలలేదు.

"మిస్టర్ రాజూ! చిన్నపిల్లల్లాగా ఊరికే గొడవ చెయ్యకండి. మీరు ఎంత తంటాలు పడ్డా తలుపు అరంగుళమైనా కదలదు. అనవసరంగా గొడవ చేస్తే మీకే మంచిది కాదు. ప్రమాదం" అన్న మాటలు వినిపించాయి.

రాజు, సార్జంటు ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నారు.

"మనల్ని ఎక్కడినుంచి చూస్తున్నాడు?" అడిగాడు సార్జంటు.

నవ్వు వినపడింది. "చూడటం లేదు. చాలా సెన్సిటివ్ మైక్ ఉంది. మీరు ఎంత నెమ్మదిగా మాట్లాడినా, ఎంత చిన్న చప్పుడు చేసినా నాకు వినపడుతుంది."

"మాకు దాహం వేస్తోంది" అన్నాడు రాజు.

"గదిలో మంచినీళ్ళు లేవూ?"

"లేవు."

"పంపిస్తాను. మంచిగా ఉండి ఏమైనా కావలిస్తే అడగండి."

తలుపు మూసుకోవడం చూసి ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు ఒక్క ఉరుకు ఉరికి రెండు చేతులతో, రెండు కాళ్ళతో తలుపుని బలంగా తోశాడు. కొంచెమైనా కదలలేదు. "ఇది ఉక్కు తలుపు" అన్నాడు వగరుస్తూ.

యుగంధర్ తల ఊపి "మనం హంతకుడి ఇంటికే వచ్చామన్నమాట" అన్నాడు.

"వచ్చి ఏం ప్రయోజనం! ఈ చెరలోంచి మనం తప్పించుకోవాలిగా!"

"రాజుని, మీ సార్జంటు శివాన్ని కూడా, ఈ ఇంట్లోనే శత్రువు బంధించి ఉండాలి."

"ఔను. మనలా బందీలుగా ఉండి ఉంటారు. మనకేం సహాయం చేయగలుగుతారు!"

"బహుశా పద్మప్రియ, రాధ, మీనాక్షి కూడా ఇక్కడే ఉండి ఉంటారు."

"యుగంధర్! మనం ఈ గదిలోంచి బయటపడితేనేగా వాళ్ళని విడిపించడం?"

"ఎలాగైనా మనం తప్పించుకోవాలి" అన్నాడు యుగంధర్.

స్వరాజ్యరావు ఏదో చెప్పబోతుండగా "నేను వదిలితే గానీ మీరిద్దరూ ఆ గదిలోంచి ఒక్క అడుగు కూడా బయటపెట్టలేరు" అన్న మాటలు వినిపించాయి.

యుగంధరూ, ఇన్స్పెక్టర్ ఉలిక్కిపడి చూశారు.

"ఇంత సులభంగా మీరు నా ఇల్లు కనుక్కుంటారనుకోలేదు. విశాలమైన ఆవరణలో చాలా కష్టపడి ఈ ఇల్లు కట్టించాను. గదులన్నీ సౌండ్ ప్రూఫ్ చేయించాను. కిటికీలు ఎత్తుగా పెట్టించాను. యుగంధర్! మీరు బొంబాయి వెళ్ళారని తెలియగానే ఇక నేను త్వరపడాలనుకున్నాను."

యుగంధర్, ఇన్స్పెక్టర్ ఒకరిని ఒకరు చూసుకున్నారు.

"ఎవరు మీరు? వీరభద్రరావు గారేనా?" అడిగాడు యుగంధర్.

"అవును. కంఠస్వరం గుర్తుపట్టలేదూ?"

"ఈ లౌడ్ స్పీకర్లోంచి సరిగ్గా వినిపించడం లేదు. మమ్మల్ని అందర్నీ బంధించి ఏం చెయ్యదలచుకున్నారు?"

"ప్రభుత్వంతో బేరమాడేందుకు ఇప్పుడు అవకాశం ఎక్కువగా ఉందిగా! పద్మప్రియ, రాధల ప్రాణాలు, ప్రఖ్యాత డిటెక్టివ్ యుగంధర్, ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, సార్జంట్ శివం, మీ అసిస్టెంట్ రాజు, ఇందరి ప్రాణాలు బలి ఇస్తారో, శిరీష్ ని ఒదిలి పెడతారో చూడాలి!" అన్నాడు అతను నవ్వుతూ.

"మీరు పొరబడుతున్నారు. మేము ఇక్కడికి వస్తున్నట్లు పోలీసు కమీషనరుకి తెలుసు. ఇంకాసేపట్లో మీ ఇల్లు చుట్టుముడతారు."

"మీరు నన్ను బెదిరించడానికి అంటున్నారని నాకు తెలుసు. నిజంగానే పోలీసు సిబ్బంది ఈ ఇంటిని చుట్టుముట్టినా బేరం ఉండనే ఉంది. వాళ్ళల్లో ఒకడు కూడా దరిదాపులకి రాలేడు. మేడ మెట్లు ఎక్కేలోగా అందరి ప్రాణాలు ఎగిరిపోతాయి."

"పోలీసులు అటువంటి బెదిరింపులకు భయపడరు" అన్నాడు ఇన్స్పెక్టర్.

"చూద్దాం."

"వీరభద్రరావు గారూ, మీరు చాలా ఘోరమైన తప్పులు చేశారు. ఇంకా చేస్తున్నారు. మీ అబ్బాయి శిరీష్ నిర్దోషి అయితే అతన్ని విడిపించడానికి ఇది కాదు మార్గం" అన్నాడు యుగంధర్.

వీరభద్రరావు జవాబు చెప్పలేదు. అయిదు నిమిషాలు మైక్ కి దూరంగా వెళ్ళి ఉంటాడనీ, తను చెప్పింది విని ఉండడనీ అనుకున్నాడు.

30

తలుపు కొద్దిగా తెరుచుకుంది. సందులోంచి ఓ కన్ను కనిపించింది. రాజు, శివం అటే చూస్తున్నారు.

"తలుపుకి దూరంగా ఆ గోడ దగ్గరికి వెళ్లి, మొహాలు గోడ వేపు పెట్టి నిలుచోండి ఇద్దరూ" ముసలిదాని మాటలు వినిపించాయి.

"నిన్నేం చెయ్యములే!" అన్నాడు రాజు.

"ఉహూ. నేను చెప్పినట్లు చేస్తేనే మంచినీళ్ళు వస్తాయి."

రాజు సార్జంటుని చూసి కన్నుగీటాడు. ఇద్దరూ గోడ దగ్గిరికి వెళ్లి నిలబడ్డారు. మొహాలు గోడ వైపు పెట్టి చెవులు నిక్కపొడుచుకుని వింటున్నారు.

తలుపు తెరుస్తున్న చప్పుడు వినిపించలేదు గాని ఆ ముసలిది గదిలో అడుగుపెట్టడం వినిపించింది. రాజు వెంటనే వెనక్కి వొంగి మొగ్గ వేసి ఆ ముసలిదాని రెండు కాళ్ళూ పట్టుకుని లాగాడు. కిందపడేటప్పుడు చప్పుడు కాకుండా రెండు చేతులతో ముసలిదాన్ని గట్టిగా పట్టుకున్నాడు. ఒక్క గంటు వేసి శివం తలుపు దగ్గరికి ఉరికాడు. కానీ అప్పటికే ఆలస్యం అయింది. తలుపు మూసుకుంది.

"ఎట్లా మూసుకుంది?" అడిగాడు రాజు.

"ఏమో! ఆశ్చర్యంగా ఉంది. తలుపు వెనక ఇంకెవరో ఉండి ఉండాలి."

ముసలిది నిప్పులు కక్కుతూ ఇద్దరినీ చూసింది.

"అవతల ఎవరున్నారు?" అడిగాడు రాజు.

ఆ మనిషి పళ్ళు కొరుకుతూ "ఎవరూ లేరు. అది స్ప్రింగ్ తలుపు. తాళం చెవి బయట ఉంది" అన్నది.

రాజు ఒక్క గంతులో తలుపు దగ్గరికి వెళ్ళి లాగబోయాడు. అంతలో క్లిక్ మన్నది. బయట ఎవరో తాళం తిప్పి చెవి తీసేశారు. రెండు నిమిషాల తర్వాత "రాజూ! ఏమిటీ గొడవ? గొడవ చెయ్యొద్దని చెప్పలేదూ!" అన్న మాటలు వినిపించాయి.

"వెంటనే తలుపు తియ్యి. లేకపోతే ఈ ముసలిదాని ఎముకలు విరిచేస్తాను" అన్నాడు రాజు.

"సారీ బ్రదర్! ఆ ముసలిది నా బంధువురాలు కాదు. దాన్ని ఎంత హింసించినా ప్రయోజనం ఉండదు."

అతన్ని లొంగదీసే మార్గం వేరే ఏదీ తోచక రాజు మౌనంగా ఉండిపోయాడు.

చిన్ననవ్వు వినిపించింది. "రాజూ! యుగంధర్, స్వరాజ్యరావు కూడా ఇక్కడే నా బందీలుగా ఉన్నారు. మీకు సహాయం చేసే స్థితిలో లేరు. ఆయన వచ్చి నిన్ను విడిపిస్తారని ఆశించక."

"అబద్ధం. నేను నమ్మను."

"అలాగా! అయితే విను."

యుగంధర్, స్వరాజ్యరావు సంభాషణ రాజుకి వినిపించింది. 'ఈ చెరలోంచి మనం తప్పించుకునే అవకాశం లేదంటారా?' స్వరాజ్యరావు ప్రశ్న. 'అసాధ్యం అని నేను అనుకోను చాలా కష్టం' యుగంధర్ జవాబు.

"విన్నావా? ఇప్పుడైనా నమ్ముతావా?" వీరభద్రరావు అడిగాడు.

రాజు జవాబు చెప్పలేదు.

"గొడవ చెయ్యకుండా బుద్ధిగా ఉండండి" అన్నాడు వీరభద్రరావు.

# 31

"యుగంధర్ గారూ!" లౌడ్ స్పీకర్లోంచి పిలుపు వినిపించింది.

"ఆ!"

"ఆ మూల ఉన్న బల్ల సొరుగులో తెల్లకాగితాలు, కలం ఉన్నాయి."

"అలాగా."

"దయచేసి గవర్నర్ కి ఓ ఉత్తరం రాయండి. మీరూ, ఇన్స్పెక్టర్ సంతకాలు పెట్టండి."

"ఏమని?"

"నా షరతులు ఒప్పుకుని శిరీష్ ని వదిలిపెట్టమని."

"రాస్తానని ఎందుకనుకుంటున్నారు మీరు?"

"మీ మంచి కోసమే! మీ అందరి ప్రాణాలు నా చేతుల్లో ఉన్నాయి."

"నాకు ప్రాణాపాయం కలిగినప్పుడల్లా హంతకులు చెప్పినట్లు చేసే మనిషినని మీకు ఎవరు చెప్పారు?"

"ఎవరూ చెప్పలేదు. ఆ మాత్రం వివేకం వుంటుందనుకున్నాను. నిష్కారణంగా మీ అందరి ప్రాణాలు బలి ఇస్తారనుకోలేదు."

"మేము ప్రాణాలు బలి ఇస్తామో లేదో తర్వాత కానీ తేలదు."

"మీరు చాలా మొండిగా ప్రవర్తిస్తున్నారు. మీ ఒక్క ప్రాణమే కాదు. రాజు, సార్జంటు శివం, ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, రాధ, పద్మప్రియ ఇందరి ప్రాణాలు ఉండేదీ పోయేదీ మీమీద ఆధారపడి ఉంది. ప్రాణాలు తియ్యడానికి నేను వెనకాడే మనిషిని కానని మీకు తెలుసు."

"నేను గవర్నరుకి ఉత్తరం రాస్తే మీ అబ్బాయిని వదిలిపెడతారని మీకు నమ్మకమేమిటి?"

"మీ సలహాకి అంత విలువ ఉందని నాకు తెలుసు."

"ఆ విలువ మీరు చెప్పినట్లు చేస్తే పోదూ!"

"నిజమే! కానీ ప్రాణం విలువ కన్నా మాట విలువ ఎక్కువా?"

"మనిషిని బట్టి విలువలు ఉంటాయి. ఆ విషయం చర్చించి ప్రయోజనం లేదు."

అయిదు నిముషాలు నిశబ్దంగా ఉంది. తరవాత పెద్ద ఏడుపు, 'అబ్బా! నెప్పి!' అన్న అరుపులు వినిపించాయి. అది రాధ అయి ఉంటుందనుకున్నాడు యుగంధర్.

"నువ్వు మనిషివా, రాక్షసుడివా! పసిపిల్లని అలా హింసిస్తావేమిటి!" పద్మప్రియ అరిచింది.

యుగంధర్ కి చెవులు తూట్లు పడుతున్నట్టయింది. రాధని హింసిస్తున్న దృశ్యం కళ్ళకు కట్టినట్లు కనపడుతోంది.

"ప్రతి గదిలోనూ లౌడ్ స్పీకర్. మైక్రోఫోన్ ఏర్పాటు చేశాడు. ఒకదానికొకటి కనెక్టు చేస్తున్నాడు" అన్నాడు ఇన్స్పెక్టర్ యుగంధర్ మనస్సు ఆ కేకల నుంచి మళ్ళించడానికి. రాధ కెవ్వుమని కేకలు పెడుతూ ఏడుస్తోంది.

"ఆగు! ఆగు! ఆ పసిదాన్ని ఏం చెయ్యక. నీకు హింసించాలని ఉంటే నన్ను హింసించు" అరుస్తోంది పద్మప్రియ.

"నిన్ను తర్వాత. ముందు ఈ పిల్లని."

యుగంధర్ గిలగిల కొట్టుకుపోతున్నాడు. రాధని అతను హింసించడం భరించలేకపోతున్నాడు. "ఆపు ఆ హింస. ఉత్తరం రాస్తాను" అని అరిచాడు.

"యుగంధర్ గారూ!" పద్మప్రియ అరిచింది. లౌడ్ స్పీకరు నిశబ్దం అయిపోయింది.

# 32

**"ఇది డిటెక్టివ్** యుగంధర్ దస్తూరేనా?" అడిగాడు గవర్నర్.

ఐ.జి. ఉత్తరం తీసుకుని చూసి పోలీసు కమీషనర్ కి ఇచ్చాడు. ఆయన పరీక్షగా చూసి "అవును. యుగంధర్ దస్తూరే. స్వరాజ్యరావు సంతకం కూడా ఉంది" అన్నాడు.

"ఏం చేద్దాం?" అడిగాడు గవర్నర్ ముఖ్యమంత్రిని.

"ఏం చేస్తే మంచిదో ఇన్స్పెక్టర్ జనరల్ సలహా ఇవ్వాలి" అన్నాడు ముఖ్యమంత్రి.

"నిజంగా ఏదో ఘోరమైన ఆపదలో ఉంటే గానీ యుగంధర్ అట్లా వ్రాయరు" అన్నాడు కమీషనర్.

"ఈ పరిస్థితుల్లో శిరీష్ ని ఒదిలిపెట్టడమే మంచిదనుకుంటాను" చెప్పాడు ఐ.జి.

"ఒదిలిపెట్టి మన డిటెక్టివ్ లని అతన్ని వెంబడించమందాం" సలహా ఇచ్చాడు ముఖ్యమంత్రి.

"వీరభద్రరావు చాలా జాగ్రత్తపడతాడు. అతను కానీ, శిరీష్ కానీ దొరకరు. వాళ్ళిద్దరూ ఇంకో దేశం క్షేమంగా చేరుకునేవరకూ యుగంధరూ, మిగతావాళ్ళూ బందీలుగా ఉండే ఏర్పాటు చేస్తాడు" అన్నాడు కమీషనర్.

"ఆ సంగతి తరవాత చూడవచ్చు. ఇప్పుడు శిరీష్ ని వదిలిపెట్టుతామని వీరభద్రరావుకి తెలియచెయ్యాలా?" అడిగాడు గవర్నర్.

"ఏం చెయ్యవలసిందీ యుగంధర్ రాసిన ఉత్తరంలోనే ఉందిగా! ఉత్తరం అందిందనీ, అంగీకరిస్తున్నామనీ సాయంకాలం వచ్చే డెయిలీ న్యూస్ పత్రికలో ప్రకటించమనీ, మర్నాడు శిరీష్ ని వదిలిపెట్టమనీ రాశాడు" చెప్పాడు కమీషనర్.

"అయితే ఆ ఏర్పాటు చేయించండి" అన్నాడు గవర్నర్.

★★★

"యుగంధర్! యుగంధర్!" పిలిచాడు వీరభద్రరావు లౌడ్ స్పీకర్లోంచి.

"ఆ."

"థాంక్సు. మెనీ థాంక్సు. ప్రభుత్వం అంగీకరించింది. మీరు చెపితే ఒప్పుకుంటారని నాకు తెలుసు. మిమ్మల్నందరినీ రేపే ఒదిలిపెట్టే ఏర్పాటు చేస్తాను."

"పత్రికలో ప్రకటించారా?"

"అవును. మీకు చూపిస్తాను" ఉత్సాహంగా చెప్పాడు వీరభద్రరావు.

యుగంధరూ, ఇన్స్పెక్టరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

ఓడిపోయామన్న దిగులు ఇన్స్పెక్టరు మోహంలో స్పష్టంగా కనిపిస్తోంది.

పత్రిక ఇవ్వడానికి తలుపు తెరుస్తాడు. ఆ అవకాశం ఉపయోగించుకోవాలని అనుకుని యుగంధర్ తలుపు దగ్గరికి జరిగాడు. నెమ్మదిగా తలుపు కొద్దిగా తెరుచుకుంది. వేలు కూడా సరిగ్గా పట్టనంత సందు ఏర్పడింది. ఆ సందులోంచి పత్రిక లోపలి తోస్తున్నారెవరో.

తను తలుపు తోసి ప్రయోజనం లేదని యుగంధర్ కి తెలుసు. అవతల ఉన్న మనిషి వెంటనే మూసేస్తాడు. బయటికి తెరుచుకునే తలుపు అది. బయటినించి నొక్కిపడితే తను ఎంత తోసినా లాభం ఉండదు.

పత్రిక లోపలి వచ్చేస్తోంది.

చటుక్కున యుగంధర్ జేబులోంచి తాళం చెవుల గుత్తి తీశాడు. అందులో చిన్న స్క్రూ డ్రైవర్ ఉంది. దాన్ని తలుపు కింద రెండు రెక్కలకీ మధ్యలో ఉన్న సందులో దూర్చి కాలితో నొక్కిపెట్టాడు.

పత్రిక లోపల పడ్డది. ఇన్స్పెక్టర్ తీసుకున్నాడు. తలుపు మూయబోతే పూర్తిగా మూసుకోకపోయేటప్పటికి "యుగంధర్! తలుపు సందులో ఏం పెట్టారు?" అడిగాడు వీరభద్రరావు తలుపు అవతల నుంచి.

"పత్రిక తీసుకున్నాను" అన్నాడు యుగంధర్.

"తలుపు సరిగా మూసుకోకుండా ఏదో దూర్చారు. తీసెయ్యండి" విసుగ్గా అన్నాడు వీరభద్రరావు.

యుగంధర్ మాట్లాడలేదు.

"ఆ మాత్రం సందు ఉంటే ఏం చెయ్యగలరు! తలుపుకి అడ్డంగా గొలుసు ఉంది."

యుగంధర్ జవాబు చెప్పలేదు.

"ఆల్ రైట్! గుడ్ బై యుగంధర్!"

గొలుసు చప్పుడయింది. యుగంధర్ తలుపు సందులో చెవి పెట్టి వింటున్నాడు. అడుగుల చప్పుడు దూరం అయింది. తర్వాత నిశబ్దం. జేబులోంచి రెండు వస్తువులు తీశాడు. ఒకటి చాకు. రెండోది గోళ్ళు అరగదీసే చిన్న ఫైల్. మాట్లాడవద్దని ఇన్స్పెక్టర్ కి సౌంజ్ఞ చేసి, తలుపుకి అడ్డంగా గొలుసు ఉన్నచోట చాకు దూర్చి, సందులో ఆ చిన్న ఫైలు పెట్టి ఆ గొలుసుని అరగదీయడం ప్రారంభించాడు.

33

"రేపు మీరందరూ మీ ఇళ్ళకి వెళ్ళిపోవచ్చు" అన్నాడు వీరభద్రరావు.

పద్మప్రియ రాధని గట్టిగా పట్టుకుని గదిలో ఓ మూల నిలుచున్నది. మీనాక్షి భయంతో గజగజ వణుకుతోంది.

"నా పని పూర్తి అయింది. శిరీష్ ని ఒదిలిపెడతామని ప్రభుత్వం తెలియజేసింది. మీనాక్షీ!"

"ఆ."

"నువ్వు నాతో రావాలి."

"ఎక్కడికి?"

"అవతల గదిలోకి."

"ఎందుకు?" అడిగింది మీనాక్షి భయంతో.

"ప్రశ్నలు అడిగే తాహుతు లేదు నీకు. రా" అని చెయ్యిపట్టి లాగాడు అతను.

"దేనికి? మీనాక్షిని ఏం చేస్తారు?" అడిగింది పద్మప్రియ.

"నిజం చెప్పించడానికి ప్రయత్నిస్తాను."

"ఇంకెందుకు? మీ అబ్బాయిని ఒదిలిపెడుతున్నారుగా."

"నిజంగా నా కొడుకు నిర్దోషి అనీ, నేను వృథాగా శ్రమ పడలేదనీ తృప్తి కోసం" అని మీనాక్షి చెయ్యి పట్టుకుని చరచరా లాక్కెళ్ళాడు వీరభద్రరావు.

★★★

యుగంధర్ ఆ చిన్న ఫైలుతో గొలుసుని అరగంట అరగదీశాడు. గొలుసు కనిపించడం లేనందువల్ల ఎంత అరిగిందో ఇంకా ఎంతసేపు అలా అరగదియ్యాలో తెలియలేదు.

"కాసేపు నాకివ్వండి" అన్నాడు ఇన్స్పెక్టర్ యుగంధర్ చెవిలో.

యుగంధర్ తల విదిలించి "చెయ్యి తియ్యడానికి వీలు లేదు. తీస్తే అరిగిన చోట గాక ఇంకొక చోట అరగదియ్యాల్సి రావచ్చు" అని తన పనిలో నిమగ్నుడైనాడు. ఆట్టే చప్పుడు కావడం లేదు. కొద్దిగా గరగరమంటోంది. అయినా ఆ చిన్న చప్పుడే వీరభద్రరావుకి వినిపిస్తుందేమో, వచ్చి గొలుసు పక్కకి లాగేస్తాడేమోన్న భయం ఒక పక్కా, గొలుసు ఎంత లావుందో ఇంకా ఎంతసేపు అరగదియ్యాలో అన్న విసుగు ఒక పక్కా విసిగిస్తున్నాయి. నుదురు మీద చెమట చుక్కలు మెరుస్తున్నాయి. చేతివేళ్ళు వొంకరవుతున్నాయి. మెడ నెప్పి పెడుతోంది. అయినా యుగంధర్ తన పని ఆపలేదు. గర గరమని అరగతీస్తూనే ఉన్నాడు.

## 34

గదిలో ఒక బల్ల మీద టేప్ రికార్డర్, ఇంకో బల్ల మీద స్పిరిట్ లాంపు, రెండు కత్తెరలు, రెండు సూదులు, ఒక చాకు ఉన్నాయి.

మీనాక్షి కుర్చీలో టేప్ రికార్డర్ ముందు కూర్చున్నది. వీరభద్రరావుని బిత్తరపోయి చూస్తోంది.

"మీనాక్షీ! నిన్ను హింసించడం నాకు ఇష్టం లేదు. తప్పనిసరి అయితేగాని హింసించను. ఇప్పుడైనా నిజం చెప్పెయ్యి" అన్నాడు వీరభద్రరావు మీనాక్షి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

మీనాక్షి కళ్ళు తిప్పెయ్యడానికి ప్రయత్నించింది. కానీ తిప్పలేకపోయింది. వీరభద్రరావు స్పిరిట్ లాంపు వెలిగించి రెండు సూదులూ మంట మీద పెట్టి ఎర్రగా కాల్చాడు. రెండూ రెండు చేతుల్లో పట్టుకుని మీనాక్షి చెంపల దగ్గిర పెట్టాడు.

"ఊ చెప్పు! చెపుతావా, చెప్పవా?" అంటూ ఉరిమి చూశాడు.

మీనాక్షి తల వంచుకుంది.

"తల పైకెత్తి ఈ సూదులు చూడు. నువ్వు నిజం చెప్పితే నిన్నేం చెయ్యను. నువ్వు దోషివని తెలిసినా ఏం చెయ్యను. నా కొడుకుని వదిలిపెడుతున్నారు. నాకు కావలసింది అంతే. నువ్వెట్లాపోతే నాకేం!"

మీనాక్షి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. "మీరు నన్ను చంపేస్తారు" అన్నది ఏడుస్తూ.

"పిచ్చిదానా! ఎందుకు చంపుతాను! శిరీష్ ని వదిలిపెడుతున్నారుగా!"

"అయితే రికార్డు చెయ్యడం దేనికి?" ఏడుస్తూనే అడిగింది మీనాక్షి.

"నువ్వు తర్వాత అబద్ధం చెప్పకుండా ఉండేందుకు."

మీనాక్షి దుఃఖం దిగమింగి, పెదిమలు తడిచేసుకుని, గొంతు సవరించుకుని ఏదో చెప్పబోయింది. వీరభద్రరావు మనస్సంతా లగ్నం చేసి ఆమెను చూస్తున్నాడు.

# 35

గల్లుమని చప్పుడయింది. గొలుసు ఊడిపోయింది. యుగంధర్ తలుపు తోశాడు. తెరుచుకుంది. జేబు రుమాలుతో నుదుటిమీది చెమట తుడుచుకుని, చేత్తో వేళ్ళు నలుపుకుని, బరువుగా ఊపిరి పీల్చి "పదండి" అన్నాడు ఇన్స్పెక్టరుతో.

"మన దగ్గిర ఆయుధాలేమీ లేవే!" అన్నాడు స్వరాజ్యరావు.

యుగంధర్ నవ్వి "ఇవి చాలు" అని రెండు చేతులూ చూపించి, గదిలోంచి బయిటికి వెళ్ళాడు.

"రాజూ, శివం బంధింపబడిన గది ఇదేననుకుంటాను" అన్నాడు స్వరాజ్యరావు.

తలుపుకి తాళం చెవి తగిలించి ఉంది.

"జాగ్రత్త" అని హెచ్చరించాడు యుగంధర్.

చప్పుడు కాకుండా తాళంచెవి తిప్పాడు ఇన్స్పెక్టరు. క్లిక్ మన్నది. నెమ్మదిగా తలుపు తోశాడు. సార్జంటు శివం మొహం కనిపించగానే నోటి మీద వేలు పెట్టుకుని చప్పుడు చెయ్యవద్దని హెచ్చరించాడు.

రాజు యుగంధర్నీ, స్వరాజ్యరావునీ చూడగానే చటుక్కున పక్కకి తిరిగి ఆ ముసలిదాని నోటి మీద అరిచెయ్యి పెట్టి గట్టిగా నొక్కి ఉంచాడు. ముసలిది గిలగిలా తన్నుకోవడం ప్రారంభించింది. సార్జంటు జేబులోంచి రుమాలు తీసి ఆమె నోట్లో కుక్కి, గుడ్డ పీలికతో నోరు గట్టిగా కట్టేశాడు.

"గుడ్! ఆ ముసలిది అరిచి ఉంటే ప్రమాదమయ్యేది" అన్నాడు యుగంధర్ రహస్యంగా.

రాజు సంతోషం పట్టలేకుండా ఉన్నాడు. తను విముక్తి కావడమే కాక యుగంధర్ కూడా తప్పించుకున్నాడు. అంతకన్నా ఏం కావాలి!

"ఈ ఇంట్లో ఎన్ని గదులు ఉన్నాయో, ఎక్కడ ఏ గది ఉన్నదో తెలుసా?" అడిగాడు యుగంధర్.

తెలియదని రాజు తల తిప్పాడు.

"ఆ ముసలిదాన్ని కదలకుండా కట్టెయ్యండి" చెప్పాడు యుగంధర్.

రాజు, శివం కలిసి ఆ పని చేశారు.

"తరవాత?" అడిగాడు రాజు.

"పదండి" చెప్పాడు యుగంధర్.

అడుగులో అడుగు వేసుకుంటూ చప్పుడు కాకుండా ఒకళ్ళ వెనక ఒకళ్ళు నడిచారు. నడవా చివరవరకూ వెళ్ళాక ఒక గదిలోంచి మాటలు వినిపించాయి. యుగంధర్ తలుపుకి చెవి ఆనించి విన్నాడు. తను విన్నదానిని బట్టి మాట్లాడుతున్నది మీనాక్షి అని తెలుసుకున్నాడు. తలుపు నెమ్మదిగా తోశాడు. చిన్న సందు ఏర్పడింది రెండు రెక్కల మధ్యా. ఆ సందులోంచి చూశాడు. మీనాక్షి ముందు టేపురికార్డర్, ఎదురుగా కుర్చీలో వీరభద్రరావు కనిపించారు. రికార్డులో టేపు తిరుగుతోంది. "శేషాద్రిని చూస్తే నాకు

ఏమాత్రం ఇష్టం లేదు. అతనంటే పరమ అసహ్యం. కానీ ఏం చెయ్యను! అతనికి నా రహస్యం తెలుసు. నేను స్కూలు ఫైనల్ చదువుతుండగా అతనితో స్నేహం అయింది. మంచీ చెడ్డా తెలియని వయస్సు. లోకజ్ఞానం అసలే లేదు. శేషాద్రి రూపం చూసి మురిసిపోయాను. అతని మాటలు విని మోసపోయాను. నాన్నగారికి తెలిసి అతన్ని పెళ్ళి చేసుకోడానికి వీల్లేదన్నారు. ఆలోచించాను. బీదవాడు. ఆజన్మాంతమూ అతనితో దారిద్ర్యం అనుభవించడం ఇష్టం లేకపోయింది. అతని మీద మోజు పోయింది. కడుపు తీసేశారు. తరవాత శిరీష్ తో స్నేహం అయింది. శిరీష్ ని పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. ఆ విషయం శేషాద్రి గ్రహించాడు. నేను రాసిన ఉత్తరాలు అతని దగ్గిర ఉన్నాయి. శిరీష్ కి చూపిస్తాననీ, నా రహస్యం బట్టబయలు చేసి అసలు పెళ్ళి కాకుండా చేస్తాననీ నన్ను బెదిరించాడు. ఏం చెయ్యడానికీ తోచలేదు. నిజం శిరీష్ కి తెలియకూడదు. అందుకే శిరీష్ కన్నా శేషాద్రి మీద ఇష్టం ఉన్నట్టు నటించాను. రాత్రి నన్ను తన గదికి రమ్మన్నాడు శేషాద్రి. ఎందుకో చెప్పలేదు. వెళ్ళాను. పూర్వం ఉన్న చనువు కొద్దీ నన్ను బలవంతం చెయ్యబోయాడు. నన్ను ముట్టుకోవద్దనీ చెప్పాను. అతను వినిపించుకోలేదు. వెకిలిగా నవ్వి నా జీవితం తన అరిచేతిలో వున్నదనీ, తను చెప్పినట్లు వినక తప్పదనీ అన్నాడు. అతన్ని చంపాలని అప్పుడు నిశ్చయించుకుని లొంగిపోతున్నట్టు నటించాను. దీపం ఆర్పివేయగానే అలమారులో ఉన్న కత్తి తీసుకుని బలంగా పొడిచాను" చెప్పింది మీనాక్షి.

"ఆ కత్తినేం చేశావు?" అడిగాడు వీరభద్రరావు.

"నా దగ్గిరే ఉంది. మా ఇంట్లో దాచాను."

"ఇంట్లో ఎక్కడ దాచావు?"

"పూజ గదిలో. కృష్ణ విగ్రహం వెనక."

"ఆ రాత్రి నువ్వు ఇంటికి ఎన్ని గంటలకి వెళ్ళావు?"

"చాలా ఆలస్యంగా వెళ్ళాను."

"నువ్వు తొమ్మిది గంటలకే ఇంటికి వచ్చావని మీ నాన్న, మీ వాళ్ళు అబద్ధం చెప్పారన్నమాట."

"అవును."

"నువ్వు శేషాద్రిని హత్య చేశావని మీ నాన్నకి తెలుసా?"

"తెలియదు. నాన్నగారు అడిగారు. అబద్ధం చెప్పాను. నన్ను కాపాడటానికి ఆయనా అబద్ధం చెప్పారు."

"థాంక్సు మీనాక్షీ! శేషాద్రిని హత్య చేసినందుకు నిన్నేమనను. అటువంటి నీచుడు చావవలసిందే! రేపు నిన్నూ, పద్మప్రియనీ, రాధనీ, యుగంధర్ – రాజులనీ, ఇన్స్పెక్టరు స్వరాజ్యరావునీ, సార్జంటు శివంనీ, విడిచిపెట్టే ఏర్పాటు చేస్తాను రేపు సాయంత్రం" చెప్పాడు వీరభద్రరావు.

"మీరు?" అడిగింది మీనాక్షి.

"రేపు పొద్దున్నే వెళ్ళిపోతాను. ఆ ముసలిది మిమ్మల్ని ఒదిలిపెడుతుంది."

యుగంధర్ అంతవరకూ వాళ్ళ సంభాషణ విని అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకి నడిచాడు.

వీరభద్రరావు వీపు తలుపు వేపు ఉంది. మీనాక్షి యుగంధర్ని చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచింది. వీరభద్రరావు చటుక్కున వెనక్కి తిరిగాడు. అతను జేబులో చెయ్యి పెట్టబోతుండగా యుగంధర్ ఒక్క ఉరుకు ఉరికి వీరభద్రరావుని రెండు చేతుల మధ్యా బంధించాడు.

వీరభద్రరావు గింజుకోలేదు. రాజునీ, ఇన్స్పెక్టర్నీ, సార్జంటునీ చూశాడు. అపజయం గ్రహించి చిన్నగా నవ్వుతూ "మీరే గెలిచారు" అన్నాడు యుగంధర్ తో.

ఇన్స్పెక్టర్ వీరభద్రరావు జేబులు వెతికి పిస్తోలు తీసుకున్నాడు. తర్వాత తాళ్ళతో అతని చేతులు కట్టేశాడు.

"ఇన్స్పెక్టర్! హెడ్ క్వార్టర్సుకి ఫోన్ చెయ్యండి" చెప్పాడు యుగంధర్.

"కింద హాల్లో ఉంది టెలిఫోను" అన్నాడు వీరభద్రరావు.

ఇన్స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

"యుగంధర్! శిరీష్ నిర్దోషి. మీనాక్షి జరిగినది అంతా చెప్పేసింది. ఆ టేప్ రికార్డర్ వెనక్కి తిప్పండి" అన్నాడు వీరభద్రరావు.

"అవసరం లేదు. అంతా విన్నాను."

"అయితే శిరీష్ ని వదిలిపెట్టిస్తారా?"

"అది నా చేతిలో లేదు. శిరీష్ నిర్దోషి అయితే ప్రభుత్వం అతన్ని ఒదిలేస్తుంది. మీరు చేసిన హత్యలకి కారణం అతనయినా బాధ్యుడు కాడుగా!"

"థాంక్యూ యుగంధర్! నిర్దోషి అని తెలిశాక వాడిని ఒక్క క్షణం కూడా జైలులో ఉంచడానికి మీరు ఒప్పుకోరని నాకు తెలుసు. శిరీష్ ని ఒదిలిపెడితే చాలు. అంతే నాకు కావలసింది. నేను పడ్డ శ్రమ వృథా కాలేదన్న తృప్తి ఉంటుంది నాకు. నన్ను ఉరి తీస్తే తియ్యనివ్వండి. నాకు విచారం లేదు. నేను సాధించదలుచుకున్నది సాధించాననే తృప్తితో ఉరికంబం ఎక్కుతాను" అన్నాడు వీరభద్రరావు.

"వీరభద్రరావు గారూ.. మీరు విద్యావంతులు. సంస్కారం, వివేకం ఉండవలసినవాళ్ళు. మీరు ఈ ఘోరాలు చెయ్యడం ఎంత తప్పో ఇప్పుడన్న మాట కూడా అంత తప్పు" అన్నాడు యుగంధర్.

వీరభద్రరావే గాక రాజు, స్వరాజ్యరావు కూడా యుగంధర్ని ఆశ్చర్యంతో చూశారు.

"ఏదో సాధించాననే తృప్తి ఎలా ఉంటుంది మీకు? ఏమిటా తృప్తి! తమ వృత్తిధర్మం చక్కగా నిర్వహించి సజ్జనులుగా పేరు తెచ్చుకున్న రిటయిర్డ్ సూపరింటెండెంట్ మాధవన్నీ, ప్రాసిక్యూటర్ గోవిందస్వామినీ హత్య చెయ్యడమా తృప్తి! లేక నాలుగేళ్ళ పిల్లనీ, పద్దెనిమిదేళ్ళ యువతినీ ఎత్తుకురావడమా తృప్తి! ఏమిటా తృప్తి!" అడిగాడు యుగంధర్ కోపంగా.

వీరభద్రరావు తల వంచుకుని "శిరీష్ మీద అన్యాయంగా మోపబడిన నేరం, విధింపబడిన శిక్ష రద్దు చేయించగలిగినందుకు తృప్తి" అన్నాడు నెమ్మదిగా.

"ఈ ఘోరాలు, ఈ హత్యలు, ఈ హింసలు చెయ్యకుండా అప్పుడే నన్ను కలుసుకుని ఉంటే శిరీష్ నిర్దోషిత్వం ఎందుకు రుజువు చెయ్యలేకపోయేవాళ్ళం! మీరు లాయర్! ఎన్నో సంవత్సరాలు కోర్టులలో ప్రాక్టీసు చేశారు. మన కోర్టులలో న్యాయం జరిగేదీ లేనిదీ మీకు తెలియదా?" అడిగాడు యుగంధర్.

"అప్పీలులో కేసు పోయేటప్పటికి ఇక నాకు ఆశ పోయింది."

"అయితే ఇప్పుడు శిరీష్ ని ఒదిలిపెట్టుతారని ఎలా ఆశ పడుతున్నారు?"

"మీనాక్షి తను హత్య చేసినట్లు అంగీకరించిందిగా!"

యుగంధర్ వీరభద్రరావుని సూటిగా కళ్ళల్లోకి చూస్తూ "మీరు చేసిన హత్యల వల్లే మీనాక్షి నేరం ఒప్పుకుందా?" అడిగాడు.

"లేదనుకోండి."

"సాధించదలుచుకున్న పని మంచిదైతే కావొచ్చు. అందుకు అవలంబించే మార్గాల గురించి ఆలోచించాలి. ఉత్తమోత్తమ లక్ష్యం అయినా దుష్ట మార్గాల ద్వారా సాధిస్తే సాధించిన ఫలితం ఉండదు" అన్నాడు యుగంధర్.

వీరభద్రరావు కళ్ళల్లో నీళ్ళు నిండాయి. కోటుతో కళ్ళు తుడుచుకుంటూ "అవును యుగంధర్ గారూ! ఇప్పుడు అర్థమైంది. నేను తప్పు చేశాను. ఈ హింస, ఈ దౌర్జన్యం, ఈ హత్యలు చేసి ఉండవలసిన అవసరం లేదు. మీ సహకారం కోరినట్లయితే శిరీష్ ని ఒదిలిపెట్టేందుకు ప్రయత్నించి ఉండేవారు. నా మాట నమ్మండి. నే చేసిన దుష్కార్యాలకి పరితపిస్తున్నాను" అన్నాడు.

"ఎంత తెలివైనవాళ్ళు కూడా, వివేకం ఉన్నవాళ్ళు కూడా ఒక్కొక్క సందర్భంలో చెయ్యకూడని పనులు చేసి తరువాత పరితపిస్తారు. అదే వచ్చిన చిక్కు" అని "రాధ, పద్మప్రియ ఎక్కడున్నారు?" అడిగాడు యుగంధర్.

"కుడివైపున ఉన్న రెండో గదిలో క్షేమంగా ఉన్నారు."

"ట్రంకుపెట్టెలో పెట్టి నాకు పంపిన శవం ఎవరిది?"

"ఎవరో అనామకురాలు. నేను చంపలేదు. కారు ఆక్సిడెంటులో పోయింది. శవాన్ని ఎవరూ గుర్తు పట్టలేదు. నా కూతురు అని చెప్పి శవాన్ని తెచ్చుకున్నాను."

"ఆ ముసలిది ఎవరు?"

"డబ్బుకోసం నే చెప్పిన పనులన్నీ చేసింది. పాపం! క్షమించండి దాన్ని. అది దేనికీ బాధ్యురాలు కాదు. తప్పు చేస్తున్నానని దానికి తెలియనే తెలియదు" అన్నాడు వీరభద్రరావు.

అంతలో పోలీస్ వాన్ వచ్చింది. ఎ.సి. ఇద్దరు కానిస్టేబుల్స్ తో లోపలికి వచ్చాడు.

"ఇతనే హంతకుడు. తీసుకువెళ్ళండి" చెప్పాడు యుగంధర్.

"యుగంధర్! మెనీ థాంక్స్. గవర్నరు బంగళాలో పార్టీ ఏర్పాటు చేస్తున్నారు. మిమ్మల్నందర్నీ రమ్మన్నారు" అని చెప్పి వీరభద్రరావుని తీసుకురమ్మని కానిస్టేబుల్స్ కి చెప్పాడు ఎ.సి.

వీరభద్రరావు లేచి నిలబడి యుగంధర్ వేపు చూసి "యుగంధర్! మీరు చెప్పినది నిజం. లక్ష్యం మంచిదైనా దాన్ని సాధించడానికి చెడ్డమార్గాలు అవలంబిస్తే ఫలితం దక్కదు. నా కొడుకు విడుదల కావడం చూసే ప్రాప్తి నాకు లేకుండా పోయింది. శలవు" అని కానిస్టేబుల్సుతో వెళ్ళిపోయాడు.